ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 20.07.2025 | సంపుటి :12 సంచిక : 01 | పేజీలు :12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం



తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



హైదరాబాద్ ఎంసీహెచ్ఆర్‌డీలో కులగణనపై 300 నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందిస్తున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ.. చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు , ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, అధికారులు తదితరులు

# కులగణన డేటా.. సామాజిక అభివృద్ధి వాటా

## ఇది తెలంగాణ మెగా హెల్త్ చెకప్ : సీఎం రేవంత్ రెడ్డి

### కులగణనపై ప్రభుత్వానికి 300పేజీల నివేదిక ఇచ్చిన స్వతంత్ర నిపుణుల కమిటీ

- రాష్ట్రంలోని బలహీనవర్గాల అభ్యున్నతికి ఈ నివేదిక ఉపయోగపడుతుంది
- రాష్ట్రంలో నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమైంది
- రాహుల్ హామీ మేరకు విజయవంతంగా పూర్తిచేశాం
- వెనుకబాటులో గ్రామీణ,పట్టణ ప్రాంతాల మధ్య తేడాలు, వాటికి కారణాలను కూడా అధ్యయనం చేయాలని కమిటీకి సూచించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో జరిగిన కులగణన కేవలం డేటా సేకరణ కాదని.. ఇది తెలంగాణ మెగా హెల్త్ చెకప్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి, సామాజిక న్యాయం అమలు చేసేందుకు కులగణన ఉపయోగపడుతుందన్నారు. కులగణనపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. 300 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కులాల వారీగా వెనుకబాటుతనాన్ని విశ్లేషించిన కమిటీ.. కొత్త పాలసీలతో పాటు ప్రస్తుత విధానాలను మెరుగుపరిచేందుకు అవసరమైన సూచనలను నివేదికలో పొందుపర్చింది. కమిటీ సూచనలపై కేబినెట్‌లో చర్చించి మిగతా 2లో..

# హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేశ్ కుమార్ ప్రమాణం



రాజ్‌భవన్‌లో హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేశ్ కుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో సీఎం రేవంత్

### రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
### కార్యక్రమానికి సీఎం రేవంత్ తదితరులు హాజరు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్‌లో మధ్యాహ్నం 12:30 గంటలకు జస్టిస్ ఏకే సింగ్‌తో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు, డీజీపీ, హైకోర్టు న్యాయమూర్తులు, తెలంగాణ మంత్రులు తదితరులు హాజరయ్యారు. కాగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన తర్వాత జస్టిస్ ఏకే సింగ్ ఏడవ చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. త్రిపుర హైకోర్టు సీజేగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తెలంగాణకు వచ్చారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ సుజయ్ పాల్ కోల్‌కతా హైకోర్టుకు బదిలీ మిగతా 2లో..

# ముసురుగ్గా నైరుతి..



- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం
- రోడ్లన్నీ జలమయంతో వాహనాదారుల ఇక్కట్లు
- భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
- హైదరాబాద్ వాసులకు మంత్రి పొన్నం సూచన
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వానలు

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. జవహర్‌నగర్‌లో రోడ్లపై భారీగా వరద ప్ర వహించింది శ్రీవేంకటేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గ్రేటర్ పరి ధిలో మరోసారి కుండపోతగా వర్షం కురిసింది. జీడిమెట్ల, కొంపల్లి, సుచిత్ర, బాలానగర్, మిగతా 2లో..

## హైకోర్టు న్యాయమూర్తికి సీఎం పరామర్శ

వార్త 2లో

## పదేళ్లు తానే సీఎం అని చెప్పడం సరికాదు

ఇది కాంగ్రెస్ విధానాలకు పూర్తిగా వ్యతిరేకం

ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలపై రాజగోపాల్ అభ్యంతరం 2లో

## మాల్దీవులకు మోదీ

దౌత్య విభేదాల తర్వాత తొలిసారి పర్యటన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 మిగతా 2లో..





# వానాకాలం పంటలకు నీటివిడుదలకు కట్టుదిట్టమైన చర్యలు

### సాగునీటి అంశంలో రైతాంగం ఇబ్బంది పడకూడదు : మంత్రి ఉత్తమ్

- వర్షాల తీవ్రతను ఎప్పటికప్పుడు సమీక్షించాలి
- విపత్తు నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి
- ఆధునిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బిసి పునరుద్ధరణ
- ఏరియల్ లిడార్ సర్వేను త్వరిగా పూర్తి చెయ్యాలి
- వ్యవసాయ,నీటిపారుదల శాఖాధికారులు సమన్వయం చేసుకోవాలని సూచన

**హైదరాబాద్(జనంసాక్షి):** వానకాలం పంటలకు సమృద్ధిగా నీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసు కోవాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదట అటు వానాకాలం ఇటు యాసంగి పంటలకు ప్రణాళికా బద్ధంగా నీటిని అందించినందుకు అద్భుతమైన ఫలితాలు సాదించామన్నారువ్యవసాయ శాఖాధికారులతో నీటిపారుదల శాఖాధికారులు సమన్వయం చేసికున్నందునే తెలంగాణా రాష్ట్రం 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించి యావత్ భారత దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు.ఖరీఫ్ పంటకు నీటి విడుదలతో పాటు ఆధునిక పరిజ్ఞానంతో ఎస్.ఎల్.బి.సి పునరుద్దరణ,నీటిపారుదల శాఖా భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో మిగతా 2లో..

## కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీలో వందేభారత్ బోగీలూ తయారీ



- రూ.750 కోట్లతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్
- పనులను పరిశీలించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

**హనుమకొండ(జనంసాక్షి):** ఖాజీపేట రైల్వే మానుఫ్యాక్చరింగ్ ప్రాజెక్ట్ వల్ల చాలా మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. దేశంలోనే ఇది.. పెద్ద రైల్వే మానుఫ్యాక్చరింగ్ యూనిట్ అని.. వందేభారత్ బోగీలు కూడా ఇక్కడే తయారవుతాయని మంత్రి వెల్లడించారు. 2026 నాటికి కాజీపేటలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం అవుతుందని.. కాజీపేట నుంచి త్వరలోనే 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయని కేంద్రమంత్రి చెప్పారు. త్వరలోనే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయావుతాయని రైల్వే మంత్రి చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతీయ రైల్వేలు పురోగమిస్తున్నాయని మంత్రి వెల్లడించారు. కాజీపేటలో 750 కోట్ల రూపాయలతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పనుల పరిశీలన నిమిత్తం శనివారం కేంద్రమంత్రులు యూనిట్‌ను సందర్శించారు. తెలంగాణలో ఇదో పెద్ద ప్రాజెక్టు అని చెప్పిన కేంద్రమంత్రి.. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణ మిగతా 2లో..

## ఏకపక్ష ఆంక్షలను ఎప్పటికీ సహించం

ఈయూకు స్పష్టం చేసిన భారత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రష్యా ఇంధన దిగ్గజం రాస్‌నెఫ్ట్‌కు చెందిన భారత చమురు రిఫైనరీపై ఐరోపా సమాఖ్య (ఈయూ) ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అయితే ఈయూ చర్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ద్వంద్వ ప్రమాణాలు పాటించడం మంచిది కాదని.. ముఖ్యంగా ఇంధన వాణిజ్య విషయంలో అలా చేయడం తగదని వ్యాఖ్యానించింది. ఏకపక్షంగా విధించే మిగతా 2లో..





ఫోన్ ట్యాపింగ్ కేసు..

## ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు

2లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విజయం మాదే..



పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా

**హైదరాబాద్(జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థిని పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయిస్తుందని అన్నారు. ఎవరు పోటీలో ఉన్నా కాంగ్రెస్ విజయం లక్ష్యంగా కృషి చేస్తామని అన్నారు. బనకచర్ల విష యంలో హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నారని విమర్శిం చారు. ప్రజల ఆకాంక్షల మేరకే మిగతా 2లో..

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్



కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్డీఏ పాలనలో భారత్ ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతూ.. వేగంగా ముందుకు వెళ్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 2027 నాటికి దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌లోని రుద్రపుర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ మిగతా 2లో..

## కుదిరిన ఒప్పందం

ఇజ్రాయెల్, సిరియా మధ్య కాల్పుల విరమణ

వార్త 9లో



## ప్రపంచంలోనే అత్యంత భారీ మెగాడ్యామ్

**బీజింగ్(జనంసాక్షి):** ప్రపంచంలోనే అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనా ప్రారంభించింది. శనివారం మొదలైన ఈ ప్రాజెక్టు పనుల కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొన్నారు. టిబెట్‌లోని యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్ర) నదిపై చేపడుతోన్న ఈ వివాదాస్పద ప్రాజెక్టు కోసం డ్రాగన్ దాదాపు 1.2 ట్రిలియన్ యువాన్‌లు (సుమారు రూ. 14లక్షల కోట్లు) ఖర్చు మిగతా 2లో..

- రూ.14లక్షల కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించిన చైనా
- భారత్, బంగ్లాదేశ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నా మొండిగా ముందుకు..

## ఐదు భారత యుద్ధ విమానాలు కూలిపోయాయి



భారత్, పాక్‌పై ఘర్షణలపై ట్రంప్ మరోసారి అనుచిత వ్యాఖ్యలు

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ తన నోటి దురుసుతో భారత్‌పై వ్యాఖ్యలు చేసి మరోసారి వార్తల్లో నిలిచారు. భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని ఆపినట్లు ట్రంప్ పాత పాటే పాడారు. ఈసారి మరో అడుగు ముందుకేసి.. ఐదు జెట్‌లు కూలినట్టు తనకు సమాచారం ఉందని ట్రంప్ చెప్పారు. అయితే, కాల్పులు విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయం లేదని ప్రధాని మోదీ స్వయంగా ట్రంప్‌తోనే చెప్పినప్పటికీ అధ్యక్షుడి వైఖరిలో ఎలాంటి మార్పు లేకపోవడం? గమనార్హం. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు మిగతా 2లో..

# నిప్పుల వర్షం..

### 300కుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసం

భవనాల శిథిలాల కింద చిక్కుకున్న ప్రజలు.. సహాయక చర్యలు ముమ్మరం



**కీవ్(జనంసాక్షి):** కాల్పుల విరమణకోసం ఒకవైపు మంతనాలు కొనసాగుతున్న ప్పటికీ.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా మాస్కో.. కీవ్‌పై 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని.. వారిని బయటకు తీసుకొచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
20.07.2025

## మాల్దీవులకు మోదీ

నుంచి 26 వరకు యూకే మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోదీపై, లక్షద్వీప్‌పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు.జులై 23-24 తేదీలలో మొదట యూకేలో జరగనున్న భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో మోదీ పాల్గొని.. ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యూకే ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25-26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు.గతేడాది జనవరిలో లక్షద్వీప్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ.. సాహసాలు చేయాలను కున్నవారు ఇక్కడికి రావాలని పిలుపునిచ్చారు. దీనిపై మాల్దీవుల మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఇది ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలను దెబ్బతీసే స్థాయికి చేరింది. అనేకమంది భారతీయులు.. ఆ దేశ టూర్ ప్లాన్‌ను విరమించుకున్నారు. సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బాయ్‌కాట్ మాల్దీవ్స్ పేరిట హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది. ఆ వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిన మాల్దీవులు.. ఆ వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. అనంతరం ఆ మంత్రులపైనా వేటు వేసింది. ఆ తర్వాత నుంచి అధ్యక్షుడు ముయిజ్జు తీసుకున్న భారత వ్యతిరేక నిర్ణయాలు కూడా ఇరుదేశాల మధ్య దూరాన్ని పెంచాయి.

## ఐదు భారత యుద్ధ విమానాలు కూలిపోయాయి

చేశారు. ఆ రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తామే ఆపామని ట్రంప్ తెలిపారు. యుద్ధ సమయంలో విమానాలు కూల్చేశారని వ్యాఖ్యానించారు. ఐదు జెట్‌లు కూలినట్టు తనకు సమాచారం ఉందన్నారు. రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఒకరిపై ఒకరు దాడులు చేస్తూ ఉన్నాయి. ఇరు దేశాల మధ్య జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపామన్నారు. భారత్-పాక్ మధ్య పరిస్థితి తీవ్రమవుతుండగా.. ట్రేడ్ ద్వారా సమస్యను పరిష్కరించామని చెప్పారు. ట్రేడ్ డీల్ కావాలంటే యుద్ధం ఆపాలన్నామని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు మరోసారి చర్చకు వచ్చాయి. భారత్-పాక్ మధ్య కాల్పులు ఆగితే, అందుకు క్రెడిట్ తీసుకుంటున్న ట్రంప్, తన బుద్ధి మార్చుకోవడం లేదు. గతంలోనే ట్రంప్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన భారత ప్రధాని మోదీ.. ఈ విషయంలో అమెరికా ప్రమేయమేదీ లేదని తేల్చిచెప్పారు. ఇది రెండు దేశాల సైన్యం చర్చలు జరిపి తీసుకున్న నిర్ణయమని, మధ్యవర్తి ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను స్వయంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకే ఫోన్‌లో చెప్పానని మోదీ స్పష్టం చేశారు. తమ వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేశారు. ఆ సమయంలో తన జోక్యమేమీ లేదని.. భారత్-పాక్ దేశాలే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయని చెప్పిన ట్రంప్.. మరోసారి మాట మార్చి వ్యాఖ్యలు చేశారు. దీంతో, ట్రంప్ వ్యాఖ్యలపై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్‌నకు మతి మరుపు ఏమైనా వచ్చిందా? అని ప్రశ్నిస్తున్నారు.

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా భారత్

షా ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. 2014లో భాజ పా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేశంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పదేళ్లలో దేశాభివృద్ధిలో 60శాతం పెరుగుదల చోటుచేసుకుందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా 45వేల కిలో మీటర్ల రైల్వే లైన్లు, రోడ్లు నిర్మించామని అమిత్ షా అన్నారు. ప్రధానిగా ఉన్న సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ దేశాన్ని 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చితే.. మోదీ దానిని నాలుగో స్థానానికి తీసుకువచ్చారన్నారు. త్వరలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా మార్చేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెడతానని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేశారని.. దానికోసం తామందరం పని చేస్తున్నామని అన్నారు. దేవభూమిగా పేరుగాంచిన ఉత్తరాఖండ్‌కు రానున్న రోజుల్లో ప్రపంచం నలుమూలల నుంచి అనేక మంది పర్యాటకులు వచ్చేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు.

## మాతో పెట్టుకోవద్దు

### బ్రిక్స్ దేశాలకు ట్రంప్ మరోసారి హెచ్చరిక

**వాషింగ్టన్(జనంసాక్షి):**బ్రిక్స్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు విరుచుకుపడ్డారు. బ్రిక్స్‌లోని ఆరు దేశాలకు జూలై 6న విధించిన 10శాతం అదనపు సుంకాలను మరోమారు గుర్తుచేశారు. అమెరికన్ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ఏ దేశానికైనా ఇలాంటి దెబ్బే ఎదురవుతుందని ఆయన హెచ్చరించారు.డాలర్ ఆధిపత్యాన్ని నిలబెట్టుకు నేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ డాలర్ తన హోదాను కోల్పోతే అది ప్రపంచ యుద్ధంలో ఓడిపోయినట్లేనంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో ఆయన ఆయన మరో మరోమారు బ్రిక్స్ దేశాలపై మాటల దాడి చేశారు. 'బ్రిక్స్' త్వరలోనే కనుమరుగవుతుందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. ఈ సమూహంలోని దేశాలపై భాగమైన 10 శాతం అదనపు సుంకం విధించడంపై గతంలో చేసిన ప్రకటనను ఆయన పునరుద్ఘాటించారు. తమ 'జీనియస్ చట్టం' అమెరికా డాలర్‌ను బలోపేతం చేస్తుందని, డాలర్‌కు మరింత ప్రాముఖ్యతను తీసుకువస్తుందన్నారు. అయితే డాలర్ ఆధిపత్యాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న బ్రిక్స్ అనే చిన్న సమూహం త్వరలోనే కనుమరుగుకానున్నదని ట్రంప్ పేర్కొన్నారు.




## కులగణన డేటా.. సామాజిక అభివృద్ధి వాటా..

ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోనుంది.వెనుకబాటుతనంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య తేడాలు, వాటికి కారణాలను కూడా అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన సర్వే చరిత్రాత్మకమైందని.. దేశానికి రోల్ మోడల్‌గా మారుతుందని నిపుణుల కమిటీ అభిప్రాయపడింది. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, అధికారులు పాల్గొన్నారు.

## అపోలోలో హైకోర్టు న్యాయమూర్తికి సీఎం పరామర్శ

**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హైకోర్టు న్యాయమూర్తి సీవీ భాస్కర్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





## హైకోర్టు సీజేగా జస్టిస్ అపరేశ్ కుమార్ ప్రమాణం

అయ్యారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ 1965 జులై 7న జన్మించారు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్ బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు ఉత్తరప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. 2001 లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ-ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. 2023 ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు సీజేగా పదోన్నది పొందగా తాజాగా ఆయనను తెలంగాణ హైకోర్టుకు సీజేగా నియమిస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు.

## ఏకపక్ష ఆంక్షలను ఎప్పటికీ సహించం

ఆంక్షలను భారత్ ఎప్పటికీ పాటించదని పేర్కొంది. దేశంలోని పౌరుల ప్రాథమిక అవసరాలను తీర్చడానికి వారికి ఇంధన భద్రతను అందించడం కేంద్ర ప్రభుత్వం ముఖ్య బాధ్యతగా అభివర్ణించింది. ఐరోపా సమాఖ్య తగ్గించిన ధరల పరిమితి ప్రస్తుతం బ్యారెల్‌కు 60 డాలర్లుగా నిర్ణయించింది. అంటే రష్యా తన ముడిచమురును భారత్ వంటి దేశాలకు తక్కువ ధరలకే విక్రయించాల్సి వస్తుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా రష్యా ఉంది. తాజా నిర్ణయంతో భారత్ లబ్ధి పొందనుంది. మన దేశం మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 40 శాతంగా ఉంది. మొదటిసారిగా భారత్‌లో అతిపెద్ద రాస్‌నెఫ్ట్ రిఫైనరీ కోసం ఫ్లాగ్ రిజిస్ట్రీని నియమిస్తున్నామని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ పేర్కొన్నారు. తాము రష్యాపై కఠిన వైఖరితో ఉన్నామని.. ఇప్పటివరకు ఆ దేశంపై విధించిన బలమైన ఆంక్షల్లో ఇదీ ఒకటని కల్లాస్ వెల్లడించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తున్నందుకు క్రెమ్లిన్ యుద్ధ బడ్జెట్‌ను మరింత తగ్గిస్తున్నామని.. నిధులు అందకుండా రష్యా బ్యాంకులపై పరిమితులు విధిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే షాడో ఫ్లీట్ నౌకలపై ఆంక్షలు పెట్టినట్లు వెల్లడించారు.

## కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీలో వందేభారత్ బోగీలూ తయారీ

పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. అనంతరం అశ్విని వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ..కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని..పనులు వేగంగా సాగుతున్నా యని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని.. ఆ కోరికను ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో కాజీపేట ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయావుతాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వరంగల్ ప్రజల కోరికను ప్రధాని నరేంద్ర మోడీ నెరవేర్చారని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాజీపేట రైల్వేకోచ్ పరిశ్రమ అనేది వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ అనేది 40 ఏళ్ల పోరాటమని, పివి నరసింహారావు కూడా కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నించారని కిషన్ రెడ్డి అన్నారు. రైల్వే వ్యాగన్లు, కోచ్ లు, ఇంజిన్ల తయారీ



పరిశ్రమను కాజీపేటకు ప్రధాని మంజూరు చేశారని, మోడీ ఏదైనా మాట ఇస్తే.. తప్పకుండా నెరవేరుస్తారని పేర్కొన్నారు.మోడీ గ్యారెంటీకి ప్రతిరూపమే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ అని కోచ్ ఫ్యాక్టరీకి ప్రధాని స్వయంగా భూమిపూజ చేశారని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీతో 3 వేల మందికి నేరుగా ఉపాధి కల్పిస్తామని, తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తున్నాం అని తెలియజేశారు. వరంగల్ కు ఎయిర్ పోర్టు కూడా ఇప్పటికే రావాల్సి ఉందని, ఎయిర్ పోర్టుకు భూములివ్వాలని గతంలో మాజీ సిఎం కెసిఆర్ ను కోరామని చెప్పారు. భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నామని, ఎంత త్వరగా భూములిస్తే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు పూర్తవుతుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాజీపేట మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తెలంగాణ ప్రజల చాలా ఏళ్ల కల అని కిషన్ రెడ్డి అన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం మాదే..

తెలంగాణలో పాలన జరుగుతోందని వివరించారు. నిత్యం విమర్శలే లక్ష్యంగా హరీష్ రావు ఎజెండాగా ఉందన్నారు. అంత ˇకుముందు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మురళీగౌడ్, సంజయ్‌గౌడ్ పార్టీలో చేరారు. వారికి మహేశ్‌కుమార్ గౌడ్ కండువా కప్పి ఆహ్వానించారు.

## పదేళ్లు తానే సీఎం అని చెప్పడం సరికాదు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. "పదేళ్లు తానే సీఎం అని రేవంత్ చెప్పడం కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్ఠానం ఆదేశాలతోనే ఎన్నిక ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం ఎన్నిక జరుగుతుంది. తెలంగాణలోని పార్టీని వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలు సహించం. నిఖార్సయిన నేతలు, కార్యకర్తలు ఎవరూ ఇలాంటివి సహించరు" అని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

## వానాకాలం పంటలకు నీటివిడుదలకు కట్టుదిట్టమైన చర్యలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,నీటిపారుదల శాఖా సలహాదారు అదిత్యా దాస్ నాథ్,నీటిపారుదల శాఖా సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్, ఇ. ఎన్.సి లు అంజద్ హుస్సేన్,శ్రీనివాస్, రమేష్ బాబు తదితరులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల సి.యి లు,ఎస్.ఇ లు ఇతర ఉన్నతాధి కారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వానాకాలం పంటలకు నీటి విడుదలపై రూట్ మ్యాప్ రూపొందించుకుని తక్షణమే అమలులో పెట్టాలన్నారు.సాగునీటి అంశంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. నీటి విడుదల విషయమై నీటిపారుదల శాఖా మొత్తం దృష్టి కేంద్రీకరించి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలన్నారు.ఈ వర్షాకాలంలో భారీ నుండి అతి భారీ వర్షాలు సంభవిస్తే ఎదురయ్యే పరిణామాల పట్ల ముందస్తు బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రధాన అనకట్టాల తో పాటు జలాశయాలు, కాలువలను అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా అధికారులు సన్నద్ధం కావాలని ఆయన ఆదేశించారు.వర్షా కాలంలో సంభవించే అతి భారీ వర్షాలకు గండ్లు పడకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు.విపత్తులు సంభవిస్తే తక్షణమే నష్టానివారణ చర్యలకు అధికారులు అప్రమత్తంగా ఉండి పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. అటువంటి విపత్తులు సంభవించిన పక్షంలో మిగిలిన శాఖాలతో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తక్షణమే స్పందిస్తూ నష్టనివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్.ఎల్.బి.సి పునరు ద్ధరణ చర్యలు చెవుడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సుమారు 10 కిలో మీటర్ల దూరం సొరంగమార్గం పనులు పూర్తి చేసేందుకు గాను చర్యలు తీసుకుంటు న్నామన్నారు .తెలంగాణా రాష్ట్రానికి జీవనాడిగా మారనున్న ఎస్.ఎల్.బి.సి పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు.ఆధునిక పరిజ్ఞానంతో పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపద్యంలో జాతీయ భౌగోళిక పరిశోధనా సంస్థ (ఎన్.జి.ఆర్.ఐ)తో పాటు భారత భూగర్భ సర్వే సంస్థ(జీ. ఎస్.ఐ)ల సహకారంతో పనులు చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. పునరుద్ధరణ పనులలో మునుముందు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేందుకు గాను చేయనున్న ఏరియల్ లిడార్ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.ఈ మేరకు ఎన్.జి. ఆర్.ఐ శాస్త్ర వేత్తలతో సమావేశం అయి సర్వేకు సంబంధించిన సాంకేతిక విధానాలను రూపొందించామన్నారు.పునరుద్ధరణ విషయంలో అయ్యే వ్యయం విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు.సొరంగం పనులలో అపారమైన అనుభవం కలిగిన మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ హర్పల్ సింగ్ ను నీటిపారుదల శాఖకు గౌరవ సలహా దారుగా నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఆయన సాంకేతిక అనుభవంతో ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గంతో పాటు ఇతర సొరంగాలను పూర్తి చేసేందుకు దోహదపడతారని ఆయన చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పూడిక తీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.నీటి సామర్థ్యం పెంపింకందిం చేందుకు చేపట్టిన పూడిక తీత పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలంలో సంభవించే అతి భారీ వర్షాలతో ప్రమాదాలకు గురయ్యే వాటిని గుర్తించి అత్యవసరంగా పూడిక తీత పనులు చేపట్టాలన్నా రు.రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతం అవుతున్న నీటిపా రుదల శాఖా భూముల పరిరక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు.వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తో పాటు ఇంజినీరింగ్ రీసెర్చ్ లాబొరేటరీ వంటి సంస్థలకు చెందిన భూముల ఆక్రమ ణకు గురయ్యాయని అటువంటి ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆయన ఆదేశించారు.ప్రత్యేక డ్రైవ్ తో నీటిపారుదల శాఖా భూములన్నింటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు.ఏక్కడికక్కడ పురపాలక సంఘం,పోలీస్ అధికారులను ఈ డ్రైవ్ లో వినియోగించుకుని నీటిపారుదల శాఖా భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు.పెండింగ్ లో ఉన్న డి.యి ల నుండి ఇ.ఎన్.సి ల వరకు వచ్చే రెండు నెలల్లో ఫించన్లు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

## చురుగ్గా నైరుతి..

బోయినపల్లి, ఆల్వాల్, మల్కాజ్‌గిరి, మౌలాలి, బేగంపేట్, మలక్‌పేట్, చార్మినార్, ముషీరాబాద్, అబిడ్స్, కోటి, హిమాయత్ నగర్, కాచిగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్, అమీర్ పేట్, అశోక్ నగర్, సికింద్రాబాద్, ఉప్పల్, ముషీరాబాద్, బంజారాహిల్స్, ఓయూ, తార్నాక, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ, కొత్తపేట, హయత్ నగర్, వనస్థలిపురం, ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట, సరూర్‌నగర్, గాజుల రామారం, కుత్బుల్లాపూర్, నిజాంపేట్, మియాపూర్, లింగంపల్లి, బాచుపల్లి, హఫీజ్‌పేట్, ఈసీఐఎల్, కప్రా, నేరేడ్‌మెట్, విద్యానగర్, నల్లకుంట తదితర ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. తీవ్ర వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే -టైమ్ కావడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు-న్నారు. రానున్న రెండు గంటల్లో నగరంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసే అవకాశముందని ఏఐఈఈ పేర్కొంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకురాకూడదని.. ముఖ్యంగా వరదనీటితో నిండిన ప్రాంతాల్లో తిరగకూడదని హెచ్చరించింది. వర్షాల కారణంగా ఏమైన సమస్యలు తలెత్తితే వెంటనే 040-29555500, 9000113667 టోల్ ఫ్రీ నెంబర్లు కాల్ చేయాలని సూచించింది.

### భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొన్నం

హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. జిహెచ్‌ఎంసి విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుందని అన్నారు. హైదరాబాద్‌లో వర్షాలపై స్వయంగా ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ఎక్కడైనా ఇబ్బందుల ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, పోలీస్ కమిషనర్, వాటర్ వర్క్, ఇతర అధికారులను అప్రమత్తం చేసినట్లు- చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జాప్యం లేకుండా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### తెలంగాణలో పలుచోట్ల వర్షాలు

నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండ్రోజులు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణకేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో ఐదురోజులపాటు- మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈ ఐదు రోజులు ఎల్లో అలర్ట్, మూడో రోజు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని వికారాబాద్, రంగారెడ్డి, ములుగు, భద్రాద్రి, జయశంకర్, జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ ఆశించిన వర్షాలు కురవలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురుచూశారు. వర్షాలు కురవాలని పూజలు చేశారు. ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించాడు. తెలంగాణలో కుండపోత వానలు కురుస్తున్నాయి. శుక్రవారం అత్యధిక వర్షపాతం నమోదైంది. ఆకాశానికి చిల్లుపడినట్లుగా కుండపోత వానలు కురిశాయి. రోడ్లు కాలువలను తలపించాయి. లోతట్టు-ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి.

## ప్రపంచంలోనే అత్యంత భారీ మెగాడ్యామ్

పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ డ్రాగన్ మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు కనిపిస్తోంది.'చైనా యాజియాంగ్ గ్రూపు' పేరుతో కొత్తగా ఓ సంస్థను ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్టు బాధ్యతలు దీనికి అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం ఐదు డ్యామ్‌లు ఉండనున్నాయి. టిబెట్‌లోని నైంగ్చీ నగరంలో.. భారీ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా దీన్ని చేపడుతున్నారు. ఈ విద్యుత ˉను బయటకే సరఫరా చేయనున్నప్పటికీ స్థానిక అవసరాలకు కూడా కొంతమేర వినియోగించనున్నట్లు సమాచారం.భారీ ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలువనుంది. దీనిద్వారా ఏటా 300 బిలియన్ కిలోవాట్-అవర్స్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇది చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో నిటారుగా పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశా లున్నాయి.హిమాలయాల్లో టిబెట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌కు నది గమనంలో వంపు తిరిగే చోట ఈ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. భారీ డ్యామ్ నిర్మాణం వల్ల ఇక్కడి భౌగోళిక ప్రదేశానికి, పర్యావరణానికి తీరని నష్టం కలగవచ్చనే అభిప్రాయాలున్నాయి. దీనివల్ల అరుణాచల్‌తోపాటు అస్సాం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రెండు దేశాల మధ్య సంఘర్షణ సంభవిస్తే చైనా ఈ డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదలచేస్తే అక్కడి భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది.

**మొండిగా ముందుకు..**

దీనిపై భారత విదేశాంగ ఇటీవల స్పందిస్తూ.. ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, తమ దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచించింది. ఈ నేపథ్యంలో తన నిర్ణయాన్ని సమర్థించుకున్న చైనా.. ఈ ప్రాజెక్ట్ విషయంలో అనేక శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, భారత్, బంగ్లాదేశ్‌లపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపదని తెలిపింది.

## ఉక్రెయిన్‌పై నిప్పుల వర్షం

ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు.రష్యన్ దళాలు ఉక్రెయిన్‌లోని ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని.. ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధం సమయంలో తమకు అండగా ఉంటూ.. ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

**కీవ్‌కు ఆయుధాలను పంపిన ఆస్ట్రేలియా**

రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఉక్రెయిన్‌కు..ఆస్ట్రేలియా ఆయుధ సహాయం చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు. మాస్కో, కీవ్‌పై చేస్తున్న చట్టవిరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా తాము ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి):ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో విచారణలో భాగంగా మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు సిట్ అధికారులు నోటీసులు అందించారు. నోటీసు అందుకున్న రెండు రోజుల్లో ఉదయం 11 నుండి సాయంత్రం 6 గంటల్లోపు వాగ్మూలం ఇచ్చేందుకు తమ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. కాగా సిట్ నోటీసులపై ప్రవీణ్ కుమార్ స్పందించలేదు. వాగ్మూలం ఇచ్చేందుకు ఆయన నిరాకరించినట్లు-తెలుస్తోంది. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాల్సి వస్తుందనే నిరాకరిస్తున్నట్లు- సమాచారం. అయితే ఈనెల 14 న ప్రవీణ్ కుమార్‌కు సిట్ నోటీసులు ఇవ్వగా ఆయన ఇంకా స్పందించలేదు.

# ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా మేడారం ఆధునీకరణ పనులు

- పూజారుల అభిప్రాయాలు, భక్తుల అవసరాలకే పెద్దపీట
- మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ఆధునీకరణపై రాష్ట్ర స్థాయి సమావేశంలో స్పష్టం చేసిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, జులై 19 (జనంసాక్షి) :** ఆదివాసి సంప్రదాయాలకు, పోరాటానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణ ఆధునీకరణపై పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధ్యక్షతన శనివారం నాడు బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. భక్తుల సౌకర్యాల కోసం, ఆలయ పరిసరాల అభివృద్ధి కోసం చేపట్టబోయే మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ జి. సృజన, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, మిషన్ భగీరథ ఎన్‌సీ కృపాకర్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక శాఖ అధికారులు, సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ఆలయ పూజారులు, ఆర్కిటెక్టులు, రంగ నిపుణులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా భక్తుల సౌకర్యార్థం ఆధునీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. పూజారుల కోరిక మేరకు ఆలయ ప్రాంగణంలో ఆధునీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆధునీకరణ పనుల ప్రణాళికపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా, మంత్రి సీతక్క పలు మార్పులను సూచించారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా ఆలయ ఆవరణలో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై పలు సూచనలు చేశారు. సమ్మక్క సారలమ్మల గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, ఆలయ పరిసరాల్లోనే ఆధునిక వసతులను అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్లో ఉన్న కారణంగా సమావేశానికి రాలేకపోయారనీ, వారి సూచన మేరకు మేడారం ఆధునికరణ కోసం రాష్ట్రస్థాయి రెండో సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను చాటే విధంగా, సమ్మక్క సారలమ్మ తల్లుల ధీరత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. మేడారానికి దారి తీసే అన్ని మార్గాల్లో ఆదివాసి పోరాట యోధులు విగ్రహాలు, ఆదివాసి చిహ్నాలను ప్రతిష్టిస్తామన్నారు. వచ్చే మేడారం జాతర లోపు పూర్తి చేయాల్సిన పనులపై మొదట దృష్టి సారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రకృతి పరిరక్షణను మహాయజ్ఞంలా చేపట్టాం

- పర్యావరణ హితమైన నగరమే లక్ష్యమన్న హైడ్రా కమిషనర్
- రవీంద్రభారతిలో ఘనంగా హైడ్రా వార్షికోత్సవం






**హైదరాబాద్, జులై 19 (జనంసాక్షి) :** ప్రకృతి పరిరక్షణతోనే మనందరం ఆరోగ్యకర జీవితాన్ని సాగించగలం. ప్రకృతిని మనందరం రక్షించుకోవాలి. అప్పుడే ప్రకృతి మనకు రక్షణగా ఉంటుంది. దీనిని హైడ్రా మహాయజ్ఞంలా చేపట్టింది. ఈ కృతువులో అందరూ భాగస్వామ్యం అయినప్పుడే మరింత ముందుకు తీసుకెళ్లగలం అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. హైడ్రాను ఏర్పాటు చేసి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సామాజిక, పర్యావరణ అంశాలపై నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రవీంద్రభారతిలో శనివారం ఏర్పాటు చేసిన ప్రదర్శనను హైడ్రా కమిషనర్ తిలకించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలలో హైడ్రా కమిషనర్ ప్రసంగించారు. నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెరువులు, పార్కులు, రహదారులు, నాలాలు ఆక్రమణలు కాకుండా కాపాడుతున్నామని చెప్పారు. ఈ ప్రయాణంలో అనేక ఆటంకాలు ఎదురౌతున్నా.. వెరవకుండా భవిష్యత్ తరాలకు పర్యావరణ ఫలాలు అందించేందుకు హైడ్రా అకుంఠిత దీక్షతో పని చేస్తోందన్నారు. హైడ్రా చర్యల వల్ల చిన్న పిల్లల్లో కూడా చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్ ఇలా అన్ని అంశాలపై అవగాహన కలిగింది. హైడ్రా వంటి సంస్థ దేశవ్యాప్తంగా ఉన్నప్పుడే ప్రకృతిని కాపాడుకోగలమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రత్యేకంగా ఒక కథనాన్ని ప్రచురించిందన్నారు. హైడ్రా వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా గర్వంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకుడు తరుణ్ భాస్కర్ అన్నారు. మనతో పాటు ముందు తరాల భవిష్యత్ కోసం హైడ్రా పని చేస్తోందన్నారు.

### ముచ్చటపడ్డ హైడ్రా కమిషనర్

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఈ సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆలోచింప చేసింది. చెరువుల ఆవశ్యకతను ఒకరు వివరిస్తే.. చెరువులను అనుసంధానం చేసే నాలాల పరిరక్షణ గురించి మరొకరు చాటారు. ప్రకృతి తరతరాలుగా వస్తున్న ఆస్తి.. అది అందరిదీ అని, భావితరాలకు అందివ్వాల్సిన బాధ్యత ఉందని చిన్నారులు వివరించిన తీరును చూసి హైడ్రా కమిషనర్ ముచ్చట పడ్డారు. పర్యావరణ పరిరక్షణపైన, హైడ్రా కార్యక్రమాలపై ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు దాస్యం గీతా భాస్కర్ నిర్వహించిన పలు పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎగ్జిబిషన్‌లో వివిధ అంశాలపై అవగాహన కల్పించిన విద్యార్థలకు కూడా జ్ఞాపికలను హైడ్రా కమిషనర్ అందించారు.

# గురుకుల విద్యార్థి ఆత్మహత్య

**నిజామాబాద్, జూలై19 (జనంసాక్షి) :** ఆర్మూర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం (బైపిసి) చదువుతున్న విద్యార్థి గడ్డం సంతోష్ శనివారం చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా, నిజాంసాగర్ మండలం, ఆరేపల్లి గ్రామానికి చెందిన సంతోష్ ఉదయం కళాశాల ఆవరణలో నిర్వహించిన వ్యాయామంలో పాల్గొన్నాడు. కళాశాలకు వెళ్లడానికి స్నానం చేసి వస్తానని స్నేహితులతో చెప్పి టవల్ తీసుకుని కళాశాల గోడ దూకి కళాశాల గ్రౌండ్ వెనుక గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సహచర విద్యార్థులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. విద్యార్థి మృతికి కారణాలు తెలియరాలేదని అన్నారు.

# స్కూల్ బిల్డింగ్‌పై నుంచి పడి పదో తరగతి విద్యార్థి మృతి

**హైదరాబాద్, జూలై19 (జనంసాక్షి) :** 10వ తరగతి విద్యార్థి స్కూల్ బిల్డింగ్ పై నుంచి కిందపడి మృతి చెందాడు. ఈ విషాధ ఘటన మియాపూర్‌లోని మధుర నగర్‌లో జరిగింది. రిజ్వాన్ (15) అనే బాలుడు మధుర నగర్‌లోని సెయింట్ మార్టిన్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే శనివారం పాఠశాలకు వెళ్లిన రిజ్వాన్.. ప్రమాదవశాత్తూ స్కూల్ బిల్డింగ్ నాలుగో అంతస్తు నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రిజ్వాన్‌ను పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించింది. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రిజ్వాన్ మరణించాడు. కుమారుడి మృతితో రిజ్వాన్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రిజ్వాన్ ప్రమాదవశాత్తూ కిందపడ్డడా.. లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# హడల్ జిమ్ సెంటర్‌ను సందర్శించిన మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్ టైటిల్ విన్నర్



**కాటారం, జూలై 19 (జనంసాక్షి):** కాటారం మండలకేంద్రంలోని హడల్ జిమ్ సెంటర్ ను శనివారం 2022 మిస్టర్ తెలంగాణ బాడీ బిల్డింగ్ టైటిల్ విన్నర్ సుంకరి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి కి హడల్ జిమ్ నిర్వాహకులు ఏల్పుల శ్రీనివాస్,సాగర్ లు పుష్ప గుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి జిమ్ సెంటర్ లోని యువకులకు బాడీ బిల్డింగ్ పై అవగాహన కల్పిస్తూ వెయిట్ లిఫ్టింగ్ మెలకువలు నేర్పుతూ పలు సూచనలు అందించారు.

# పాలకుర్తికి నీటిని విడుదల చేయండి

- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**పాలకుర్తి, జులై 19 (జనంసాక్షి) :** పాలకుర్తి నియోజకవర్గంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి సమస్యలు ఎదురవుతున్న రైతులకు తక్షణ సాయంగా నీటిని విడుదల చేయాలని కోరుతూ, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ని శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేకంగా కలుసు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నీటిపారుదల శాఖ ఉన్నతాధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, పాలకుర్తి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తక్షణ నీటి విడుదల అత్యవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కోరారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే నియోజకవర్గంలోని వేలాది ఎకరాల పొలాలకు సాగునీరు అందుబాటులోకి వచ్చి, రైతులకు గొప్ప మద్దతు లభిస్తుందని వెల్లడించారు. ఈ అభ్యర్థనలపై మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, అవసరమైన నీటి విడుదలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే చెన్నూరు రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే స్పందనను రైతులు అభినందిస్తున్నారు..

# రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గండ్ర



**టేకుమట్ల జులై 19 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలోని రైతు వేదిక లో 365 నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి జిల్లా పౌర సరఫరాల అధికారి హాజరై రేషన్ కార్డ్ లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈనెల 21 తారీకు ఆదివారం రోజున చెల్పూర్ లో జరిగే జరిగే మంత్రుల సభను విజయవంతం చేయాలని ఏకుమట్ల మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నూతన రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులను ఏకం చేసి మంత్రుల సభను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కట్టంగూరు రామనరసింహారెడ్డి తహసిల్దార్ విజయలక్ష్మి సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ ఆర్ఐ సంతోష్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లింగంపల్లి కిరణ్ రావు జిల్లా నాయకులు కత్తి సంపత్ దాసారపు సదానందం తిప్పరెడ్డి కృష్ణారెడ్డి నాంపల్లి వీరేశం తోట గట్టయ్య బండ శ్రీకాంత్ బండ రగోత్తం వ్యాసన వేణి సతీష్ రావు మాదాసి మహేందర్ తోడేటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకుంటే ఆత్మహత్య శరణ్యం

- క్రిమీసంహారక మందు డబ్బాతో నిరుపేదల ధర్నా



**పాలకుర్తి, జూలై 19 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని మండలంలోని బమ్మెర గ్రామానికి చెందిన నిరుపేదలు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట క్రిమి సంహారక మందు డబ్బాతో బమ్మెర గ్రామానికి చెందిన బరిగెల పోతన, అతని బార్య రేణుకలు ధర్నా చేశారు. కూలి పని చేసి జీవిస్తున్నామని పురాతన ఇల్లు కూలిపోయే దశలో ఉందని. తనకు ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్బాషాషేక్ బమ్మెర గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇండ్ల కోసం చేస్తున్న సర్వేను సందర్శించి పరిశీలించారని అన్నారు. ఆ సమయంలో ఇల్లు మంజూరి చేస్తున్నట్లు ఇల్లు కట్టుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. వెంటనే ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరి చేయాలని కోరారు. ఇల్లు మంజూరి చేయకపోతే తమ కుటుంబానికి మరణమే శరణ్యమన్నారు. ఎంపీడీవో రవీందర్ ధర్నా చేస్తున్న బాదితులతో మాట్లాడి ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

# వసతి గృహాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఫుడ్, సానిటేషన్, హెల్త్, విద్య, నైపుణ్యతలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ ప్రతినిధి, జులై 19 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు ఫుడ్, సానిటేషన్ హెల్త్, విద్య నైపుణ్యత, మానసిక వికాసంపై ప్రత్యేక అధికారులు స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు నిర్వహించి నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రతి వసతి గృహానికి ఒక అధికారిని నియమించి ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఆయన అన్నారు. ప్రభుత్వం కల్పించిన డైట్ మెను ప్రకారం విద్యార్థులకు రుచికరమైన పౌష్టిక ఆహారం అల్పాహారం మధ్యాహ్న భోజనం రాత్రి భోజనం స్నాక్స్, తదితర అన్ని సౌకర్యాలు అందుతున్నాయో లేవో తనిఖీ చేయాలన్నారు, వసతి గృహాల పరిసర ప్రాంతాలలో ప్రతినిత్యం సానీటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రతి విద్యార్థి యొక్క ఆరోగ్య నివేదికను పరీక్షలు నిర్వహించి సిద్ధం చేయాలని సూచించారు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. వసతి గృహాలలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు, విద్య నైపుణ్యత పెంపొందించడం కోసం ప్రభుత్వం కల్పించిన డిజిటల్ క్లాసులు, ఏఐ ద్వారా విద్య బోధనలు వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అవన్నీ ప్రతి వసతి గృహాలు, విద్యాసంస్థలలో అమలు చేయాలని, ప్రతి సబ్జెక్టులో ప్రతిభ కనబరచడానికి తీసుకోవలసిన చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆయన సూచించారు. పిల్లల మానసిక, ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ఉండాలని అవసరం అయిన చోట మానసిక నిపుణుల చేత కౌన్సెలింగ్ నిర్వహించాలని విద్యార్థులకు ఉన్నతమైన స్థాయిలో రావడం కోసం దోహదపడతాయని వారు సూచించారు. జిల్లా స్థాయి అధికారులు అందరూ వారికి కేటాయించిన వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. వసతి గృహలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఏలాంటి నిర్లక్ష్యానికి ఆస్కారం లేకుండా పకడ్బందీగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నెగూడెంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో గూడూరులో గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి గుగులోత్ దేశిరామ్ నాయక్ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గూడూరు మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి జిల్లాగ్రంథాలయ చైర్మన్‌గా కోట రాజబాబు



**మహదేవపూర్ జూలై 19 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా కోట రాజబాబును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వ కార్యదర్శి యోగిత రాణా ఉత్తరులు జారీ చేశారు. మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన కోట రాజబాబు మాజీశాసనసభ స్పీకర్ శ్రీపాదరావు నమ్మిన బంటుగా దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా సేవలందిస్తూ ఒక మంచి గుర్తింపు పొందిన నాయకున్నిగా ఎదిగినాడు . గతంలో కోట రాజబాబు మహదేవపూర్ సర్పంచ్ గా కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ గా. ప్రస్తుతం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నారు. ఆ తర్వాత గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైనారు. ఈ సందర్భంగా కోట రాజబాబు మాట్లాడుతూ. ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆశీస్సులతో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైనందున మంత్రి కు కృతజ్ఞతలు తెలుపుతునానిఅన్నారు. చైర్మన్ గా కోట రాజబాబు నియమితులైన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా వెళ్లి మహదేవపూర్ మండల కేంద్రంలోని స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు విగ్రహానికి పూలమాలలు వేసినారు. అదేవిధంగా కొమరం భీం విగ్రహానికి. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసినారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు కోట రాజబాబుకు ఘనంగా శాలువాలతో సన్మానించారు. నూతనముగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు. మండల కేంద్రానికి చెందిన ఒక సీనియర్ నాయకుడు కోట రాజబాబుకు భూపాలిపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైనందున మంత్రి శ్రీధర్ బాబుకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు అక్బర్ ఖాన్ .యూత్ కాంగ్రెస్ పార్టీ కటకం అశోక్. మాజీ సింగిల్ విండో చైర్మన్ రావు. మాజీ ఎంపీపీరాణి బాయి. మాజీ ఎంపీటీసీ ఆకు తోటసుధాకర్ మాజీ సర్పంచ్ విలాస్ రావు నాయకులుకోట సమ్మయ్య మైనార్టీ సెల్ అధ్యక్షుడు అస్రార్ ఖురేష్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు చేతకారి రాజబాబు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది రాక్షస పాలన

- కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయిన కడియం శ్రీహరి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య




**స్టేషన్ ఘన్పూర్, జూలై 19 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వానిది రాక్షస పాలన అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండలకమిటీ ఆధ్వర్యం లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ మన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఓట్ల తో ఎమ్మెల్యే గా గెలిచిన కడియం శ్రీహరి పార్టీని వెన్నుపోటు పొడిచాడని, ఇప్పుడు ప్రజలు అతనికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కడియం శ్రీహరి ఎన్నికల్లో గెలవలేడని తెలిసే భూములు కబ్జా చేయడంలో నిమగ్నమయ్యాడని అన్నారు. దేవునూరులో 20 ఎకరాల భూమిని, శివునిపల్లి లో భూమిని,ధర్మసాగర్ లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ తన వద్ద భూమి లేదని అబద్ధం చెబుతున్నాడని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు లక్ష,రేషన్ కార్డుకు 2వేల నుండి 3వేల వరకు వసూలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కడియం శ్రీహరి 200 కోట్లకు కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపో యాడని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో రాక్షస పాలన కొనసాగిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు బాగా తెలిశా యని, కాంగ్రెస్ పార్టీ 18 నెలల పాలనలో రాష్ట్రానికి శూన్య ఫలితాలు తెచ్చిందని, గత అభివృద్ధి పనులను చూపెడుతూ నియోజకవర్గానికి 800 కోట్లు తెచ్చానని కడియం శ్రీహరి అబద్దాలు చెబుతున్నాడని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీకే ఉందని స్పష్టం చేస్తూ,మనం గత పది సంవత్స రాల్లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపామని, కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ప్రతి కుటుంబాన్ని ఆదుకున్న మని,ఇప్పుడు రాబోవు స్థానికసంస్థల ఎన్నికల్లో కూడా మన గులాబీజెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ గౌడ్ నాయకులు ఆకుల కుమార్, అక్కినపల్లి బాలరాజు, చింతకుంట్ల జగన్ రెడ్డి, తాటికొండ సురేష్ కుమార్, ఇనుగాల నరసింహారెడ్డి, మహేందర్ రెడ్డి, కనకం గణేష్, చల్లా చందర్ రెడ్డి, ఆగారెడ్డి, బంగ్లా శ్రీని వాస్, కుంభం కుమార స్వామి, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేశం, చట్ల యాకయ్య, ఆకారపు అశోక్, పొన్నం రంజిత్, గొడుగు సంజీవ, లునావత్ జైపాల్, బూరుగు రవి,ఫాతిమామేరి,పావని, సునీత,సుజాత, మహబూబ్ పాషా,రంగారావు,హిరా సింగ్,సమ్మయ్య, స్టేషన్ ఘనపూర్ మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# నిరుపేదల గూడు

### కూల్చివేతలతో ఛిద్రమైన బ్రతుకు హక్కు

భారతదేశం, ఒక వైవిధ్యభరితమైన సాంస్కృతిక, ఆర్థిక దేశంగా ప్రపంచ వేదికపై గుర్తింపు పొందినప్పటికీ, దాని మురికివాడల్లో నివసించే నిరుపేదల జీవితాలు ఇంకా దుర్భరమైన సవాళ్లతో నిండి ఉన్నాయి. పట్టణీకరణ, అభివృద్ధి పేరిట జరుగుతున్న ఇళ్ల (నివాసాలు) కూల్చివేతలు ఈ వర్గాన్ని రోడ్డున పడేస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కూల్చివేతలు, నిరుపేదల జీవనాధారాన్ని, వారి ఆశలను నాశనం చేస్తూ, వారి పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రశ్న ఒకటే... " కూల్చివేతల తర్వాత వీరు ఎక్కడికి వెళ్లాలి? "వీరికి బ్రతికే హక్కు" లేదా? ఈ అన్యాయం భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో జరిగిన, జరుగుతున్న ఒక దుర్భ్యక్షకర వాస్తవం. ఈ సమస్యకు పరిష్కారం ఎవరు చూపాలి? ఎవరు ఈ కూల్చివేతలకు భాధ్యత వహించాలి?

మురికివాడలు భారతదేశ పట్టణ జీవనంలో అనివార్య భాగం. ఈ ప్రాంతాల్లో నివసించే లక్షలాది మంది నిరుపేదలు నగరాల ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలు. నిర్మాణ కార్మికులు, గృహ కార్మికులు, రిక్షా డ్రైవర్లు, చిన్న వ్యాపారులు...వీరంతా నగర జీవనాన్ని నడిపించే శక్తులు. అయినప్పటికీ, వారి జీవితాలు అస్థిరత్వంతో నిండి ఉన్నాయి. పట్టణీకరణ పేరిట, స్మార్ట్ సిటీలు, మెట్రో రైలు ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ వంటి అభివృద్ధి పథకాల కోసం మురికివాడలు కూల్చివేయబడుతున్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల నుండి హైదరాబాద్, అహ్మదాబాద్ వంటి రెండవ స్థాయి నగరాల వరకు ఈ కూల్చివేతలు విస్తరంగా జరుగుతున్నాయి.

ఉదాహరణకు, ఢిల్లీలో 2000-2010 మధ్య కాలంలో, కామన్వెల్త్ గేమ్స్ సన్నాహాల సమయంలో యమునా నది తీరంలోని మురికివాడలు భారీగా కూల్చివేశారు. దాదాపు 2 లక్షల మంది నిర్వాశ్రయులయ్యారని అంచనా. ఇటీవల, 2023లో ఢిల్లీలోని "తుఘ్లకాబాద్" ప్రాంతంలో వందలాది కుటుంబాలు నిర్వాశ్రయులయ్యాయి. ముంబైలో "ధారావి" వంటి ఆసియాలోనే అతిపెద్ద మురికివాడలో రీడెవలప్‌మెంట్ పేరిట వేలాది గుడిసెలు, రేకుల గూళ్ళు కూల్చివేశారు. కానీ పునరావాసం సరిగ్గా జరగలేదు. హైదరాబాద్‌లో మూసీ నది పరిరక్షణ పథకం కింద 2020-2022 మధ్య వేలాది కుటుంబాలు ఇళ్లను కోల్పోయాయి. ఈ గణాంకాలు ఒక్కొక్క రాష్ట్రంలోనూ వేర్వేరుగా ఉన్నప్పటికీ, సమస్య ఒకే విధంగా కొనసాగుతోంది. "పునరావాసం" లేని కూల్చివేతల విధ్వంసకాండ. ప్రభుత్వ విధానాలు, చట్టాలు నిరుపేదల హక్కులను కాపాడలేకున్నాయి.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, ప్రతి పౌరుడికీ జీవన హక్కు, గౌరవప్రదమైన జీవనం హామీ ఇవ్వబడింది. అయితే, ఈ హక్కు నిరుపేదల విషయంలో ఉల్లంఘించబడుతోంది. కూల్చివేతల సమయంలో ప్రభుత్వం తరచూ "అక్రమ నిర్మాణాలు" అనే సాకును ఉపయోగిస్తుంది. కానీ, ఈ నిర్మాణాలు అక్రమంగా ఉన్నాయని నిరూపించే ముందు, వాటిలో నివసించే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సుప్రీంకోర్టు కూడా "ఒల్గా టెల్లిస్ వర్సెస్ బాంబే మున్సిపల్ కార్పొరేషన్" (1985) కేసులో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. "పునరావాసం" లేకుండా కూల్చివేతలు "జీవించే" హక్కును ఉల్లంఘించడమే అని. అయినప్పటికీ, ఈ తీర్పు అమలు కావడం చాలా అరుదు.





ఉదాహరణకు, 2022లో బెంగళూరులోని కొన్ని మురికివాడలు కూల్చివేసినప్పుడు, పునరావాసం కోసం కేటాయించిన ఇళ్లు నగర శివార్లలో, ఉపాధి అవకాశాలకు దూరంగా ఉన్నాయి. ఫలితంగా, కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోయాయి. ఇదే సమస్య చెన్నైలోని "పెరుంబాక్కం" పునరావాస కాలనీలలో కనిపిస్తుంది, ఇక్కడ వలస వచ్చిన కుటుంబాలు రవాణా సౌకర్యాలు, పాఠశాలలు, ఆస్పత్రులకు దూరంగా ఉండి ఇబ్బందులు పడ్డాయి. ఈ పునరావాస ప్రాంతాలు తరచూ "గెట్టోలు" గా మారుతున్నాయి, ఇక్కడ జీవన ప్రమాణాలు మురికివాడల కంటే కూడా దారుణంగా ఉంటాయి.

ఈ కూల్చివేతల వెనుక ఉన్న ఆర్థిక, రాజకీయ ఒత్తిళ్లను కూడా పరిశీలించాలి. పట్టణ భూమి ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో, మురికివాడలు ఉన్న ప్రాంతాలు రియల్ ఎస్టేట్ డెవలపర్లకు బంగారు గనులుగా కనిపిస్తున్నాయి. రాజకీయ నాయకులు, అధికారులు, డెవలపర్ల మధ్య సంబంధాలు ఈ కూల్చివేతలను వేగవంతం చేస్తున్నాయి. ఉదాహరణకు, ముంబైలో "ధారావి" రీడెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లో ప్రైవేట్ డెవలపర్ల పాత్ర గురించి అనేక విమర్శలు వచ్చాయి. ఈ ప్రాజెక్టులు నిరుపేదలకు ప్రయోజనం చేకూర్చకపోగా, వారిని మరింత ఆర్థిక అస్థిరతలోకి నెట్టివేస్తున్నాయి.

పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రకటిస్తోంది. "ప్రధానమంత్రి ఆవాస్ యోజన", "జననీ సురక్ష యోజన" వంటివి. అయితే, ఈ పథకాలు నిరుపేదలకు నిజమైన భద్రతను అందించడంలో విఫలమవుతున్నాయి. 2023 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, భారతదేశంలో 41.37 శాతం జనాభా ఇంకా గృహ సౌకర్యాల నుండి దూరంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. ఈ గణాంకాలు, కూల్చివేతల ద్వారా నిరాశ్రయులైన వారి సంఖ్యను ఖచ్చితంగా ప్రతిబింబించకపోవచ్చు, కానీ సమస్య యొక్క తీవ్రతను సూచిస్తాయి.


ఈ అన్యాయానికి పరిష్కారం ఏమిటి? మొదట, ప్రభుత్వం కూల్చివేతలకు ముందు సమగ్రమైన పునరావాస ప్రణాళికను రూపొందించాలి. ఈ ప్రణాళికలు నిరుపేదల జీవనోపాధి, విద్య, ఆరోగ్య సౌకర్యాలను కాపాడేలా ఉండాలి. రెండవది, మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కార్పొరేట్ శక్తుల నుండి కనీసం 3 శాతం పన్ను విధించి,వాటిని "పునరావాస పథకాని"కి కేటాయించి, వాటిని ఆధునిక సౌకర్యాలతో కూడిన నివాస ప్రాంతాలుగా మార్చాలి. మూడవది, స్థానిక సంఘాలను, సివిల్ సొసైటీ సంస్థలను ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలి. చివరగా, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నిరుపేదల హక్కులను కాపాడేందుకు బలమైన చట్టాలను అమలు చేయాలి.

నిరుపేదల ఇళ్ల కూల్చివేతలు కేవలం భౌతిక నిర్మాణాలను తొలగించడం కాదు... అవి వారి ఆశలను,కలలను,భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్నాయి. ప్రభుత్వం, సమాజం కలిసి ఈ అన్యాయాన్ని అరికట్టకపోతే, భారతదేశం యొక్క అభివృద్ధి కేవలం గణాంకాలకు, గాజు భవనాలకు పరిమితమై, నిజమైన సామాజిక న్యాయాన్ని సాధించలేదు. నిరుపేదలకు బ్రతికే హక్కు, గౌరవప్రదమైన జీవనం అందించడం కేవలం రాజ్యాంగ బాధ్యత మాత్రమే కాదు. అది మానవత్వానికి, భారతీయ ఆధ్యాత్మిక సూక్తి "సర్వేజనా సుఖినోభవంతు" అనే ధార్మికత భావానికి పరీక్ష కూడా...!



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ప్రపంచ మనుగడ... జనాభాపైనే




ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి సంవత్సరం జులై 11న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది. ఈ దినోత్సవం జనాభా పెరుగుదల వల్ల కలిగే సవాళ్ల గురించి అవగాహన కల్పించడం, జనాభా నియంత్రణ ద్వారా సమాజంలో సమతుల్యతను, మానవ అభివృద్ధిని, వనరుల సమర్థ వినియోగాన్ని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1989 నుంచి ఐక్యరాష్ట్ర సమితి జనాభా నిధి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 1987లో ప్రపంచ జనాభా 5 బిలియన్ల మైలురాయిని దాటిన సందర్భంగా 5 బిలియన్ డే జరిగింది. నవంబర్ 2022 నాటికి ప్రపంచ జనాభా 8 బిలియన్లకు చేరింది, ప్రస్తుతం 8.2 బిలియన్లకు చేరుకుంది. 2030 నాటికి ఈ సంఖ్య 9 బిలియన్లకు చేరే అవకాశం ఉంది. భారత దేశ జనాభా 2025 జనవరి 1 నాటికి 146 కోట్లకు చేరగా, తెలంగాణ జనాభా 3 కోట్ల 85 లక్షలుగా ఉంది. ఈ పెరుగుతున్న జనాభా ప్రపంచ సమాజంలో, ముఖ్యంగా భారత్ వంటి దేశాల్లో, అనేక సవాళ్లను తెస్తోంది. ఈ సందర్భంగా, జనాభా నియంత్రణ, వనరుల సమర్థ వినియోగం, సమాజ సమతుల్యత వంటి అంశాలపై దృష్టి సారించడం అవసరం.

అధిక జనాభా సమాజంలోని వనరులపై తీవ్రమైన ఒత్తిడిని తెస్తుంది. ఆహారం, నీరు, ఇంధనం, గృహనిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి ప్రాథమిక అవసరాలను అందించడంలో ఈ ఒత్తిడి సవాళ్లను సృష్టిస్తుంది. ప్రకృతి సంపద అధికంగా వినియోగించబడి, కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అడవులు, నీటి వనరులు, సారవంతమైన భూమి వంటి సహజ వనరులు క్షీణిస్తున్నాయి. అధిక జనాభా వల్ల గాలి, నీటి కాలుష్యం, వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం వంటి సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ సమస్యలు భవిష్యత్ తరాల జీవన నాణ్యతను దెబ్బతీస్తాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య మరింత సంక్లిష్టంగా ఉంది, ఎందుకంటే ఇక్కడ జనాభా ఒత్తిడి వల్ల ఆర్థిక, సామాజిక, పర్యావరణ సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.

జనాభా నియంత్రణపై దృష్టి సారించడం అత్యంత కీలకం. కుటుంబ నియంత్రణ, విద్య, ఆరోగ్య సంరక్షణ, మహిళల సాధికారత వంటి అంశాలు జనాభా పెరుగుదలను నియంత్రించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు అందించడం ద్వారా కుటుంబ పరిమాణం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అదే విధంగా, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను మెరుగుపరచడం, కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన కల్పించడం, స్త్రీ-పురుష సమానత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. అయితే, భారత్‌లో కొన్ని సామాజిక, సాంస్కృతిక, మతపరమైన అంశాలు జనాభా నియంత్రణకు అడ్డంకులుగా నిలుస్తున్నాయి. కొందరు మతస్తులు జనాభా నియంత్రణను వ్యతిరేకిస్తూ, జనాభా పెరగకపోతే తమ సమాజం అస్తిత్వం ప్రమాదంలో పడుతుందని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ తప్పుడు భావనలు సమాజంలో అపోహలను రేకెత్తిస్తూ, జనాభా నియంత్రణ కార్యక్రమాలకు అడ్డంకిగా నిలుస్తున్నాయి.

ప్రపంచ జనాభా దినోత్సవం ద్వారా ప్రభుత్వాలు, సంస్థలు, సమాజాలు జనాభా నియంత్రణ, వనరుల సమర్థ వినియోగం, సామాజిక సమతుల్యత వంటి అంశాలపై దృష్టి సారిస్తాయి. భారత్‌లో జనాభా నియంత్రణ కోసం అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయి. కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించే ప్రయత్నం జరుగుతోంది. అయితే, ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలకు, వెనుకబడిన వర్గాలకు సమర్థవంతంగా చేరడం అవసరం. పట్టణీకరణ, పేదరికం, విద్యారాహిత్యం వంటి అంశాలు జనాభా నియంత్రణకు సవాళ్లుగా నిలుస్తున్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం, ప్రజా సంస్థలు, సామాజిక సంస్థలు, వ్యక్తులు కలిసి పనిచేయాలి.

జనాభా నియంత్రణ కేవలం సంఖ్యల గురించి మాత్రమే కాదు, ఇది మానవ జీవన నాణ్యత, సమాజ స్థిరత్వం, పర్యావరణ సంరక్షణ గురించి కూడా. అధిక జనాభా వల్ల పట్టణాల్లో గృహ సమస్యలు, రవాణా ఒత్తిడి, నిరుద్యోగం, ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూమి విభజన, నీటి కొరత, ఆహార భద్రత సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి సమగ్రమైన విధానం అవసరం. విద్య, ఆరోగ్యం, ఉపాధి, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలను ఒకదానితో ఒకటి సమన్వయం చేస్తూ, జనాభా నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలి. ప్రజలకు కుటుంబ నియంత్రణ పద్ధతులు, వాటి ప్రయోజనాల గురించి సమాచారం అందించడం, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే తప్పుడు ప్రచారాలను అడ్డుకోవడం, సాంస్కృతిక, మతపరమైన అడ్డంకులను తొలగించడం ద్వారా ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

ప్రపంచ జనాభా దినోత్సవం ఒక బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి పిలుపునిస్తుంది. ఇది ప్రతి వ్యక్తి, కుటుంబం, సమాజం, ప్రభుత్వం కలిసి పనిచేయవలసిన సమయమని గుర్తు చేస్తుంది. జనాభా నియంత్రణ ద్వారా మాత్రమే స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ సంరక్షణ, సామాజిక సమానత్వం సాధ్యమవుతాయి. భారత్‌లో జనాభా నియంత్రణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా దేశం సమగ్ర అభివృద్ధి వైపు అడుగులు వేయగలదు. యువతకు విద్య, ఉపాధి అవకాశాలను అందించడం, మహిళల సాధికారతను ప్రోత్సహించడం, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా జనాభా సమస్యను నియంత్రించవచ్చు. ప్రతి ఒక్కరూ ఈ బాధ్యతలో భాగస్వామ్యం కావాలి. సమర్థవంతమైన జనాభా నియంత్రణ ద్వారా మాత్రమే మన భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన నాణ్యతను, స్థిరమైన అభివృద్ధిని అందించగలం.

ఉమాశేషారావు వైద్య
లెక్చరర్ ఇన్ సీవీక్స్
కామారెడ్డి, 9440408080

# మోడీ మాయాజాలంలో.. భారతదేశం


### ప్రపంచంలోనే అత్యంత అసమాన దేశాలలో ఒకటిగానూ ప్రపంచంలో 4వ అత్యంత సమాన దేశంగా ఎలా మారింది




2022 ప్రపంచ అసమానత దేశాల నివేదిక ప్రకారం, 2019లో భారతదేశం 216 దేశాలలో 176వ స్థానంలో ఉంది. అప్పటి నుండి, ప్రపంచ బ్యాంక్ ఈ కీలకమైన ప్రశ్నపై ఎటువంటి నిర్దిష్ట అధ్యయనం చేయనప్పటికీ, అత్యంత అవినీతిపరులైన భారతీయ కుబేరుల వద్ద ఆదాయం మరియు సంపద కేంద్రీకరణ ఏ మాత్రం తగ్గకుండా తీవ్రమవుతోంది. అయితే, 2025 జూలై 5న, భారత ప్రభుత్వం తన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా ఒక నివేదికను విడుదల చేసింది. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలో "నాల్గవ అత్యంత సమానమైన దేశం" అని, చైనా మరియు అమెరికా కంటే ముందు ఉందని పేర్కొంది. ఈ వాదన తాజా ప్రపంచ బ్యాంక్ నివేదికపై ఆధారపడింది. దీని ప్రకారం," గిని "సూచిక ఆధారంగా భారతదేశ వినియోగ అసమానత (తక్కువ "గిని" సూచిక ఎక్కువ సమాన పంపిణీని మరియు ధనిక మరియు పేదల మధ్య తక్కువ అంతరాన్ని సూచిస్తుందిబీ 0 గిని గుణకం పరిపూర్ణ సమానత్వాన్ని సూచిస్తుంది మరియు 1 పరిపూర్ణ అసమానతను సూచిస్తుంది) 2011-23 దశాబ్ద కాలంలో 28.8 నుండి 25.5కి మెరుగుపడింది. అయితే, వినియోగంతో పోలిస్తే, ఆదాయం మరియు సంపద సామాజిక-ఆర్థిక అసమానతను నిర్ణయించడంలో ప్రధాన కారకాలు అని రాజకీయ ఆర్థిక శాస్త్రంలో ఒక అంగీకరించబడిన వాస్తవం.

క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశంలో అసమానతకు సంబంధించి తన నివేదించిన నివేదిక వెల్లడి కోసం, ప్రపంచ బ్యాంక్ 2022-24 మధ్య జరిగిన గృహ వినియోగ వ్యయ సర్వే ( గృహ వినియోగ వ్యయ సర్వేపై ఆధారపడింది. దీని ప్రకారం, గ్రామీణ ప్రాంతాలకు భారతదేశం యొక్క "గిని" గుణకం 2022-23లో 0.266 నుండి 2023-24లో 0.237కి తగ్గింది మరియు పట్టణ ప్రాంతాలకు 2022-23లో 0.314 నుండి 2023-24లో 0.284కి తగ్గింది. దీని ఆధారంగానే అధికారిక మరియు కార్పొరేట్ వర్గాలు 2011-23 మధ్య 171 మిలియన్ల మందిని తీవ్ర పేదరికం నుండి బయటపడటంలో మోడీ పాలనను ప్రశంసించడం ప్రారంభించాయి. మరియు ప్రభుత్వం యొక్క సామాజిక సంక్షేమ శాఖ ఒక ప్రకటనను కూడా విడుదల చేసింది: "ఇది భారతదేశ ఆర్థిక పురోగతి తన జనాభా అంతటా ఎంత సమానంగా పంచుకోబడుతుందో ప్రతిబింబిస్తుంది. ఈ విజయానికి వెనుక పేదరికాన్ని తగ్గించడం, ఆర్థిక ప్రాప్యతను విస్తరించడం మరియు అత్యంత అవసరమైన వారికి సంక్షేమ సహాయాన్ని నేరుగా అందించడంపై స్థిరమైన విధాన దృష్టి ఉంది." మోడీ అభిమానులు కూడా ప్రపంచ బ్యాంక్ నివేదికను ఆయన పేదరిక నిర్మూలన వాదనలకు మద్దతుగా అన్వయించడం ప్రారంభించారు. ఇటీవల, ట్రినిడాడ్ మరియు టొబాగోలో ఉన్నప్పుడు, మోడీ స్వయంగా ప్రపంచ బ్యాంక్ నివేదికను హైలైట్ చేస్తూ, ఒక దశాబ్ద కాలంలో భారతదేశం 250 మిలియన్ల మందికి పైగా ప్రజలను తీవ్ర పేదరికం నుండి బయటపడిందని పేర్కొన్నారు.

ఇంతలో, పైన పేర్కొన్న అదే గృహ వినియోగ వ్యయ సర్వే డేటా విశ్లేషణ ఆధారంగా, స్వతంత్ర విద్వాంసులు భారతదేశంలో పేదరికం యొక్క వాస్తవ స్థాయిని అధికారిక అంచనాలు తక్కువగా చూపుతున్నాయని చూపించారు. ఉదాహరణకు, రివ్యూ ఆఫ్ అగ్రేరియన్ స్టడీస్ (2025 ఫిబ్రవరి 05)లో ప్రచురించబడిన ఒక అధ్యయనం భారతదేశ జనాభాలో 26.4% (ప్రపంచంలోని 700 మిలియన్ల అత్యంత పేదలలో 38 కోట్ల లేదా 380 మిలియన్లు) ప్రపంచ బ్యాంక్ పేదరిక రేఖ అయిన రోజుకు %వి%2.15 కంటే దిగువన ఉన్నారని నివేదించింది. సి ఏ సేతు, అభినవ్ సూర్య మరియు సి ఏ రుతు నిర్వహించిన ఈ అధ్యయనం ఆహారం, గృహ, ఆరోగ్య సంరక్షణ మరియు విద్య ఖర్చులను పరిగణనలోకి తీసుకుంది. వారి అధ్యయనం ప్రకారం, గ్రామీణ భారతదేశంలో ఒక వ్యక్తి పేదరిక రేఖకు పైన ఉండాలంటే నెలకు కనీసం రూ. 2,515 ఖర్చు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో, జీవన వ్యయాలు ఎక్కువగా ఉన్న చోట, కనీస అవసరం నెలకు రూ. 3,639గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 27.4% మంది మరియు నగరాల్లో 23.7% మంది ప్రజలు ఇప్పటికీ పేదరికంలో జీవిస్తున్నారని అధ్యయనం కనుగొంది. పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలను కలిపినప్పుడు, భారతదేశ మొత్తం జనాభాలో 26.4% మంది ప్రాథమిక అవసరాలను తీర్చుకోవడానికి తగినంత సంపాదించలేదని దీని అర్థం. హాస్యాస్పదంగా, భారతదేశంలో పేదరికం 5%కి తగ్గిందని పేర్కొన్న నీతి ఆయోగ్ అధ్యయనం కూడా అదే డేటాపై ఆధారపడింది. మరియు ఇటీవలే, ఆర్థిక విశ్లేషకుడు, హార్దిక్ జోషి, వరల్డ్ ఇనీక్వాలిటీ డేటాబేస్ (2024)ను ఉటంకిస్తూ భారతదేశంలో ఆదాయ అసమానత బ్రిటీష్ పాలనలో ఉన్న దానికంటే దారుణంగా ఉందని ఎత్తి చూపారు.



వాస్తవానికి, నయా ఉదారవాద కేంద్రాల పరిశోధనలకు విరుద్ధంగా, అనేక అంతర్జాతీయ ఏజెన్సీలు భారతదేశం యొక్క తీవ్రమైన సంపద మరియు ఆదాయ అసమానతను స్థిరంగా హైలైట్ చేస్తున్నాయి. ఉదాహరణకు, ఆక్స్‌ఫామ్, 2024 చివరిలో ప్రచురించిన తన నివేదిక "సర్వైవల్ ఆఫ్ ది రిచెస్ట్: ది ఇండియా స్టోరీ"లో భారతదేశంలోని అత్యంత సంపన్నులు లేదా కుబేరులు 1% మంది మొత్తం సంపదలో 40%కి పైగా కలిగి ఉన్నారని, అయితే దిగువ 50% లేదా జనాభాలో అత్యంత పేద సగం మంది కేవలం 6.4% మాత్రమే కలిగి

రేపటి సంచికలో...

పి.జె. జేమ్స్,
ప్రధాన కార్యదర్శి,
సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్, న్యూఢిల్లీ,
తెలుగు స్వేచ్ఛానుసరణ:
కొల్లిపర వెంకటేశ్వరరావు,
కేంద్ర కమిటీ సభ్యుడు సిపిఐ (ఎమ్.ఎల్) రెడ్ స్టార్.,
9392325652.

### బోనం ఎత్తిన తెలంగాణ

మహానగరంలో మహంకాళికి బోనాలు
భాగ్యనగరంలో బల్కంపేట బోనాలు
బోనమెత్తిన భాగ్యనగరం
ఆషాడంలో హైదరాబాదులో బోనాలు
డప్పులతోదరువుతో దండిగా పూజలు!!
సికింద్రాబాద్‌లో శివసత్తులఆట పాటలు
పసుపు కుంకుమతో తల్లికి పూజలు
గ్రామ గ్రామాన ఘనంగా బోనాలు
సాక పెట్టి సంతోషంగా ఉండాలని
కోరే భక్తులు
బైండ్ల ల్లో ఆటపాటలు!!
తల్లికి పల్లె పల్లెనా పట్నాలు
సబ్బండ వర్గాలు జరుపుకునే పండుగ
పోతరాజుల కొరడాలు
తీన్మార్ దరువుల గనాలు
మహంకాళి బోనాలు!!

దేవులపల్లి రమేశ్
నంగునూర్, సిద్దిపేట జిల్లా
9963701294

### ఎంత హాయి!

ఆలోచిస్తుంటే
బాధేస్తోంది!
మా తాత పోయాడు
మానాన్నపోయాడు
నేనూ పోతాను!
మా పిల్లలూ...!
భయమేస్తోంది
ఏంటీ జీవితం!
జీవితం అశాశ్వతం!
అందరం పోతాం
మోసాలుమానండ్రా!
బుద్ధులు మార్చుకోండి!
అందరం హాయిగాఉండే
సామాన్యజీవితం చాలు!
మీ లాభాలకోసం
జనాన్ని సమాజాన్ని
జీవితాన్ని ఛిన్నా భిన్నం
చెయ్యకండ్రా నాయనా!
కులాల్లేవ్! మతాల్లేవ్!
కష్టమొక్కటే నిజం!
అందరూ కష్టపడండి
సమాజసంపద పెంచండి
అందరూహాయిగాతిని
ప్రతిమనిషినీ నోరారా
తమ్ముడూఅని పిలవండి
అక్కా అనిపిలవండి!
ఎంతహాయిగాఉంటుందో
మీరే గ్రహించండి!!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# వేడి గాలుల బెడద

### చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రభావం



మన దేశంలో వేడి గాలుల తీవ్రత ఆందోళనకరంగా పెరుగుతోంది. 2020 నుండి 2024 మధ్య కాలంలో వేడి రోజులు దాదాపు రెట్టింపు అయ్యాయి. ఇది కేవలం పెరుగుతున్న ఉష్ణోగ్రత మాత్రమే కాదు, మన దేశంలోని చిన్నారుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే తీవ్రమైన సమస్య. పిల్లల శరీరాలు పెద్దల మాదిరిగా వేడిని తట్టుకోలేకపోవడం వల్ల వారి ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

**పిల్లల శరీరంపై వేడి ప్రభావం - ఎందుకు ప్రమాదం?**

పిల్లల శరీరాలు వేడికి భిన్నంగా స్పందిస్తాయి. వారి ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందదు. అంటే వారి శరీరం సాధారణ ఉష్ణోగ్రతను నిలపడానికి చాలా కష్టపడుతుంది. పిల్లల చర్మం తక్కువ మందంగా ఉండటం వల్ల వారు వేడిని త్వరగా గ్రహిస్తారు. కానీ వారి చర్మంపై చెమట గ్రంథులు సరిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల శరీరం చల్లబడటానికి అవసరమైన చెమటను తక్కువగా ఉత్పత్తి చేస్తాయి. ఇలా వేడిని త్వరగా పీల్చుకొని సరిగా చల్లబడకపోవడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత చాలా వేగంగా ప్రమాదకర స్థాయికి పెరుగుతుంది. ఇది వడదెబ్బ వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. పిల్లలు ఆడుతున్నప్పుడు వారి శరీరం ఎక్కువ వేడిని పుట్టిస్తుంది, వారి శరీరంలో నీరు త్వరగా ఆవిరైపోతుంది కాబట్టి వారు త్వరగా డీహైడ్రేషన్ బారిన పడతారు. పసిపిల్లలు, చిన్న పిల్లలు వేడి వల్ల కలిగే ఇబ్బందులను గుర్తించడానికి, వారికి నీళ్లు ఇవ్వడానికి, చల్లబరచడానికి పూర్తిగా పెద్దలపైనే ఆధారపడతారు. కాబట్టి తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి ఈ విషయంపై అవగాహన ఉండటం చాలా ముఖ్యం.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం:**

వేడి గాలులు పిల్లలపై తక్షణ ప్రభావం చూపడమే కాకుండా దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తాయి. వేడి వల్ల కలిగే అత్యంత ప్రమాదకరమైన స్థితి వడదెబ్బ. దీనివల్ల శరీరంలోని అవయవాలు త్వరగా పనిచేయకుండా పోవచ్చు, మెదడుకు శాశ్వత నష్టం కలగవచ్చు, ఒక్కోసారి ప్రాణాలు కూడా పోవచ్చు. తీవ్రమైన వేడి కిడ్నీ పనితీరును, మొత్తం శరీర ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వేడి గాలుల సమయంలో గాలి కాలుష్యం కూడా పెరిగి, పిల్లలలో ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యలను మరింత తీవ్రం చేస్తుంది. అంతేకాకుండా, వేడి గాలులు పిల్లలకు పోషకాహార లోపాన్ని కూడా పెంచుతాయి. పంటలు పాడవడం, నీటి వనరులు తగ్గడం వల్ల ఆహార కొరత ఏర్పడుతుంది. ఇది ఇప్పటికే ఉన్న పోషకాహార లోపాలను మరింత తీవ్రం చేసి, పిల్లలలో ఎదుగుదల లోపం, బలహీనమైన రోగనిరోధక శక్తికి దారితీస్తుంది. వేడి ప్రభావం శిశువు పుట్టకముందే ప్రారంభమవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు ముందుగానే ప్రసవం, తక్కువ బరువుతో పుట్టడం, పిండం ఎదుగుదల తక్కువగా ఉండటం వంటి వాటితో ముడిపడి ఉన్నాయి.

**చదువుకు అడ్డంకులు - బడిలో ఇబ్బందులు:**

పాఠశాలలు వేడి గాలుల సమయంలో వేడి కుంపటిగా మారతాయి. ఇది పిల్లల చదువుకు తీవ్రంగా అడ్డుపడుతుంది. ఒక్కోసారి బడులు మూసే పరిస్థితి రావచ్చు, దీనివల్ల ముఖ్యమైన చదువు సమయం వృథా అవుతుంది. పల్లెటూళ్లలో, లేదా సరైన సౌకర్యాలు లేని పట్టణ ప్రాంతాల్లోని లక్షలాది మంది పిల్లలకు ఆన్‌లైన్ తరగతులు అందుబాటులో ఉండవు. కాబట్టి ఈ కోల్పోయిన సమయాన్ని తిరిగి పొందలేరు. పాఠశాలలు తెరిచి ఉన్నా కూడా, సరిగా గాలి వెళ్ళని తరగతి గదుల్లోని తీవ్రమైన వేడి, పిల్లల ఆలోచనా శక్తిని బాగా తగ్గిస్తుంది. పిల్లలు తలతిరగడం, అలసిపోవడం, ఏకాగ్రత కుదరక ఇబ్బంది పడతారు. ఇది వారి నేర్చుకునే, గుర్తుంచుకునే, పరీక్షలలో బాగా రాణించే సామర్థ్యాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది. ఎయిర్ కండిషనింగ్ ఉన్న మంచి పాఠశాలల్లోని పిల్లలు చదువుకోవడం కొనసాగించవచ్చు. కానీ వెనుకబడిన ప్రాంతాల్లోని వారి తోటివారు ఎక్కువ చదువు కోల్పోతారు. తద్వారా విద్యాపరమైన అసమానతలు పెరుగుతాయి. విపరీతమైన వేడిలో బయట ఆడుకోవడం సాధ్యం కాదు, ఇది పిల్లల శారీరక, సామాజిక, భావోద్వేగ ఎదుగుదలకు అడ్డు పడుతుంది.

**ఆర్థిక సమస్యలు, మానసిక ఒత్తిడి:**

వేడి గాలుల ప్రభావం కేవలం ఒక్క బిడ్డకు మాత్రమే కాదు, ఇది కుటుంబాలు, సమాజాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ప్రభావితం చేస్తుంది. పొలం పనులు లేదా బయట కూలీ పనులపై ఆధారపడిన కుటుంబాలకు వేడి గాలుల వల్ల ఆదాయం తగ్గిపోతుంది. ఇది పిల్లలను బాల కార్మికులుగా మార్చి కుటుంబాన్ని పోషించడానికి సహాయపడేలా చేస్తుంది. పేద వర్గాల పిల్లలు సరైన ఇళ్లు లేని ప్రాంతాల్లో నివసిస్తూ, చల్లదనం, స్వచ్ఛమైన నీరు, వైద్యం అందుబాటులో లేక ఎక్కువగా నష్టపోతారు. శారీరక ఇబ్బందులతో పాటు, పిల్లలపై మానసిక ఒత్తిడి కూడా పెరుగుతోంది. నిరంతరం వేడి వల్ల కలిగే శారీరక అసౌకర్యం, దినచర్యలో మార్పులు, సరిగా నిద్ర పట్టకపోవడం, కుటుంబంలో పెరిగిన ఒత్తిడి పిల్లలలో ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలను పెంచవచ్చు. పిల్లలలో "వాతావరణం గురించి భయం" అనే భావన పెరుగుతోంది.

**భవిష్యత్ కార్యాచరణ**

దేశంలో పిల్లలపై వేడి గాలుల వల్ల కలిగే సమస్యను ఎదుర్కోవాలంటే కేవలం వచ్చినప్పుడు స్పందించడం కాకుండా, ముందుగానే ఆలోచించి అన్ని రంగాలను కలుపుకొని పనిచేయాలి. ముందుగా వేడి గాలుల కార్యాచరణ ప్రణాళికలను బలోపేతం చేసి గ్రామ స్థాయి వరకు తీసుకురావడం చాలా ముఖ్యం. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీలు వంటి పిల్లల కోసం ఉన్న ప్రదేశాలకు, స్థానిక పరిస్థితులకు తగినట్లుగా వేడి ప్రమాదాలను అంచనా వేసి సరైన పరిష్కారాలను ఏర్పాటు చేయాలి. మెరుగైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఉండాలి. అవి అన్ని వర్గాల ప్రజలకు స్థానిక భాషలలో కూడా చేరేలా చూడాలి. వేడిని తట్టుకునే భవనాలను నిర్మించడంలో పెట్టుబడి తప్పనిసరి. పాఠశాలలు, ఇళ్లలో కూల్ రూఫ్ టెక్నాలజీలు, సహజమైన చల్లదనాన్ని ఇచ్చే నిర్మాణాలు, పట్టణాల్లో చెట్లు నాటడం, పార్కులు ఏర్పాటు చేయడం వల్ల లోపల ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. ఆరోగ్య వ్యవస్థ పటిష్టంగా సిద్ధంగా ఉండాలి. అంటే అన్ని స్థాయిలలోని ఆరోగ్య కార్యకర్తల నుండి డాక్టర్ల వరకు పిల్లలలో వేడి సంబంధిత అనారోగ్యాలను గుర్తించడం, చికిత్స చేయడం, నిర్వహించడం కోసం శిక్షణ ఇవ్వడం. చివరగా, ఒక ముఖ్యమైన దీర్ఘకాలిక ప్రణాళిక వాతావరణ మార్పులు, వేడి గాలుల గురించి అవగాహనను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చడం. పిల్లలకు వేడి నుండి తమను తాము ఎలా రక్షించుకోవాలో, ప్రథమ చికిత్స, పర్యావరణ పరిరక్షణ గురించి జ్ఞానాన్ని అందించాలి. స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రత, మంచి ఆహారం, వేడి వల్ల కలిగే ఆర్థిక ఇబ్బందుల బారిన పడిన కుటుంబాలకు ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు అందించడం వంటి ప్రాథమిక సామాజిక ఆర్థిక సమస్యలను పరిష్కరించడం కూడా మొత్తం స్థితిస్థాపకతను పెంచడానికి చాలా ముఖ్యం.

ఈ సమగ్ర ప్రణాళికలను అమలు చేయడం ద్వారా మనదేశం వేడి గాలుల వినాశకరమైన ప్రభావాన్ని తగ్గించి పిల్లల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తును కాపాడగలదు. తక్షణమే, అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం ఇదే.



జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

# పండగలా ఇందిరా మహిళ శక్తి సంబరాలు

**గద్వాల నడిగడ్డ, జూలై 19 (జనం సాక్షి) :** ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలని గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం గట్టు మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తుందని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే నియోజకవర్గం అన్ని రంగాలలో ముందుకు వెళుతుందన్నారు. గట్టు మండల అభివృద్ధి కోసం 780 ఇద్దరమ్మా గృహాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.గట్టు మండలం గతం కంటే అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి చెందుతుందని, మండలం వ్యవసాయంపై ఆధారపడినందును వ్యవసాయానికి అవసరమైన ఇరిగేషన్ నీటి కాలువలు, త్రాగునీటి సదుపాయంతో పాటు రోడ్ల నిర్మాణం, విద్యాభివృద్ధికి విశేష కృషి చేయడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయడం జరుగుతుందని ఎవరు కూడా నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా



మహిళా సంఘాలకు ప్రత్యేక పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, బస్సులకు యజమానులుగా చేస్తుందని అన్నారు. గోనుపాడు,అలంపూర్ లలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అలాగే పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం కొత్తగా గట్టు మండలానికి 1,700 రేషన్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు పనులను వేగవంతం చేసి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు. అంతేగాక 2,030 కోట్ల రూపాయల రుణాలను మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరిగిందని, ఏప్రిల్ మాసం నుండి సెప్టెంబర్ మాసం వరకు ఐదు కోట్ల రుణ మాఫీ చేయడం జరిగిందని తెలియజేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం చర్య చేపట్టినందున ఇట్టి అవకాశాన్ని సదివినయోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘం సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షలను బీమా పథకం క్రింద వారి కుటుంబానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు.మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మహిళలు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించి చదివించాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలని కోరారు. గట్టు మండలంలో ప్రస్తుతం 50 శాతం అక్షరాస్యత ఉందని, రాబోవు రోజులలో ఆడపిల్లలను బాగా చదివించి అక్షరాస్యతను 100 శాతానికి పెంచాలని ఆకాంక్షించారు.కేంద్ర ప్రభుత్వం గట్టు మండల అభివృద్ధికి కోటి రూపాయలను మంజూరు చేయడం జరిగిందని, ఇట్టి నిధులతో గట్టు మండలంలో అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. మహిళా సంఘాల అభివృద్ధితో పాటు అక్షరాస్యతను పెంపొందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ. 7.25 కోట్ల బ్యాంకు రుణాల చెక్కు, రూ. 47.96 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కు, లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ తో కలిసి శాసనసభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు, సెర్ప్ డైరెక్టర్ జమున,మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హనుమంతు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి,మహిళా సంఘాల సభ్యులు, మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు తమ వంతు పాత్ర పోషించాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, జూలై 19 (జనం సాక్షి) :** కాలనీల సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్ శ్రీకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలో అభివృద్ధికి సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రజలకు ,ప్రజాప్రతినిధులకు సంక్షేమ సంఘాలు వారధులుగా ఉండాలని సూచించారు. శ్రీకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ నూతన అధ్యక్షులు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు నరసింహులు, కోశాధికారి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి చిరంజీవి, బి కురుమూర్తి, ఎన్ నరేందర్ నాయుడు, పి. నందు, బి. చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశం, శేఖర్, శ్రీహరి గౌడ్, ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, రాజు రెడ్డి, రాధాకృష్ణ, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



**బొంరాస్‌పేట దుద్యాల, జూలై 19 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు.శనివారం దుద్యాల మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 474 మంది లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్లలో సాధ్యం కానీ రేషన్ కార్డుల పంపిణీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో నేడు కల నెరవేరడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీటీ వీరేష్ బాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆవుటి శేఖర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ తాండూర్ డిపో కంట్రోలర్ రఘుపతి శంకర్‌పై చర్యలు తీసుకోవాలి

- సరైన సమయానికి బస్సులు నడపకుండా ప్రజలకు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే. శ్రీనివాస్

**తాండూరు, జూలై 19 (జనంసాక్షి) :** ఆర్టీసీ తాండూర్ డిపో కంట్రోలర్ రఘుపతి శంకర్ పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే, శ్రీనివాస్ పేర్కొన్నారు.శనివారం సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ తాండూర్ బస్ డిపోలో బస్సులు సక్రమంగా నడపడం లేదని నిరసన తెలిపారు. తాండూర్ ఆర్టీసీ డిపో లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ ఎస్సీ ఎస్టీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కే చంద్రయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలందరికీ ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ప్రజలకు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .తాండూర్ ఆర్టీసీ బస్ డిపోలో కంట్రోలర్ రఘుపతి శంకరు అనే ఉద్యోగులు వారి ఇష్టానుసారంగా బస్సులు నడుపుతూ కాలేజీ విద్యార్థులకు ప్రజలకు సరైన సమయానికి బస్సులు లేకుండా డబ్బులు అధికంగా వచ్చే ఏరియాకు బస్సులు పంపిస్తూ మిగతా వారికి బస్సులు లేకుండా విద్యార్థులకు ప్రజలకు మహిళలకు సమయానుకూలంగా బస్సు లేకపోవడంతో బస్సులు వేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు మహిళలకు పెట్టి ఆర్టీసీ డిపోలలో బస్సులు లేకుండా ప్రజలకు స్కూల్ కాలేజీ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైతున్న ఆర్టీసీ డిపో అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. ఆర్టీసీ ఉద్యోగుల మీద పని భారాన్ని పెంచుతూ వారిపై టార్గెట్లు పెట్టి డబ్బులు వచ్చే విధంగా ఆ ఏరియాలలో బస్సులు నడపాలని మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని, బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం వెంటనే పెంచాలని తాండూరు ఆర్టీసీ బస్సు డిపోలో ఇద్దరు కంట్రోలర్స్ ట్రాన్స్ఫర్అయినప్పటికీ వారిని వారిని రిలీవ్ చేయకుండా ఆర్టీసీ డిపో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ప్రజలకు విద్యార్థులకు సరైన సమయానికి వారు



బస్సులు లేకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సక్రమంగా పని చేయకుండా కాలేజీ విద్యార్థులకు స్కూల్ విద్యార్థులకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీ బస్సులని ప్రజల సౌకర్యం కోసం నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు కురువ బాలప్ప, పూలే అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రఘుపతి, ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


**తాండూరు, జూలై 19 (జనంసాక్షి) :** భవిష్యత్తులో విద్యార్థులు నాయకులుగా ఎదగాలని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్ అన్నారు.శనివారం పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ పాఠశాలలో ప్రజాస్వామ్యానికి, నాయకత్వానికి మరియు పౌర బాధ్యతకు అద్దంపట్టిన ఒక గొప్ప రోజుగా నిలిచింది. 2025-26 స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు ఎంతో ఉత్సాహంగా, క్రమశిక్షణతో మరియు పారదర్శకంగా నిర్వహించారు. 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు, తమ హెడ్ బాయ్ మరియు హెడ్ గర్ల్ లను ఎన్నుకోవడంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, డైరెక్టర్ సతీష్ తమ మార్గదర్శకత్వంతో కార్యక్రమాన్ని గౌరవప్రదంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఓటు విలువ, ఎన్నికల విధానం, మరియు నాయకత్వ నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. సతీష్ నాయకత్వంలోని



ప్రధాన విలువలైన వ్యక్తిత్వం మరియు బాధ్యత ను పాత్యరహితంగా స్పష్టంగా వివరించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. 7వ తరగతి విద్యార్థులు ఓటింగ్ విలువను, గోప్యతను, మరియు ప్రజాస్వామ్య ఆవశ్యకతను చక్కగా ఆవిష్కరించే నాటకాన్ని ప్రదర్శించారు. ఇది శ్రద్ధగా ఆలోచింపజేసే ప్రయత్నంగా నిలిచింది. 10వ తరగతి నామినేట్ చేసిన విద్యార్థులు అధికారికంగా ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. మొదటి ఓట్లను ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ మరియు సతీష్ వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నైతికతతో, క్రమశిక్షణతో ఓటు వేశారు. ఓటింగ్ ముగిసిన అనంతరం, బ్యాలెట్ పెట్టెలను సీల్ చేయడం ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశారు. జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగిస్తూ, ప్రజాస్వామ్య ఆత్మను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి దురహంకారాన్ని ఎండగట్టాలి

**వనపర్తి, జూలై 19 (జనంసాక్షి) :** చేపలు పట్టే వాకిటి శ్రీహరిని మంత్రిని చేశానని బట్టలుతికే శంకర్ ను ఎమ్మెల్యేను చేశానని సీఎం రేవంత్ రెడ్డి బీసీ శాసనసభ్యులను ప్రజల ముందర అవమానించారని వనపర్తి జిల్లాబీఆర్ఎస్ అధ్యక్షుడు గట్టుయాదవ్ ధ్వజమెత్తారు.బి.సి ఎం.ఎల్.ఏ లను అవమానించిన రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.బట్టలు ఉతికేవాళ్ళు,చేపలు పట్టే వాళ్ళు అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడడం అహంకారమా, అహంభావమా అని ప్రశ్నించారు.నిరంజన్ రెడ్డి గారి ఆదేశం మేరకు శనివారం 12వార్డ్(రాజానగరం)లో ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస.రమేష్ గౌడ్ ఆధ్వర్యములో మాజీ ఎం.పి.టి.సి.విజయలక్ష్మి గారి స్వగృహంలో జరిగింది. కె.సి.ఆర్ మీద విషం కక్కడానికి కోట్ల ఖర్చు చేసి చేయడం ఎందుకని ప్రశ్నించారు. రేవంత్ పర్యటనవల్ల ఉమ్మడి జిల్లాకు ఒరిగింది ఏమి లేదని, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నిరంజన్ రెడ్డి ని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదని అన్నారు.సమావేశంలో గట్టు యాదవ్ తో పాటు జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ కలసి మాట్లాడారు. కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,కోయిల్ సాగర్ పెండింగ్ పనులు పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు నీరందించిన ఘనత



కె.సి.ఆర్ , మాజీ మంత్రివర్యులు నిరంజన్ రెడ్డిదని, 90శాతం పూర్తి అయిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 10శాతం పూర్తి చేయలేని సి. ఎంకి మా నాయకులను విమర్శించే నైతిక హక్కు ఎక్కడిది అని ప్రశ్నించారు.కేవలం 25వేల కోట్లు కేటాయించలేని ముఖ్యమంత్రి,జిల్లా నేతలు ఉత్సవిగ్రహాలుగా మిగిలిపోయారని అన్నారు. ఈ సమావేశములో గ్రామ పార్టీ అధ్యక్షులు స్టార్ ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి,మాజీ కౌన్సిలర్స్ బండారు.కృష్ణ,నాగన్న యాదవ్,గులాం ఖాదర్ ఖాన్,ఇమ్రాన్,స్టార్ రహీమ్, మురళిసాగర్,డాక్టర్ డ్యానియల్,సతీష్,బాలరాజు, నందిమల్ల సుబ్బు, మునికుమార్,ఏ.కె.పాషా,రామకృష్ణ, అనపటి రాము,గ్రామ నాయకులు బుచ్చిబాబు,కుమ్మరి సత్యన్న,చంద్రయ్య,వెంకటేష్,రంజిత్,రఘు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి ప్రతిబింబం



**హయత్‌నగర్, జూలై 19 (జనం సాక్షి) :** సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యాన్ని కాపాడేందుకు, వారికి సకాలంలో వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో మన్సూరాబాద్ డివిజన్ ప్రగతి నగర్ ఆదర్శ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ భవనం లో ఇవ్య హాస్పటల్ సహకారం తో ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి హాజరై, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ శిబిరంలో బీపీ, షుగర్, జెనరల్ చెకప్ లతో పాటు వృద్ధులకు అవసరమైన ఆరోగ్య సలహాలు, చికిత్స సూచనలు అందించబడటం గర్వించదగ్గ విషయమని వారు అన్నారు. శ్రామిక వర్గానికి, సీనియర్ సిటిజన్లకు ఈ రకమైన ఉచిత వైద్య శిబిరాలు జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని వారు కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి ప్రతిబింబమని ఈ దిశగా చేస్తున్న ఈ ప్రయత్నం నిజంగా ఆదర్శప్రాయమైనదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఇవ్య హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున రావు, డాక్టర్ సుధీర్ రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది, ఆదర్శ సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, రాంరెడ్డి, సోమిరెడ్డి, బ్రహ్మారెడ్డి, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ రావు, సీనియర్ సిటిజన్స్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**మక్తల్, జూలై 19 (జనంసాక్షి) :** మహిళలు ఆర్థికంగా ఎదిగితే జిల్లా, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్, క్రీడలు యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మన దేశానికి భారత మాత అని పేరుందని, రాష్ట్రానికి తెలుగు తల్లి ఉందని, అన్ని నదులు కూడా మహిళల పేర్లతోనే ఉన్నాయని మహిళకు అంత శక్తి ఉందని ఆయన చెప్పారు. శనివారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని వేంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించారు. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక డైరీ డెవలప్మెంట్ క్రీడలు యువజన సర్వీసులు మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు డా వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రికి మహిళలు బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ మక్తల్ నియోజకవర్గంలోని అమరచింత, నర్వ, ఉట్కూర్ మండలాల్లోని మహిళా సమాఖ్య సంఘాలకు 1,08,00,000/- (ఒక్కకోటి ఎనిమిది లక్షల రూపాయలు)లతో ప్రభుత్వం అందించిన 3 ఇందిరా మహిళా శక్తి ఆర్టీసీ బస్సులను, 10 లక్షల వ్యయం గల సంచార చేపల విక్రయ కేంద్ర వ్యాన్ ను ప్రారంభించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి సంబరాలలో మంత్రి, కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ప్రగతికి పెద్దపీట వేసిందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమైన పావలా వడ్డీ పథకాలు నేడు మళ్ళీ ఇందిరమ్మ రాజ్యంలోని రేవంత్ ప్రభుత్వంలో మళ్ళీ అమలు అవుతున్నాయని చెప్పారు. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణంతో పాటు బస్సులకు వారినే యజమానులను చేస్తున్నామన్నారు. ఒకప్పుడు ఒక మహిళ హైదరాబాద్ వెళ్ళి రావాలంటే 700 బస్సు ఛార్జీలు అయ్యేవని, కానీ ఇప్పుడు 7 పైసల ఖర్చు లేకుండా వెళ్లి రావచ్చన్నారు. మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామన్నారు. ఉచిత కరెంటు పథకం కింద మక్తల్ నియోజకవర్గంలో నెలకు రూ.72 లక్షలు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. కళ్యాణ లక్ష్మి షాదీముబాకర్ ఆర్థిక సహాయాన్ని కూడా మహిళల పేరిటనే ఇస్తున్నామన్నారు. గతంలో ఏడాదికి ఒకసారి కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తే ఇప్పుడు మూడు నెలలకు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ అంటూ ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, తాము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను 175 కోట్లతో పార్టీలకు అతీతంగా, ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిర్మించి ఇస్తున్నామన్నారు. మక్తల్ నియోజకవర్గంలో 12 వేల ఇందిరమ్మ ఇండ్లు అవసరమని, కానీ మొదటి విడతగా 3500 ఇస్తూ, 8 ట్రిప్పుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మహిళలను వంటింటి కుందేళ్లుగా చేయాలనుకున్నదని, కానీ తమ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలని సంకల్పం తీసుకున్నదని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బాగుంటే ఊరు, కుటుంబాలు, గ్రామాలు బాగుంటాయన్నారు. తమ పిల్లల కు మంచి చదువులు చెప్పించేందుకు తల్లులు తాపత్రయ పడతారని, అందుకే 200 కోట్లతో 24 ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మక్తల్ లో నిర్మిస్తామన్నారు. ఇందిరా మహిళా క్యాంటీన్ ల పేరుతో మహిళా సంఘాల ద్వారా క్యాంటీన్ లను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వం 2845 మహిళా సంఘాలకు 2023-24 మరియు 2024-25 సంవత్సరంలో



వడ్డీలేని 8,28,31,000/- రుణాలను అందించిందని మంత్రి వెల్లడించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంద్ర మహిళా శక్తి పేరిట 119 నియోజకవర్గాలలో సంబరాలు చేస్తున్నారని, ఇప్పుడు మక్తల్ లో ఇంత ఘనంగా సంబరాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మహిళా శక్తి లో భాగంగా జిల్లా కేంద్రంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశామని, త్వరలో జిల్లాలోని అన్ని మండలాలలో పెట్రోల్ బంక్ ల ఏర్పాటుకు చేసేందుకు మంత్రి సూచించినట్లు ఆమె తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే జిల్లా కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం ఆత్మకూర్, మక్తల్ మండలాల మహిళా సమాఖ్య సంఘాలకు ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ ల కోసం 6,00,00,000/-(ఆరుకోట్ల రూపాయలు) చెక్కును కలెక్టర్ తో కలిసి అందజేశారు. ప్రమాద భీమా చెక్కులను, మినీ గోదాముల చెక్కులను, లోన్ భీమా చెక్కులను మహిళా సమాఖ్య సంఘాలకు అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మొగులప్ప, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి, కోశాధికారి, జిల్లాలోనీ అన్ని మండల సమాఖ్యల అధ్యక్ష కార్యదర్శులు,డిపిఎం,సిసిలు, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు, అధికారులు, అనదికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు బీఆర్ఎస్ పక్షాన నిలవడం ఖాయం

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు యస్.రాజేందర్ రెడ్డి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 19 (జనం సాక్షి) :** త్వరలో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీనీ ఓడించి బిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని గౌరవ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు యస్.రాజేందర్ రెడ్డ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కోటకొండ మార్కండేయ స్వామి దేవాలయ మినీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ముఖ్య కార్య కర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా గ్రామాలా వారిగా కార్యకర్తలతో సలహాలు సూచనలు తెలుసుకొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం అనివార్యం అని అన్నారు. అందుకే బిఆర్ఎస్ శ్రేణులు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి అని పిలుపునిచ్చారు. రేపటి నుండి మండలాల ముఖ్య నాయకులు గ్రామాలలో పర్యటించి ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఎట్లా తూట్లు పొడిచింది అని వివరించండి అదేవిధంగా మన శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమై ప్రజలలో చులకన అయ్యిందని ఎన్నికల అంతరం గ్యారంటీగా రైతు భరోసా ఎత్తివేస్తారని జోస్యం చెప్పారు. ప్రజలలో కెసిఆర్ పట్ల, బిఆర్ఎస్ పార్టీ పట్ల ఆదరణ పెరిగిందని ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని ఎన్నికలలో పోరాడాలని అన్నారు. ఎన్నికలలో నాయకులు, కార్యకర్తలు ఏవిధంగా వ్యవహరించి ప్రజలకు చేరువ కావాల్సిన వ్యూహాలను వివరించారు. ప్రభుత్వ మెడలు వంచి హామీలు అమలు చేయాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు... మాప్రభుత్వం ఉన్నప్పుడు కేసీఆర్ తెచ్చిన ప్రతియొక్క ప్రథకము ప్రతి గడప గడపకు వెళ్లి గుర్తు చేయండి కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస ప్రభుత్వం 17 ఎంపీటీసీలు 28 గ్రామపంచాయతి స్థానాలు మనమే విజయం సాధించాలి. వెన్నుపోటు పొడిచిన మన పార్టీ నుండి పోయిన నాయకులు కానీ కార్యకర్తలు కాని ఆటువువంటికి వాళ్లకు మన పార్టీలో స్థానంలో లేదు ఆ ఆశ వదులుకోండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన



**చిన్నశంకరంపేట, జూలై 19 (జనం సాక్షి) :** చిన్నశంకరంపేట మండల జడ్పిహెచ్ఎస్ సూరారం ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్నశంకరంపేట మండల పోలీస్ శాఖ చేపట్టిన మేలుకొలుపు కార్యక్రమంలో భాగంగా మేలుకొలుపు పోలీస్ కళాబృందం డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల అవగాహన, రోడ్డు భద్రత, బాల్య వివాహాల నివారణ.వంటి అంశాల పైన చేపట్టిన కార్యక్రమం విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి రెడ్డి, మెదక్ జిల్లా ఎస్పీ ఆఫీస్ ఎస్సై రామచంద్రనాయక్, శంకరంపేట ఎస్ఐ నారాయణ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాంపల్లి, ఎస్పీ ఆఫీస్ హెడ్ కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుళ్లు ఇసాక్, జనార్ధన్, అలాగే పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గోదావరిలో తెలంగాణ వాటాను వదులుకునే ప్రసక్తే లేదు



**రేవల్లి, జూలై 19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన బనకచర్ల ద్రోహాన్ని బద్దలు కొట్టి, ఆంధ్రప్రదేశ్ జలదోపిడిని అడ్డుకొని తీరుతామని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశానుసారం బీఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు గోపాలపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను రాయలసీమకు తరలించడం కోసం ఏపీ నిర్మించతలపెట్టిన అక్రమ ప్రాజెక్టే పోలవరం–బనకచర్ల లింకు ప్రాజెక్టు అని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేయడం దుర్మార్గం. ఇంత వరకు స్కాలర్షిప్లు ఇవ్వలేదు. విద్యార్థులకు ఇస్తామన్న ఐదు లక్షల విద్య భరోసా కార్డు ఇవ్వలేదు. విద్యార్థినిలకు స్కూటీలు ఇవ్వలేదు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులు పది పాస్ అయితే 10 వేలు, ఇంటర్మీడియట్ పాస్ అయితే 15 వేలు, డిగ్రీ పాస్ అయితే 25 వేలు , పీజీ పాస్ అయితే లక్ష, ఎంఫిల్ , పిహెచ్డి పూర్తిచేస్తే 5 లక్షల రూపాయలు ఇస్తాను ఘోరంగా మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. 6 గారంటీలకు, 420 హామీలకు తూట్లు పొడిచి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు మరియు బిజెపి ప్రభుత్వంతో అంటకడుతూ పదవిని కాపాడుకుంటున్నటువంటి మోసకారి రేవంత్ రెడ్డి అని అన్నారు. తక్షణమే గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు భాగ్యరాజ్, వైస్ ఎంపీపీ శేఖర్, సురేష్, రియాజ్ తదితరులు ఉన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, జూలై 19 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించి, శరవేగంగా అభివృద్ధి చేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. రూ. 1.35 కోట్ల వ్యయంతో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డులలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం 14వ వార్డు త్రిశూల్ నగర్ లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించి సమగ్ర ప్రణాళికతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జడ్చర్ల అభివృద్ధి మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, ప్రతి వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందాలని, గత ప్రభుత్వ హయాంలో జడ్చర్ల మున్సిపాలిటీ కుదేలయిందని, మున్సిపాలిటీకి రావలసిన రూ. 30 కోట్ల నిధులు మహబూబ్ నగర్ కు మళ్లించడానికి మర్చిపోలేమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి జడ్చర్ల అభివృద్ధికి నిధులు తెచ్చానని, నాయకత్వం అనేది మాటల్లో కాదు చేతల్లో చూపించాలని, అభివృద్ధి చేసేది మేమే అని స్పష్టం చేశారు. అనంతరం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ తో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ సమీపంలో ఉన్న హజ్రత్ సయ్యద్ మొహబ్బత్ అలీషా దర్గాలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు రమేష్, చైతన్య చౌహన్, రహీం, రాజు, మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి రెడ్డి, నాయకులు నర్సింలు, అశోక్ యాదవ్, నిత్యానందం, భాస్కర్ రెడ్డి, ఆనంద్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాల్కల్లో భారీ వర్షం

- అన్నదాతల్లో హర్షం..!



**న్యాల్కల్, జూలై 19 (జనం సాక్షి) :** వర్షం కోసం నెల రోజులుగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు కురిసిన వర్షం కాస్త ఊరట కలిగించింది. వేల ఎకరాల్లో పత్తి, కంది, సోయా, పెసర, మినుము, చెరకు తదితర పంటలను సాగు చేశారు. దాదాపు నెల రోజులకు పైగా మండలంలో వరుణ దేవుడు కరుణించకపోవడంతో వేలాదిమంది అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రూపాయలు లక్షలు, వేలు పెట్టుబడును పెట్టి సాగుచేసిన పంటలకు సకాలంలో వర్షం కురువకపోవడంతో చేసేది లేక నిరాశకు లోనయ్యారు. ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం దాదాపు గంటకు పైగా ఏకధాటిగా కురిసిన భారీ వర్షం అన్నదాతలకు కాస్త పోరాట కలిగించింది. మధ్యాహ్నం 1.50 గంటల నుండి మూడున్నర గంటలకు పైగా వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షంతో పలు పంట పొలాల్లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతంలోని భూములు భారీగా కోతకు గురయ్యాయి. మండలంలోని పలు పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్, ఆర్అండ్బీ రోడ్లపై భారీగా వరద నీరు వచ్చి చేరింది. పలు పంచాయతీ, జిల్లా పరిషత్ కోతకు గురయ్యాయి. మండల కేంద్రమైన న్యాల్ కల్, ఇబ్రహీంపూర్, చాల్కి, రాఘవాపూర్, అత్తునూర్, చినిగేపల్లి, ముంగి, డప్పూర్, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. నెలరోజుల అనంతరం కురిసిన వర్షం అన్నదాతలకు కాస్త పోరాట కలిగించింది.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



**నారాయణఖేడ్, జూలై 19 (జనం సాక్షి) :** పార్టీ బలోపేతానికి కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో శనివారం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా యూత్ కాంగ్రెస్ నాయకులు వారి సత్తను చాటాలని వారు అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాలలోని ప్రజలకు తెలియజేయాలని దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు యూత్ కాంగ్రెస్ నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి సరైన న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు నరేష్ గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధారెడ్డి, తదితర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయలి

- ఉర్కొండ ఎంపీడీవో కృష్ణయ్య



**ఉర్కొండ, జూలై 19 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలియజేశారు. మండలంలోని రేవల్లి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించడం జరిగింది. ఇది వరకే ప్రారంభించిన ఇండ్ల పనులను వేగవంతం చేసి బేస్మెంట్ లెవెల్ పూర్తి కాగానే పంచాయతీ కార్యదర్శిచే ఫోటో తీ యించుకొన్నట్లయితే మొదటి విడత 1,00,000/- (లక్ష) రూపాయలు లబ్ధిదారుల ఖాతాకే నేరుగా జమచేయబడతాయని లబ్ధిదారులకు అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం గ్రామంలోని నర్సరీని సందర్శించి వనమహోత్సవ లక్ష్యానికి అనుగుణంగా ఎక్కువ మంది కూలీలను పనిలో పెట్టి త్వరగా గుంతలు తీయడం, మొక్కలు నాటించడం పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోజా(టి.ఎ). సురేష్ కుమార్ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ బియ్యాన్ని నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలి



**నర్సాపూర్, జూలై 19 (జనం సాక్షి) :** సీఎంఆర్ బియ్యాని నిర్ణీత సమయంలో డెలివరీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ రైస్ మిల్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానందం అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి ఎండి. అబ్దుల్ నిసార్తో కలిసి 2023 – 24 సంబంధించిన సిఎంఆర్ పెండింగ్ బియ్యాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ 2023 – 24 రబీకి సంబంధించిన జిల్లాలోని 67 మిల్లులకు 2,52,013 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించడం జరిగిందని అందుకు మిల్లర్లు 1.70,791 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను1,64,826 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లింగ్ చేసి డెలివరీ చేయడం జరిగిందని మిగతా 5,965 మెట్రిక్ టన్నుల బియ్యం రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అందించవలసి ఉందనే వెంటనే సీఎంఆర్ మిగులు బియ్యాన్ని ఈనెల 27 లోగా ప్రభుత్వానికి అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఇచ్చిన సమయంలోపు బియ్యం అందించేలా రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ అధికారులకు రైస్ మిల్లర్లకు సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లై అధికారులు సిబ్బందితోపాటు పిఎసిఎస్ చైర్మన్ మాచునూరి రాజు యాదవ్ సురేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# విద్యతోనే బంగారు భవిష్యత్



**కౌడిపల్లి, జూలై 19 (జనంసాక్షి) :** మండల కేంద్రమైన కౌడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా, 2024 – 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు సిల్వర్ మెడల్ లు గ్రామ ప్రముఖులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడల్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చదువులో పోటీ తత్వంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య బంగారు భవిష్యత్తుని ఇస్తుందన్నారు. పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైనది అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహం అందించిన యువ నాయకులు శ్రీనివాస్ గుప్తను అందరు అభినందించి శాలువాతో పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీనివాస్ గుప్తా ఉపాధ్యాయులను, అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మజ, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాజిద్ హలీ, రిటైర్డ్ ఉపాధ్యాయులు పుండరీకం గౌడ్, మోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు మాటూరు శాఖయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు భుజరంపేట మల్లేశం, చంద్రం దుర్గ గౌడ్, సత్యనారాయణ గౌడ్, మోతిలాల్ గౌడ్, మక్బుల్, దర్జీ చంద్రం, వెంకటేశం, కుర్మ లక్ష్మణ్, నాస్ల వెంకట్ గుప్తా, నాసర్ ఖాన్, గుడ్డంల వెంకటేశం, సంజీవ్ ,నరేందర్ ఎస్ఎంసి చైర్మన్ రాధిక, పూర్ణిమ, మాజీ చైర్మన్ లు, జగన్, మమత, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పూరి గుడిసెలకు పట్టాలు ఇవ్వండి

- నేడు తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా
- సిపిఐ నాయకురాలు బుజ్జమ్మ




**సంగారెడ్డి, జూలై 19 (జనం సాక్షి) :** గత ఏడు సంవత్సరాల క్రితం పూరి గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ నాయకురాలు బుజ్జమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సదాశివపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సదాశివపేట పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని సిద్ధపూర్ కాలనీలో గత ఏడు సంవత్సరాల క్రితం సిపిఐ ఆధ్వర్యంలో పూరి గుడిసెలు వేయడం జరిగిందన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పూరి గుడిసెలకు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. నిరుపేదలైన చాలామంది ఇండ్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ అద్దెలు కట్టలేకపోతున్నారని ఆమె అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సిద్దాపూర్ లో వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి అనేకసార్లు వినతలు సమర్పించిన ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు కానీ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పూరి గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పూరిగుడిసెలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమా వారం తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని ధర్నాను విజయవంతం చేయాలని చేయాలని బుజ్జమ్మా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి గంగమ్మ, గొల్ల యాదమ్మ, పాల్గొన్నారు.

# భోజనం రుచి బాగుందా?

- విద్యార్థులతో కలిసి భోంచేసిన కలెక్టర్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తింటున్న దృశ్యాన్ని చూసి అక్కడే ఉన్న కలెక్టర్ వారి వద్దకు వెళ్లి భోజనం రుచి బాగుందా అని విద్యార్థులను అడిగి వారి మధ్యే కూర్చుండి భోంచేసి అందరిని ఆశ్చర్య పరిచారు. శనివారం మండలంలోని జెడ్పీటీసీ అంకోలీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న ఆరోగ్య జాతర గ్రామసభలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆరోగ్య జాతర కార్యక్రమం లో విద్యార్థులు గ్రామసభ, డ్రగ్స్‌పై ప్రదర్శించిన ప్రదర్శనను తిలకించి అభినందించారు. అనంతరం స్టూడెంట్ చాంపియన్ లకు సర్టిఫికెట్‌లు అందించారు. అనంతరం న్యూట్రిగార్డెన్ ఆరోగ్య తోట, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, బియ్యాన్ని పరిశీలించి, పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యార్థులతో నే సమాజంలో మార్పు అని మంచి ఆరోగ్య అలవాట్లు అలవర్చుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించి, భవిష్యత్తులో వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.

# మహిళా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రభుత్వం కృషి

- ఎంపీ కడియం కావ్య
- మహిళలను వ్యాపారస్తులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలుకు ప్రభుత్వం కృషి
- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ ప్రతినిధి, జూలై 19( జనంసాక్షి):** రాష్ట్రంలో మహిళలందరినీ ప్రగతి పదం వైపు పయనింపచేస్తూ ఆర్థికంగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంగెం మండల సమాఖ్యలో అందనపు గదులు, గీసుకొండ మండల సమాఖ్యలో ప్రహరీ గోడ నిర్మాణం పనులకి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి అభివృధి పనులకు శంకుస్థాపన చేశారు. సంగెం శాంతి మండల సమైక్య అదనపు గదులకు 8 లక్షలు, గీసుకొండ ప్రగతి మండల సమైక్యకు కాంపౌండ్ గోడకు 10 లక్షల రూపాయలను ఎంపీ ల్యాండ్స్ నిధుల నుంచి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా ఎంపీ కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేశారని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో అభివృద్ధి పథకాలను అందించారు. ఆశావర్కర్ల నుండి అంతరిక్షం వరకు మహిళలు ఎక్కడ తగ్గేదే లేకుండా ముందుకు వెళు_న్నారని అది గమనించి సీఎం ఇంద్ర మహిళా శక్తి పథకం ద్వారా మహిళల అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టారని వారన్నారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మహిళా డైరీను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సంగెం గీసుకొండలలో ఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్ను ఆర్టీసీ బస్సు వచ్చిందని అవి అభివృద్ధిలోకి వచ్చుటకు కృషి చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో ప్రభుత్వం నుండి ఇన్స్టిట్యూషనల్ బిల్డింగ్స్‌లో కిషోర్ బాలికలు 60 ఏళ్లు దాటిన మహిళలు దివ్యాంగుల గ్రూపులు చేయాలన్నారు. ముఖ్యంగా సంఘం నుండి సీనియర్ సిటిజన్స్ వారి పిల్లలు చూడడం లేదని కలెక్టరేట్కు వచ్చి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేకుండా వారి నిస్సహాయ స్థితిని స్వయం సహాయక సంఘాల ద్వారా సమస్యలు పరిష్కరించే దిశగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ కౌసల్యాదేవి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి,మండల సమైక్య అధ్యక్షురాలు రాధిక,మరియు మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపు భూపాలపల్లి జిల్లాలో ముగ్గురు మంత్రుల పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి భూపాలపల్లి జిల్లాలో రేపు(సోమవారం) మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు పర్యటించనున్నారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లు శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ముగ్గురు రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోరి కొత్తపల్లి మండలకేంద్రంలో కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం, గణపురంలో పోలీస్ సర్కిల్ కార్యాలయం, చెల్పూర్ బస్ స్టాండ్, గ్రంథాలయ భవనం, టాస్క్ ఆధ్వర్యంలో యూత్ శిక్షణా కేంద్రం ప్రారంభోత్సవాలు జరగనున్నాయని సంబంధిత శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ, రెండు పడకగదుల ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి కార్యక్రమం సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రుల పర్యటన విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మీ, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**నిర్మల్ రూరల్,జూలై 19 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా మామడ మండలంలోని కొరటికల్ గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు అంశాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించారు. ఆపై ఉన్నత పాఠశాల తరగతులను సందర్శించి,పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి,వారి విషయావగహన పరీక్షించారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి నోట్‌బుక్స్, యూనిఫాంలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వంట గదిని పరిశీలించి,వంట మనుషులు అనుభవం, భోజన మెనూ వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శుచి, శుభ్రతలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్, అదనపు కలెక్టర్ లు స్వయంగా భోజనం వడ్డించారు. తర్వాత చిన్నారులతో కలిసి కూర్చొని ముచ్చటిస్తూ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. నీరు పోసిన కలెక్టర్,ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రేపు తెల్లరేషన్ కార్డుల పంపిణీ

- పంపిణీ చేయనున్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, జులై 19 (జనంసాక్షి):** రేపు అర్హులైన లబ్ధిదారులకు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశములో వారు మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా గత ప్రభుత్వ హయాంలో పేదలు ఎదురు చూస్తున్న తెల్ల రేషన్ కార్డుల మంజూరు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెరవేరనుందని, రేపు మందమర్రి లోని సాయిమిత్ర గార్డెన్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 1500 కొత్త రేషన్ కార్డులు మంజూరు కాగా తొలి విడతగా 650 మందికి లబ్ధి చేకూరనున్నట్లు వారు తెలిపారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నారని, నియోజక వర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి మంత్రి వివేక్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులు మందమర్రి సాయిమిత్ర గార్డెన్ నిర్వహించే రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కార్డులను పొందాలని సూచించారు. ఈ సమావేశములో నాయకులు గాండ్ల సమ్మయ్య, కళ్యాణ్, కుమార్, రమేష్, సురేందర్, రవి, వెంటరెడ్డి, వీరస్వామి, రవీందర్, రామకృష్ణ, లచ్చులు, శ్రీనివాస్, మహిళ నాయకురాళ్ళు పుష్ప, రాజేశ్వరి, సునీత, పాల్గొన్నారు.



# చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**సారంగాపూర్ (జనంసాక్షి) :** పొట్యా గ్రామానికి చెందిన పోటెండ్ల భీమేష్, వయస్సు (34)అను వ్యక్తి శుక్రవారం సాయంత్రం సమయంలో పొట్యా గ్రామ శివారులో స్వర్ణ డ్యామ్ వెనుక నీటిలో చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి రాగపోగా,శనివారం రోజు కుటుంబ సభ్యులు వెతుకుతుండగా స్వర్ణ డ్యామ్ వెనుక భాగంలో నీటిలో కాళ్లకు చేపలు పట్టే వల చుట్టుకొని నీటిలో మునిగి చనిపోయి ఉండడం గమనించారు మృతుడు చేపలు పడుతూ ప్రమాదావశత్తు వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగి చనిపోయి ఉంటాడని మృతుడి తండ్రి నడిపన్న పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహమును పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

# గోదావరి జలాలు విడుదల చేయాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా



**పాలకుర్తి, జూలై 19(జనంసాక్షి)** సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే గోదావరి జలాలు విడుదల చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందూ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేకపోవడం వల్ల ఇప్పటి వరకు గోదావరి జలాలను విడుదల చేయకపోవడంతో రైతాంగం అవస్థలు పడుతుందన్నారు. ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపి రైతాంగాన్ని సాగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆనంతరం తహసీల్దార్ నాగేశ్వరచారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమ సత్యం, శ్రీలత, ముస్కు ఇంద్రారెడ్డి, గడ్డి సమ్మయ్య, గజ్జి శ్రీనివాస్, బెల్లి వెంకన్న, ఇంతల నాగిరెడ్డి, మల్లేష్ ఉన్నారు.

# సరసనపల్లి వీరుల అమరత్వానికి 25 ఏళ్లు

- కామ్రేడ్ భరత్‌తో గొప్ప అనుబంధం :ఎమ్మెల్యే వేముల వీరేశం
- భరత్ ఆశయాల కోసం ఉద్యమిద్దాం : విమలక్క
- రామన్న భరతన్న అడుగుజాడల్లో పేద ప్రజలకు అండగా ఉంటాం: కాంగ్రెస్ యువ నాయకులు కుంజ సూర్య



**కొత్తగూడ, జూలై 19 (జనంసాక్షి):** గోదావరిలోయ సాయుధ ప్రతిఘటన ఉద్యమ ముద్దుబిడ్డలు కామ్రేడ్ బండి అల్లూరు (దేవన్న, భరత్, జార్జి), కామ్రేడ్ పద్దారి కృష్ణారెడ్డి, విజయ్ కామ్రేడ్ రాజులు అనాటి పాలకపార్టీ కుట్రల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా సరసనపల్లి ప్రాంతం లో బూటకపు ఎన్కౌంటర్లో అసువులు బాసారు. కామ్రేడ్స్ అమరత్వం నేటికి 25 ఏండ్లు ఒరుగల్లు ఏరియాపిడిత ప్రజలను ఏకం చేసి అనేక ప్రజా పోరాటలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ భరత్ అన్నతో గొప్ప అనుబంధం ఉందని కలిసి పనిచేశానని అన్నారు. అతని ఉద్యమ స్ఫూర్తి నాలో ఉత్తేజాన్ని మరింత పెంపొందించి ఈరోజు ఎమ్మెల్యే స్థాయికి వచ్చానని అన్నారు. పేద ప్రజల కోసం పనిచేసే విధానాన్ని అతని వద్ద నేర్చుకున్నానని తెలిపారు. భరత్ అన్న లేకపోయినా వారి కుటుంబంతో ఇప్పటికీ అనుబంధం అలాగే ఉందని తెలిపారు.

అరుణోదయ గాయకురాలు విమలక్క మాట్లాడుతూ పీడిత ప్రజలకు అండగా నిలిసిన సిపిఐ (యంయల్) జనశక్తి పై పాలక పార్టీ అనేక దొంగ దాడులు చేసింది. అనేకమంది ప్రజలపై, రైతంగా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లలోబంధించింది. మాట- ఆట- పాట లపై ఆంక్షలు విధించి పట్నల్లో వల్లెలో అప్రకటిత నిషేదాలు కొనసాగించింది. నేటికీ పాలకులు మారిన ప్రజలపై పిడన మారలేదు. పిడన, దోపిడికి వ్యతిరేకంగా పోరాటలు చేయాలి. నేడు ఆపరేషన్ కగార్ పేర మోడీ- అమిత్ షా నేత్రత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం మానవ హననానికి పాల్పడుతోందన్నారు.

కాంగ్రెస్ యువ నాయకుడు మంత్రి సీతక్క కుమారుడు సూర్య మాట్లాడుతూ మా తండ్రి రామన్న ఉద్యమ స్ఫూర్తి మా రక్తం లో ఉందని అన్నారు. రామన్న భరతన్న ఉద్యమ స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా ఉంటామని వారి ఆశయం కోసం పనిచేస్తామని కుంజ సూర్య, బండి కృష్ణ శ్రీనివాస్‌లు అన్నారు. పూర్ణ జనశక్తి నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేర వరంగల్ జిల్లా ముద్దుబిడ్డలు సిపిఐ మావోయిస్టు నాయకులు కామ్రేడ్ ఏనోట్ (టేకులగూడెం), కామ్రేడ్ శంకర్ (చల్లగరిగే), కామ్రేడ్ సాంబయ్య (తరాలపల్లి), కామ్రేడ్ రాకేశ్ (చింతగట్టు) క్యామ్రేడ్ రేణుక (కడవెండి), కామ్రేడ్ గాజర్ల రవి గణేశాన్న (వెలిశాల) అమరులైనారు. ఆపరేషన్ కగార్ లో అసువులు బాసిన అమరులందరికి సిపిఐ (యం యల్) జనశక్తి వినమ్రంగా జోహార్లు తెలియజేస్తుంది. మధ్యాభారతదేశంలోని అటవీ సంపద, ఖనిజలను కార్పొరేట్ సంస్థలకు అప్పాజెప్పడానికి జరుగుతున్న కుట్రల్లో ఆదివాసులకు అండగా నున్న సిపిఐ మావోయిస్టు పార్టీని పూర్తిగా 2026 మార్చి వరకు నిర్మూలించడానికి ఆపరేషన్ కగార్ పేర అడవిలో రక్తం పారిస్తుంది. ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా ప్రజా పోరాటాల ద్వారానే ఓడించగలం, పిడితప్రజలు మా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు. గోదావరిలోయ దళల ఇంచార్జ్ కామ్రేడ్ కృష్ణారెడ్డి శంకరన్న స్థూపం, కొత్తగూడ మండలం గాంధీనగర్ లో నిర్మించడం జరిగింది. స్థూపం పక్కనే సుమారు 10 ఎకరాల స్థలం అమరవీరుల కుటుంబాలకోసం కేటాయించామని, ఆ స్థలంలో నేడు భూకబ్జాదారులు ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వెంచర్లగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని, స్థలంలో ఎలాంటి కట్టడాలు చేసిన సహించబోమని హెచ్చరిస్తున్నామని, ప్రజలకు చెందాల్సిన భూమి ప్రజలకే చెందాలని, పాలకపార్టీ అండతో డబ్బు అహంకారంతో భూకఖ్ లకు పాల్పడి ప్రజాద్రోహులుగా మరువొద్దని తెలిపారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా అసువులు బాసిన సిపిఐ మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంభాల కేశవరావు, కామ్రేడ్ సుధాకర్, కామ్రేడ్ ప్రయాగ్ మంజి, కామ్రేడ్ ఆదేళ్ళ త్రి భాస్కర్‌లకు నివాళి అర్పించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, అడవుల్లో మోహరించిన సాయుధ పోలీస్, పాదా మిరి బలగాలను వెనక్కి రప్పించాలని, సిపిఐ మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని అటవీ హక్కుల, పేసా చట్టాల ఉల్లాంగనలతో జరుగుతున్న అడవుల విధ్వంసం పై ఆదివాసుల హత్యలపై సుప్రీమ్ కోర్టు స్పందించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాటలు మరింత ఉదృతం చేస్తు పిడిత ప్రజలను ఏకం చేయాలనీ బుద్ధిజీవులకు, విద్యార్థులకు, ప్రజా, పౌరహక్కుల నేతలకు విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సుంకరబోయిన మొగిలి,కొమ్మానబోయిన వేణు,ఈ శ్రీశైలం,పూర్వ జనశక్తి నాయకులు,వివిధ విప్లవ పార్టీ నాయకులు అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో మొక్కలు నాటాలి

- కొత్తగా వచ్చిన మెనూ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలి
- ప్రతినెల మెడికల్ క్యాంప్స్ చేపట్టాలి
- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్



**జనగామ ప్రతినిధి, జూలై 19 (జనంసాక్షి) :**ప్రతి ఒక్కరూ వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలను నాటాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అన్నారు. శనివారం బచ్చన్నపేట మండలంలోని కేజీబీవీ ని జిల్లా విద్యాశాఖ అధికారులతో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించి నిర్వహణ తీరును పర్యవేక్షించారు. వంటగదిని సందర్శించి విద్యార్థుల కొరకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. వండిన వెంటనే వేడి పదార్థాలను పిల్లలకు పెట్టించాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులు భోజనం చేసే డైనింగ్ హాల్ను పరిశీలించారు. ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నాణ్యమైన తాజాగా వండిన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలన్నారు. భోజనానికి వినియోగించే వస్తువులు కూడా నాణ్యమైన తప్పించుకోవాలని తాజా కాయగూరలను వినియోగించాలన్నారు. విద్యార్థినుల కొరకు ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి మందులు పరిశీలించారు. పాము కుక్క కాటు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం వన మహోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కను నాటి విద్యార్థినిలకు స్ఫూర్తిని కలిగించారు. అనంతరం అదే మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని అన్ని రకాల మందులు వైద్యశాలలో ముందస్తుగా ఉంచుకోవాలన్నారు. అవుట్ పేషంట్ల రిజిస్టర్ను పరిశీలించారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని అందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియా బేగం, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, డాక్టర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత సంవత్సరం కన్నా మిన్నగా యూరియా నిల్వలు

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట జూలై 19 (జనం సాక్షి) :** నర్సంపేట లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, సహకార,రెవెన్యూ శాఖల అధికారులతో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా కొరత రైతులు పడుతున్న ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు గత సంవత్సరం కన్నా మిన్నగా యూరియా సరఫరా ఉందని,రైతులు ఆందోళన చెందొద్దని తెలియజేశారు సహకార సంఘం,వ్యవసాయ శాఖ రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి డీలర్ల నుండి రైతులకు యూరియా ఎరువులు పంపిణీ జరిగేలా చూడాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీ పర్యవేక్షణ లోపం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రతిపక్షాలు అల్ప సంతోషంతో రైతులను రెచ్చగొడుతూ పత్రికల్లో ప్రకటన కోసం హడావుడి చేస్తున్నారని అన్నారు. రైతులు కూడా జాగ్రత్తగా ఎరువులను వాడుకోవాలని,అధిక మోతాదులో యూరియాను వినియోగించకుండా తగిన మోతాదులో వాడాలని సూచించారు. ఆయన అన్నారు

## మౌలిక వసతులను ఏర్పాటు చేయాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 19 (జనంసాక్షి) :** జవహర్ నవోదయ విద్యాలయంలో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం సూర్యాపేట పట్టణంలోని రెడ్డి హాస్టల్ నందు ఏర్పాటు చేసిన జవహర్ నవోదయ విద్యాలయంను అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు.విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన బెంచీలు, త్రాగు నీరు కొరకు ఆర్వో ప్లాంట్, వంట గది, వంట సామాగ్రి,డైనింగ్ హాల్, టాయిలెట్స్, లైబ్రరీ కొరకు టేబుల్స్ ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, డిఈఓ అశోక్,తహసీల్దార్ కృష్ణయ్య,జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్, తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డిఈ రమేష్, ఏఈ ఓబుల్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణకు బస్సు సర్వీస్ ప్రారంభం



**చింతలపాలెం, జూలై 19 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్టం జగ్గయ్యపేట నుండి చింతలపాలెం మండలం కు వయా దొండపాడు మీదుగా చింతిర్యాల వరకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వారు బస్ సర్వీస్ ను నరాల కొండారెడ్డి విజ్ఞప్తితో స్థానిక ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి,ప్రయాణికుల సౌకర్యర్థం ముఖ్య అతిదిగా జగ్గయ్యపేట నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించడం జరిగింది ,ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోగలర ని తెలిపారు.ఈ కార్యక్రమంలో చింతలపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరాల కొండారెడ్డి,హుజూర్ నగర్ గవర్నమెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బోబ్బా కోటిరెడ్డి, జగయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,ఆర్టీసీ ఈడి శ్రీనివాస్ వర్మ, రీజినల్ మేనేజర్ ఎంవై దానం,డిపో మేనేజర్ రఘురాం,ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ కెవి కృష్ణారావు ,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ చిలక నాగేశ్వరరావు,చింతలపాలెం మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకల శ్రీనివాసరెడ్డి,నాయకులు శాగంరెడ్డి గోపాలరెడ్డి,బాణావత్ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.బస్సు రావడానికి కృషి చేసిన నరాల కొండారెడ్డి కి మండల ప్రజలు ధన్యవాదములు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష



**కనగల్, జూలై 19 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్లో వేగం పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం ఆమె కనగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మార్చి నెలలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు ఇంకా ఇప్పటివరకు కొన్ని గ్రౌండ్ కాకపోవడంపై ఆమె పంచాయతీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఎవరైనా ఇల్లు నిర్మించుకునేందుకు ఆసక్తి చూపకపోతే వారి నుండి ఇష్టం లేనట్టుగా రాతపూర్వకంగా తీసుకోవాలని, అలాంటి వారి జాబితాను రూపొందించి పంపించాలని చెప్పారు. రెండు ,మూడు రోజుల్లో మంజూరైన అన్ని ఇండ్లు గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా గ్రామ పంచాయతీల వారీగా పంచాయతీ కార్యదర్శులతో వివిధ స్థాయిలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్ ,ఇన్చార్జి ఎంపిడిఓ సుమలత, కనగల్ తహసిల్దార్ పద్మ, తదితరులు ఉన్నారు.

## డిజిటల్ లావాదేవీలతో జాగ్రత్తగా ఉండాలి

● కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్



**కొండమల్లేపల్లి, జూలై 19 (జనంసాక్షి) :** సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆర్థిక నేరాలు ఎక్కువవుతున్న పరిస్థితులలో డిజిటల్ లావాదేవీల పైన ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు చేస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం అని సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల ద్వారా మీ ఆర్థిక సమాచారాన్ని దొంగలించడానికి ప్రయత్నిస్తారని మీ అన్ని ఖాతాల కోసం ఎవరు ఊహించలేని పాస్వర్డ్లను ఉపయోగించాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు బాగా పెరిగిపోవడం వలన యువకులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. రకరకాల పేర్లతో ఖాతాదారులను మరిపించి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారన్నారు. ఎవరైనా ఆన్లైన్ సైబర్ మోసాలకు గురైతే, 1930 నెంబర్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయొచ్చు అన్నారు.1930 నంబర్ అనేది జాతీయ సైబర్ నేరాల హెల్ప్లైన్ నంబర్. దీనిని భారత ప్రభుత్వం ప్రత్యేకంగా సైబర్ మోసానికి సంబంధించిన ఫిర్యాదుల కోసం ప్రారంభించిందని ఈ నంబర్కు కాల్ చేయడం ద్వారా మీకు జరిగిన ఎలాంటి ఆన్లైన్ మోసాల గురించి అయినా మీరు సమాచారం ఇవ్వవచ్చునని ఈ నంబర్ దేశవ్యాప్తంగా పనిచేస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల పోలీసులు దీనికి మద్దతు ఇస్తారని అన్నారు. కొండమల్లేపల్లి సర్కిల్ పరిధిలో ఎవరైనా ఆన్లైన్ మోసాలు చేశారని ఫిర్యాదులు వచ్చినా, ఉద్దేశ పూర్వకంగా సైబర్ నేరాలకు పాల్పడినా అటువంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని సిఐ హెచ్చరించారు.

# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి

● రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 19 (జనం సాక్షి) :** స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ఎం.రమేష్, సంకెపల్లి సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్ లు ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్ కు వివరించారు. మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం



పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా విడుదల అయిన నిధులు, వాటి వెచ్చింపు వివరాలను గణాంకాల ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని హితవు పలికారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, చందర్ రాథోడ్, నిజామాబాద్ ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ లు, జెడ్పీ సీఈఓలు, డీఎల్పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఉమ్మడి జిల్లా సమీక్షకు హాజరైన రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్లు టి.వినయ్ కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్, నిజామాబాద్ సీ.పీ సాయి చైతన్య తదితరులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

## జిల్లా రాజకీయాలలో చొక్కారావు పేరు చిరస్మరణయం

● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, జూలై 19 (జనంసాక్షి) :** మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి దివంగత జువ్వడి చొక్కా రావు 102వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి హాజరై చొక్కా రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చొక్కా రావు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు పోరాడి తెలంగాణ బోర్డు సాధించడానికి ముఖ్యపాత్ర పోషించినారని కరీంనగర్ పార్లమెంటు సభ్యుడుగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినారని నీతి నిజాయితీకి మారుపేరు చొక్కారావు అని, అత్యంత కీలకమైన పదవులలో ఉండి కూడా సాధారణ వ్యక్తి లాగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసేవారని, చొక్కారావు అడుగుజాడల్లో కాంగ్రెస్ కార్యకర్తలు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, ధన్నా సింగ్, బసవరాజు శంకర్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, కుర్ర పోచయ్య, తోట అంజన్న, మంద మహేష్, చింతల కిషన్, మాదాసు శ్రీనివాస్, జొన్నల రమేష్, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాచర్ల పద్మ,అందే శంకర్, సుధాకర్,అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



### వన్ టౌన్ కూడలి వద్ద...

మాజీ మంత్రి చొక్కారావు జయంతి సందర్భంగా నగరంలోని వన్ టౌన్ కూడలిలో గల చొక్కా రావు విగ్రహం వద్ద అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పిసిసి కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ తదితరులతో కలిసి చొక్కా రావు విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కర్ర సత్య ప్రసన్నా రెడ్డి, మహమ్మద్ తాజుద్దీన్, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కోకాపేటలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**రాజేంద్రనగర్, జూలై 19 (జనం సాక్షి) :** నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శనివారం కోకాపేటలో అక్రమంగా రోడ్డును ఆక్రమించి నిర్మించిన మూడు నిర్మాణాలను జెసిబి సహాయంతో టిపీఓ మణిహారిక భారీ పోలీసుల నడుమ దగ్గరుండి కూల్చి వేయించారు. అధికారులకు నిర్మానుదారుల కు మధ్య వాగ్వాదం జరిగింది. మున్సిపాలిటీలో వందల అక్రమ నిర్మాణాలు చేపడుతున్న ఒక్కటి కూడా కూల్చకపోవడం విడ్డూరమని నిర్మాణదారులు అధికారులను నిలదీశారు. అక్రమ



నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని టిపిఓ హెచ్చరించారు.

## మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట



**రాజేంద్రనగర్, జూలై 18 (జనం సాక్షి) :** మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వడ్డీ లేని రుణం అందించడం కాంగ్రెస్ ఘనత అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ మండలంలోని ఓ ఫంక్షన్ హాల్ లో 983 మహిళా సమైక్యలకు మొత్తం రూ.90 లక్షల వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక బృందాలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు వడ్డీ లేని రుణాలను అందించే ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనిని ఆయన మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇందులో భాగంగానే వడ్డీ లేని రుణాలను అందించి వారి వ్యాపారాలు, స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని మహిళలు మరింతగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ జోజప్ప, డీపీఎం జయశ్రీ, మండల ప్రత్యేక అధికారి ఉల్లాస్, ఎంపీడీవో మున్ని ,స్థానిక ప్రజాప్రతినిధులు ఎక్స్ జెడ్పిటిసి తన్వి రాజ్, చంద్రా రెడ్డి , అధికారులు మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పేదవారికి రేషన్ కార్డులు అందించి ఆదుకుంటోంది

● రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 19 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేదవారికి రేషన్ కార్డుల పంపిణి చేసి ఆదుకుంటున్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణ కేంద్రంలోని లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మండపం (రెడ్డి సంఘం)లో ఏర్పాటు చేసిన బాన్సువాడ, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాల రేషన్ కార్డు లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇన్ని రోజులు రేషన్ కార్డులు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని అన్నారు. రేషన్ కార్డులు రావడంతో ఎంతో మంది కళ్ళల్లో ఆనందం చూస్తున్నామన్నారు. రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు అర్హులని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ సబ్ కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి, బీర్కూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి దుర్గం శ్యామల శ్రీనివాస్, నాయకులు జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణా రెడ్డి, ఎజాస్, నార్ల రవీందర్, నార్ల సురేష్, బాబా, యండి. దావూద్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల కోసమే సన్నబియ్యం



**పాపన్నపేట, జూలై 19 (జనంసాక్షి) :** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు.శనివారం అర్కెల గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రజలకు ఆహార భద్రత కార్డులు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు,గ్రామాలకు ఇండ్లు మంజూరు కాలేదని విమర్శించారు.పేద ప్రజలు సన్న బియ్యం తినాలని కాంగ్రెస్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుందన్నారు.రాబోయే ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు.ఈసందర్భంగా తహసీల్దార్ సతీష్ కుమార్,కిసాన్ సెల్ జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి,పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శెట్టి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు గోవింద్ నాయక్,మాజీ కో ఆప్షన్ గౌస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమ్మరి విట్టల్, నాయకులు ప్రశాంత్ రెడ్డి,జనార్దన్, శ్రీనివాస్, నరేందర్,విక్కీ, అబేద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ గురుకులాల్లో సీట్లు పెంచాలి

● సీట్లు దొరకక వందలాది మంది విద్యార్థులు అవస్థలు
● బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి
● ప్రస్తుత అద్దె భవనంలో పహారి గోడ డైనింగ్ హాల్ నిర్మించాలి
● జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్

**తాండూరు, జూలై 19 (జనంసాక్షి) :** బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో సీట్లు పెంచాలని వేల సంఖ్యలో విద్యార్థులు గురుకుల పాఠశాలలో సీట్ల కోసం ఎదురు చూస్తుంటే కేవలం వందల సంఖ్యలో మాత్రం విద్యార్థులు సీట్లు దొరుకుతున్నాయని అందుకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు పెంచాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు తాండూర్ నియోజకవర్గం కన్వీనర్ కందుకూరి రాజ్ కుమార్




డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ రోడ్డులో గల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ ఇతర బీసీ నేతలతో కలిసి సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి పాఠశాల వసతి,భవనాలు సీట్ల పరిమితి వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు .బీసీ విద్యార్థులకు అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో 50 శాతం సీట్లు పెంచాలని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల కోసం సొంత భవనాలను నిర్మించాలని ప్రభుత్వానికి కోరారు. రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సరియైన సదుపాయాలు లేవని వెంటనే సంబంధిత బిల్డింగ్ ఓనర్స్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థులకు తినడానికి సరియైన వసతులు లేక గ్రౌండ్లో కూర్చుని తింటున్నారని, అందుకు వారికి డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని భవనం రెండో అంతస్తులు రేకుల షెడ్ ఉండడం ద్వారా వర్షాకాలం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటిని సరి చేసే బాధ్యతను ప్రభుత్వ ఉన్నత అధికారులు తీసుకోవాలని కోరారు.బీసీ రెసిడెన్షియల్ పాఠశాల సందర్శించిన వారిలో బీసీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ సుకుర్, జిల్లా బీసీ నాయకులు గడ్డం వెంకటేష్, యాలాల మండల బిసి అధ్యక్షులు లక్ష్మణ చారి, పెద్దేముల్ మండల బిసి యువజన సంఘం అధ్యక్షులు నవీన్ ,సోషల్ మీడియా ఇన్చార్జ్ బసవరాజ్ ,బిసి యువ నాయకులు రాజు గౌడ్, వివేక్ మరియు ప్రిన్సిపాల్ నరేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

# విపణి

## పోస్టాఫీసులు వరుసగా మూడు రోజులు బంద్



**జనంసాక్షి:** దేశవ్యాప్తంగావివిధరాష్ట్రాల్లోనిపలుపోస్టాఫీసులుమూడురోజులపాట ంతాత్కాలికంగామూతపడ్డాయి. డిజిటల్ ఎక్సలెన్స్, జాతి నిర్మాణం దిశగా నెక్స్ట్ జనరేషన్ ఏపీటీ అప్లికేషన్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తపాలా శాఖ ప్రకటించింది. ఇందులో భాగంగా తిరుపతి డివిజన్ లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈ నెల 22న అప్ గ్రేడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ అధునాతన డిజిటల్ ప్లాట్ఫామ్కుఅవాంతరాలులేకుండాసురక్షితంగా మారడానికి వీలుగా జూలై 19 నుండి 21 వరకు ప్రణాళికాబద్ధమైన డౌన్టైమ్అమలుచేస్తున్నారు. దీంతోఆయారోజుల్లోపోస్టాఫీసులలో ఎటువంటి ప్రజా లావాదేవీలు జరగవనిపోస్టాఫీసుల సీనియర్ సూపరింటెండెంట్ మేజర్ సయిదా తన్వీర్ ఒక ప్రకటనలో తెలిపారు. డేటా మైగ్రేషన్, సిస్టమ్ ధృవీకరణలు, కాన్ఫిగరేషన్ ప్రక్రియలను సులభతరం చేయడానికి, కొత్త సిస్టమ్ సజావుగా, సమర్థవంతంగా లైవ్ లోకి వెళ్లేలా చూసుకోవడానికి సేవల తాత్కాలిక నిలిపివేత అవసరమనివివరించారు. మెరుగైన వినియోగదారు అనుభవం, వేగవంతమైన సర్వీస్ డెలివరీ, మరింత కస్టమర్ ఫ్రెండ్లీ ఇంటర్ఫేస్ను అందించడానికి ఏపీటీఅప్లికేషన్నురూపొందించారు. నెక్స్ట్ జనరేషన్ ఏపీటీఅప్లికేషన్ అమలులో భాగంగా జూలై 21న తెలంగాణలోని రంగారెడ్డి, నల్లగొండ, యాదాద్రి–భువనగిరి జిల్లాలు మినహాఅన్ని పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవనిఅసిస్టెంట్పోస్ట్మాస్టర్జనరల్ నరేష్ఒకప్రకటనలోతెలిపారు.

# వీకెండ్ ఫామ్‌హౌస్‌లకు.. భలే గిరాకీ..



**ఆఫీసులో పని ఒత్తిడి ఒక ఎత్తయితే.. ట్రాఫిక్ సంద్రాన్ని ఈదుకుంటూ వెళ్లడం మరొక ఎత్తు. ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ప్రతిరోజూ ఛేదించుకుంటూ వెళ్లే నగరవాసి కనీసం వారాంతంలోనైనా కుటుంబం, స్నేహితులతో స్వచ్ఛమైన ఆహ్లాదకర వాతావరణంలో గడపాలని కోరుకుంటున్నాడు. వీరి అభిరుచులకు తగ్గట్టుగానే ఫామ్ హౌస్‌లు నిర్మితమవుతున్నాయి. గతంలో ఫామ్‌హౌస్‌ల కోసం కేవలం సంపన్న వర్గాలు మాత్రమే మొగ్గు చూపేవారు. కానీ, కరోనా తర్వాతి నుంచి సామాన్య, మధ్యతరగతి సైతం వ్యవసాయ క్షేత్రాలకు ఆసక్తి చూపిస్తున్నారు**

కొందరు 200 నుంచి వెయ్యి గజాల్లోపు భూమిని కొనుగోలు సాదాసీదాగా ఫామ్‌హౌస్‌లను నిర్మించుకుంటుంటే.. మరి కొందరు వెయ్యి నుంచి 4 వేల గజాలు, రెండు, మూడెకరాలంటూ భూమి కొనేసి వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఫామ్ ల్యాండ్స్ పేరుతో కొన్న జాగాల్లో, డీటీసీపీ లేఅవుట్లలో, గ్రామ పంచాయతీ లే అవుట్లలో స్థలాలను కొని బంగ్లాలు కడుతున్నారు. శని, ఆదివారాల్లో కుటుంబ సభ్యులతో కలిసి కారులో వారాంతపు ఇంటికి వెళ్లి షికారు చేస్తున్నారు. నగరం ఓఆర్ఆర్ వరకు విస్తరించింది. ?చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, శామీర్‌పేట, భువనగిరి, శంషాబాద్, మేడ్చల్, సంగారెడ్డి ప్రాంతాల్లోని వీకెండ్ హెూమ్స్‌కు ఆదరణ ఎక్కువగా ఉంది. భూముల ధరలు ఎక్కువ ఉన్నప్పటికీ.. వాతావరణం బాగుంటుందని, భవిష్యత్తులో ఆస్తిని విక్రయిస్తే మంచి ధర పలుకుతుందనే విశ్వాసంతో కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటితో పాటు చుట్టూ పచ్చదనం, ఆకుకూరలు, పండ్ల చెట్లను పెంచుతూ వ్యవసాయం చేశామనే తృప్తిని పొందేందుకు చాలామంది ఇష్టపడుతున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు వేసిన వెంచర్లలో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. వారాంతాల్లో విడిది చేసేలా సకల సదుపాయాలు ఇక్కడ కల్పిస్తున్నారు. కొందరు తమ ఇళ్లను మిగతా సమయంలో కమ్యూనిటీ నిర్వహణ సంస్థలకే అద్దెకు ఇస్తున్నారు. కమ్యూనిటీల్లోని సభ్యులు చిన్న వేడుకలను ఇక్కడ చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇతర ఇళ్లను ఒకటి రెండు రోజులకు అద్దెకు తీసుకుంటున్నారు. ఈ రకంగా ఖాళీగా ఉండకుండా ఆదాయం వస్తుండటంతో వీటికి డిమాండ్ పెరుగుతోంది.

## కొత్తిల్లు కొందామా.. పాతిల్లు చూద్దామా?

**జనంసాక్షి:** సొంతిల్లు.. ప్రతి ఒక్కరి కల. అయితే గృహ కొనుగోలు నిర్ణయం అంత తేలికైందేమీ కాదు. ప్రాంతం ఎంపిక నుంచి మొదలు పెడితే బడ్జెట్, నిర్మాణ నాణ్యత, నిర్మాణ సంస్థ నేపథ్యం, కొనుగోలుదారుడి అవసరాల వరకూ ప్రతి ఒక్కటీ ప్రధానమైందే. సమాజంలో గుర్తింపు కోసం కొందరు ఇల్లు కొంటే.. మరికొందరేమో పెట్టుబడి కోసం, ట్యాక్స్ నుంచి మినహాయింపుల కోసం కొంటుంటారు. కారణాలేవైనా ఇల్లు కొనడమనేది ఓ నిరంతర ప్రక్రియ. మరి, ఎలాంటి ఇల్లు కొంటే సొంతింటి యోగం మరింత తేలికవుతుంది? అంటే కొత్త ఇల్లు కొనడమా? లేక సెకండ్ హ్యాండ్ ఇల్లు బెటరా? అని! దేశంలో కొత్త గృహాలకు డిమాండ్ ఎంత ఉందో రీసేల్ లేక సెకండ్ హ్యాండ్ ఇళ్లకూ అంతే ఉంది. కొత్త ఇల్లు నేరుగా డెవలపర్ నుంచి కొనుగోలు చేస్తే.. రీసేల్ ప్రాపర్టీలను పాత యజమాని నుంచి కొనుగోలు చేస్తాం. కొత్త లేక పాత ప్రాపర్టీ ఏదైనా కానీ ఎంపికలో ప్రధానమైంది బడ్జెట్. దీంతో పాటూ మన జీవన శైలి, అవసరాలు, అభిరుచులు, ఇంటీరియర్, ఇంధన సామర్థ్యాలు వంటివి కూడా ప్రాపర్టీ ఎంపికలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇల్లు కొనుగోలు చేసిన వారెవరైనా సరే ఎప్పటికీ ఒకే ఇంట్లో ఉండాలనుకుంటారు. ఫ్యామిలీ పెరిగినప్పుడు లేదా తగ్గినప్పుడు గానీ ఉద్యోగ రీత్యా, కుటుంబ అవసరాల రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు గానీ ఆర్థిక అవసరాల కోసం ఇంటిని విక్రయించాలనుకుంటారు. విద్యా, వైద్యం, వినోదం ఇతర అవసరాలకు రోజూ ప్రధాన నగరంతో అనుబంధం ఉంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో కొత్త గృహాలు దొరకడం కొంత కష్టం. ఒకవేళ దొరికినా ధర ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి ఏరియాల్లో సెకండ్ హ్యాండ్ ఇల్లును కొనుగోలు చేయడం బెటర్. అవసరమైతే దాన్ని కూల్చేసి మన అవసరాలు, బడ్జెట్‌కు తగ్గట్టు మళ్లీ కొత్త గృహాన్ని నిర్మించుకోవచ్చు. అయితే ఇది కొంత డబ్బు, సమయంతో ముడిపడి ఉన్న అంశం. అందుకే ప్రధాన నగరంలో, అభివృద్ధి చెందిన ప్రాంతంలో రీసెల్ ప్రాపర్టీలను ఎంచుకోవటమే ఉత్తమమనేది నిపుణుల సూచన. రీసేల్ ప్రాపర్టీ కొనుగోలు చేసేటప్పుడు పాత యజమాని నేపథ్యం, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు, టైటిల్, అనుమతి పత్రాలు, గృహ రుణానికి సంబంధించిన పత్రాలు వంటి వాటిని స్వయంగా పరిశీలించుకోవాలి.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభంలో క్షీణత..

- లాభం 15% పైకి

**ముంబయి:** ప్రైవేటు రంగానికి చెందిన యాక్సిస్ బ్యాంక్ త్రైమాసిక ఫలితాలు నిరాశ పరచిన వేళ.. మిగిలిన ప్రైవేటు బ్యాంకుల ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఏప్రిల్–జూన్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభంలో క్షీణత నమోదు కాగా.. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత ప్రాతిపదికన రూ.16,258 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.16,475 కోట్లతో పోలిస్తే లాభం 1.31 శాతం క్షీణించడం గమనార్హం. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.16,174 కోట్ల నుంచి రూ.18,155 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం రూ.83,701 కోట్ల నుంచి రూ.99,200 కోట్లకు పెరగ్గా.. ఖర్చులు రూ.59,187 కోట్ల నుంచి రూ.63,467 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. నికర వడ్డీ మార్జిన్ 3.46 శాతం నుంచి 3.35 శాతానికి తగ్గింది. ప్రావిజన్లు రూ.2602 కోట్ల నుంచి రూ.14,442 కోట్లకు పెరిగాయి. స్థూల నిరర్థక ఆస్తులు గడిచిన త్రైమాసికంతో పోలిస్తే 1.33 శాతం నుంచి 1.4 శాతానికి పెరిగాయి. జూన్‌లో ముగిసిన త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ ఏకీకృత నికర లాభం రూ.13,558 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11,696 కోట్లతో పోలిస్తే 15.9 శాతం వృద్ధి నమోదైంది.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 91,700 (22 క్యారెట్లు) | ₹ 1,00,040 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,26,000

## మ్యూచువల్ ఫండ్స్‌లోకి మరో కొత్త కంపెనీ.. సెబీ నుంచి లైసెన్స్



**జనంసాక్షి:** ద వెల్త్ కంపెనీ అస్సెట్ మేనేజ్‌మెంట్ హెూల్డింగ్స్ ప్రైవేటు లిమిటెడ్ (పాంటోమ్యాథ్ గ్రూప్ సంస్థ) మ్యూచువల్ ఫండ్స్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా సెబీ నుంచి తుది ఆమోదం పొందినట్టు ప్రకటించింది. దీంతో రూ.74 లక్షల కోట్ల మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమలోకి 'ద వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్' పేరుతో అధికారికంగా ప్రవేశించడానికి మార్గం సుగమం అయినట్టు తెలిపింది. సెబీ నుంచి సర్టిఫికేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఈ నెల 18న మంజూరైనట్టు పేర్కొంది. సాధారణంగా ప్రైవేటు ఈక్విటీ మార్కెట్లో కనిపించే డేటా ఆధారిత పరిశోధన, వినూత్నమైన బోటమ్ అప్ విధానాలను తమ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు అందించనున్నట్టు తెలిపింది. ప్రయివేట్ రంగ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 24 శాతం ఎగసి రూ. 748 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 604 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 25 శాతం జంప్‌చేసి రూ. 968 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 775 కోట్ల ఆదాయం నమోదైంది. కంపెనీ నిర్వహణలోని సగటు ఆస్తుల విలువ(ఏయూఎం) రూ. 6.71 లక్షల కోట్ల నుంచి రూ. 8.3 లక్షల కోట్లకు బలపడింది.

# చైనా యూటర్న్?.. పాక్‌కు షాక్.. అమెరికాకు మద్దతు?






**జనంసాక్షి:** ఇంతకాలం పాకిస్తాన్‌కు మద్దతు పలుకుతూ, అమెరికాను వ్యతిరేకిస్తున్నట్లు కనిపించిన చైనా ఇప్పుడు తన పంథాను మార్చుకుంది. భారత్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ప్రతిస్పందనను చూసి, చైనా తన తీరు మార్చుకున్నట్లు కనిపిస్తోంది. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన చైనా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తన కఠిన వైఖరిని పునరుద్ఘాటించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)ను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడాన్ని సమర్థించారు. ఉగ్రవాదానికి వ్యతిరేక సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఆయన ప్రాంతీయ దేశాలకు పిలుపునిచ్చారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి టీఆర్ఎఫ్ బాధ్యత వహించింది. ఇది లష్కరే తోయిబాకు ప్రాక్సీ సంస్థ. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఏప్రిల్ 25న ఈ దాడిని ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 2025, ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ మే 7న పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. నాలుగు రోజుల పాటు సరిహద్దుల్లో డ్రోన్, క్షిపణి దాడులు సాగాయి. అనంతరం ఈ సంఘర్షణ ముగింపునకు భారత్– పాకిస్తాన్ ఒక అవగాహనకు వచ్చాయి.

## లాస్ ఏంజిల్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**జనంసాక్షి:** అమెరికా కాలిఫోర్నియా స్టేట్ లాస్ ఏంజిల్స్‌లో ఘోర ప్రమాదం చోటుచేసు కుంది. ఓ వాహనం జనం మీదకు దూసుకెళ్లిన ఘటనలో 20 మందికి గాయాలయ్యాయి. వీళ్లలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానిక కాలమానం ప్రకారం.. శనివారం ఉదయం లాస్ ఏంజిల్స్ ఈస్ట్ హాలీవుడ్‌లోని శాంటా మోనికా బులివర్డ్ వద్ద ఓ వాహనం గుంపులోకి దూసుకెళ్లింది, ఈ ఘటనలో 20 మందికి పైగా గాయాలు అయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్సులు, ఫైర్ సిబ్బంది క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు తరలించాయి. గాయపడ్డవాళ్లలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. మరో 8–10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి. టాకోలను విక్రయించే ఓ బండిని ఢీకొట్టి, ఆపై క్లబ్ బయట ఉన్న గుంపులోకి వాహనం దూసుకెళ్లినట్లు తెలుస్తోంది. వాహన డ్రైవర్ స్పృహ కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయని కొందరు చెప్పినప్పటికీ.. పోలీసులు ఎలాంటి ఎలాంటి ధృవీకరణ చేయలేదు.



# నువ్వు రా.. నా భర్త ఇంకా బతికే ఉన్నాడు!

**జనంసాక్షి:** వరుసకు మరిది అయ్యే వ్యక్తితో సంబంధం ఏర్పరుచుకున్న ఓ మహిళ.. తన భర్తను అతికిరాతకంగా కడతేర్చింది. ఈ ఘోరం బయటపడకుండా ఉండేందుకు కరెంట్ షాక్‌తో ప్రమాదత్తూ చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. చంపడానికి ముందు ఆ ఇద్దరి మధ్య జరిగిన చాటింగ్.. ఆ మొత్తం ఘోరాన్ని బయటపెట్టింది. దేశ రాజధానిలో జరిగిన ఘోరం వివరాల్లోకి వెళ్తే..తన భర్త కరణ్ దేవ్(36) కరెంట్‌షాక్‌కు గురయ్యాడంటూ సుస్మిత ఈ నెల 13వ తేదీన ఢిల్లీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి స్థానికుల సాయంతో తీసుకెళ్లింది. అయితే అప్పటికే అతను మరణించాడని వైద్యులు తెలిపారు. దీంతో.. పోస్టుమార్టం కూడా వద్దంటూ అంత్యక్రియల కోసం ఉత్తమ్ నగర్‌లోని ఇంటికి మృతదేహాన్ని తరలించింది. ఈలోపు..స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు.. అంత్యక్రియలను అడ్డుకున్నారు. మృతుడి వయసు, చనిపోయిన తీరుపైనా అనుమానాలతో అటాప్సీ కోసం కరణ్ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈలోపు కరణ్ సోదరుడు కునాల్ పోలీసులకు ఓ షాకింగ్ విషయం తెలిపాడు. తన అన్న మరణం విషయంలో వదినతో పాటు తన కజిన్ రాహుల్ ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేశాడు. అంతేకాదు.. వాళ్లిద్దరి మధ్య జరిగిన ఇన్‌స్టాగ్రామ్ చాటింగ్ వివరాలను పోలీసులకు స్క్రీన్ షాట్ వీడియో రూపంలో అందించాడు. అందులో కరణ్‌ను ఎలా హత్య చేయాలని వాళ్లిద్దరూ చర్చించుకున్నారు. పోలీసులు తమ శైలిలో ప్రశ్నించగా.. ఆ ఇద్దరూ నిజం ఒప్పుకున్నారు. కరణ్ తరచూ హింసించే వాడని.. అదే సమయంలో రాహుల్ తనను ఓదార్చేవాడని.. అదే ఇద్దరి మధ్య అనైతిక బంధానికి దారి తీసినట్లు తేలింది. ఈ క్రమంలో కరణ్ అడ్డు తొలగించుకునేందుకు సుస్మిత–రాహుల్ నిర్ణయించుకున్నారు. జులై 13వ తేదీన రాత్రి భోజనంలో కరణ్‌కు అధిక మోతాదులో(15) నిద్రమాత్రలు ఇచ్చారు. ఆపై మత్తులోకి జారుకున్నాక ఇద్దరి మధ్య జరిగిన చాటింగ్ జరిగింది. తర్వాత రాహుల్ ఇంటికి రాగా.. ఇద్దరూ కలిసి కరెంట్ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. విచారణలో మరిది రాహుల్‌తో కలిసి భర్తను చంపినట్లు సుస్మిత ఒప్పుకుంది. తన భర్త డబ్బుక కోసం తరచూ తనను హింసించేవాడని, కార్వాచౌత్ ముందు రోజు కూడా చితకబాదాడని ఆమె చెబుతోంది. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పూర్తిస్థాయి పోస్టుమార్టం రిపోర్టు కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.



# కుదిరిన ఒప్పందం

### ఇజ్రాయెల్, సిరియా కాల్పుల విరమణ

**డమాస్కస్(జనంసాక్షి):** సిరియాలోని డ్రూజ్ కమ్యూనిటీ జనాభా అధికంగా కలిగిన స్వీడన్ ప్రావిన్స్‌లో రోజుల తరబడి కొనసాగిన మారణహెూమం దరిమిలా ఇజ్రాయెల్–సిరియాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ ఘర్షణల్లో 300 మందికి పైగా జనం మృతిచెందారు. ఈ కాల్పుల విరమణకు ప్రాంతీయ మిత్రదేశాలు టర్కీ, జోర్డాన్ మద్దతు పలికాయి. సిరియాలోని దక్షిణ స్వీడన్ ప్రావిన్స్‌లో రోజుల తరబడి కొనసాగిన హింస అనంతరం ఇజ్రాయెల్–సిరియాలు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇప్పటివరకూ జరిగిన ఘర్షణల్లో మహిళలు, పిల్లలు, వైద్య సిబ్బందితో సహా మొత్తం 321 మంది మరణించారని మానవ హక్కుల పరిశీలకులు తెలిపారు. సిరియా అధ్యక్ష కార్యాలయం కాల్పుల విరమణను ప్రకటించింది. ఇందుకోసం దక్షిణాన ఒక ప్రత్యేక భద్రతా దళాన్ని మోహరించినట్లు తెలిపింది. పరిస్థితులు తీవ్రతరం కాకుండా నిరోధించడమే లక్ష్యంగా సమన్వయంతో కూడిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. దక్షిణాన సిరియా సైనిక మోహరింపులను ఇజ్రాయెల్ వ్యతిరేకించినప్పటికీ, 48 గంటల పాటు స్వీడాకు పరిమిత సిరియన్ అంతర్గత భద్రతా దళాల ప్రవేశాన్ని అనుమతిస్తామని తెలిపింది. సిరియా కొత్త నాయకత్వం సిరియా, లెబనాన్, ఇజ్రాయెల్‌లలోని డ్రూజ్ కమ్యూనిటీకి ముప్పు కలిగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. శుక్రవారం తెల్లవారుజామున ఇజ్రాయెల్.. స్వీడాపై దాడులను కొనసాగించింది. ఇది గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడాన్ని సూచిస్తుంది. స్వీడా ప్రావిన్స్‌లోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నట్లు స్థానిక వార్తా సంస్థ స్వీడా24 ప్రతినిధి ర్యాన్ మారౌఫ్ తెలిపారు.

## పీకల లోతు వరద నీటిలో రిపోర్టింగ్.. చివరకు..



**జనంసాక్షి:** పనిలో డెడికేషన్ అనాలో.. టీఆర్పీ కోసం పాకులాట అనాలో.. వ్యూస్ కోసం స్టంట్లు అనాలో.. ఈ ఘటన గురించి చదివాక మీ స్పందన కామెంట్ సెక్షన్ లో తెలియజేయండి. పాకిస్తాన్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వరదలు పోటెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఒక జర్నలిస్ట్ లైవ్ రిపోర్టింగ్ చేస్తూ నీటిలో కొట్టుకుపోయాడంటూ ఓ వీడియో వైరల్ అవుతోంది. ఈ ఘటన రావల్పిండిలోని చాహన్ డ్యామ్ వద్ద చోటుచేసుకుంది. రిపోర్టర్ పీకల లోతు వరద నీటిలో నిలబడి అక్కడి పరిస్థితి వివరిస్తున్నాడు. ఆ సమయంలో వరద ఉధృతికి ఆకస్మికంగా ప్రవాహం అతన్ని లోపలికి లాక్కెళ్లిపోయింది. అయితే ఈ వీడియో అక్కడికి మాత్రమే కట్ అయ్యింది. అతను కొట్టుకుపోయాడని, ఇప్పటిదాకా అతని ఆచూకీ తెలీయకుండా పోయిందనేది సదరు వార్త కథనాల సారాంశం. దీంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. అతనిది మూర్ఖపు చర్య అని కొందరు, విధి నిర్వహణలో తప్పేం కాదని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కెమెరామ్యాన్‌నెవర్‌డైస్ అంటూ మరికొందరు సరదా కామెంట్లు పెడుతున్నారు. అయితే.. మరికొందరు మాత్రం అతను అసలు రిపోర్టర్ కాదని, టిక్‌టాక్ లాంటి షార్ట్‌వీడియోస్ యాప్‌లలో వ్యూస్ కోసం ఇలాంటి స్టంట్లు చేస్తుంటాడని పలువురు కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం అతను సురక్షితంగానే ఉండి ఉంటాడన్నది ఆ కామెంట్ల సారాంశం. అయితే.. ఫ్యాక్ట్ చెక్‌లో అతని పేరు అలీ ముసా రాజా గా తేలింది. రూహీ అనే చానెల్‌లో అతను చాలా కాలంగా రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. అతను క్షేమంగానే ఉన్నాడా? అనే దానిపై ఆ చానెల్ ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజా ఘటన నేపథ్యంలో పలువురు జర్నలిస్టులు సైతం అతనికి సంఘీభావం తెలుపుతున్నారు. అతను క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నట్లు కామెంట్లు పెడుతున్నారు. చీప్ గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ కంటే ఇలాంటి ధైర్యమైన రిపోర్టర్లు సమాజానికి అవసరమని, అదే సమయంలో ఇలాంటివాళ్లు సురక్షితంగా కూడా ఉంటాలంటూ కామెంట్లు పెడుతున్నారు. రిపోర్టర్ అలీ ముసా రాజాకు ఇలాంటి స్టంట్లు కొత్తేం కాదు. కిందటి ఏడాది.. పంజాబ్ ప్రావిన్స్ సఖి సర్వర్ ఏరియాలో వరదలను నడుం లోతు నీళ్లలో కవర్ చేస్తూ వైరల్ అయ్యాడు కూడా. పాకిస్తాన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇది గత సంవత్సరం కంటే 124% ఎక్కువ వర్షపాతం అని అక్కడి వాతావరణ శాఖ చెబుతోంది. తాజా వరదల ధాటికి ఆ దేశంలో ఇప్పటికే 180 మంది మరణించారు. అయితే.. ఒక్క పంజాబ్ ప్రావిన్స్‌లో 54 మంది ఒకే రోజులో మరణించడం గమనార్హం.

## పని ఒత్తిడి తట్టుకోలేక.. ఉద్యోగి బలవన్మరణం

**నోటీసు పీరియడ్‌లో ఉండగానే అఘాయిత్యం..**



**జనంసాక్షి:** పని ప్రాంతాల్లో ఉద్యోగులపై ఒత్తిళ్లు సహజమే. అయితే ఆ ఒత్తిళ్లు ఈ మధ్యకాలంలో ఉద్యోగులను తీవ్ర నిర్ణయాల వైపు అడుగులేయిస్తున్నాయి. తాజాగా ఓ జాతీయ బ్యాంకులో పని చేసే సీనియర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడడం..అదీ బ్యాంకులోనే కావడం.. అందునా రాజీనామా చేసిన వారానికే కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శివశంకర్ మిత్రా.. మహారాష్ట్ర పుణే బారామతిలోని ఓ నేషనలైజ్డ్ బ్యాంకులో పని చేస్తున్నారు. 40 ఏళ్ల వయసులో పని ఒత్తిడి, అనారోగ్య కారణాలతో జులై 11వ తేదీన ఆయన తన చీఫ్ మేనేజర్ పోస్టుకు రాజీనామా చేశారు. అయితే ఏమైందో ఏమోగానీ నోటీసు పీరియడ్‌లో ఉన్న ఆయన అనూహ్యంగా ఘాతుకానికి పాల్పడ్డారు. గురువారం రాత్రి బ్యాంకు నుంచి సిబ్బంది అందరూ ఇళ్లకు వెళ్లిపోయాక.. తాళాలు తాను వేస్తానంటూ వాచ్‌మెన్‌కు చెప్పి ఆయన ఒక్కరే లోపలే ఉండిపోయారు. అంతకు ముందే తనతో పాటు తెచ్చుకున్న తాడులో బ్యాంకులోపలే ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అదంతా అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. భర్త ఇంటికి రాకపోవడం, ఫోన్‌కాల్స్‌కి ఎంతకీ స్పందిచకపోవడంతో ఆమె అనుమానంతో అర్ధరాత్రి బ్యాంకు వద్దకు చేరుకుంది. అందరూ వెళ్లిపోయి ఉంటారని వాచ్‌మెన్ చెప్పగా.. లోపల లైట్లు వేసి ఉండడంతో అనుమానంతో గేట్లు తీసి చూశారు. లోపల ఆయన ఫ్యానుకు విగతజీవిగా వేలాడుతూ కనిపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. అందులో పని ఒత్తిడే కారణమని పేర్కొన్న ఆయన.. ఎవరి పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. అంతేకాదు తన భార్య, బిడ్డలను క్షమాపణ కోరుతూ.. వీలైతే తన కళ్లను దానం చేయాలని నోట్‌లో కోరారాయన. దీంతో ఆ కుటుంబం విలపిస్తోంది. రాజీనామా చేసిన కొన్నిరోజులకే ఆయన ఇలాంటి తీవ్ర నిర్ణయం తీసుకోవడంతో తోటి సిబ్బంది సైతం కంటతడి పెట్టారు. కిందటి ఏడాది సెప్టెంబర్‌లో ఇదే పుణేలో ఈవై కంపెనీలో పని చేసే కేరళ యువతి అన్నా సెబాస్టియన్(26) పని ఒత్తిడి కారణంగా హఠాన్మరణం చెందింది. ఆమె తల్లి బహిరంగ లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి రాగా.. దేశంలో పని గంటలు, ఒత్తిళ్లు తదితర అంశాలపై విస్తృత చర్చ నడిచింది. అప్పటి నుంచి ఈ తరహా మరణాలు నెలలో కనీసం ఒకటి రెండైనా వెలుగు చూస్తున్నాయి. మొన్నటి మే నెలలో ఓలా ఏఐయూనిట్ కృత్రిమ్‌లో పని చేసే నిఖిల్ సోమవాన్సి 'టాక్సిక్ వర్క్‌కల్చర్, పని ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడడం సైతం చర్చనీయాంశంగా మారింది.

## డీఎస్పీ మహేష్ అంత్యక్రియల్లో పాల్గొని
# నివాళులర్పించిన సీపీ గౌస్ ఆలం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 19 (జనంసాక్షి) :** గుండెపోటుతో శుక్రవారం రోజు మరణించిన డీఎస్పీ మహేష్ అంత్యక్రియలు శనివారం రోజు కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ స్మశానవాటికలో జరిగాయి. ఈ అంత్యక్రియల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పాల్గొని, డీఎస్పీ మహేష్ పార్థివ దేహం పై పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, డీఎస్పీ మహేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. డీఎస్పీ మహేష్ సేవలను కొనియాడారు. కమిషనర్‌తో పాటు అడిషనల్ డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ, అడిషనల్ డీసీపీ ఏఆర్ భీం రావుతో పాటు కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది డీఎస్పీ మహేష్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహేష్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు

## పారమిత పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 19 (జనంసాక్షి) :** స్థానిక మంకమ్మతోట, పద్మనగర్ లలోని పారమిత ఉన్నత పాఠశాలలలో ఆషాడ మాస భోనోత్సవాన్ని పారమిత పాఠశాలల డైరెక్టర్ ప్రసూన ప్రసాదరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థిని విధ్యార్థులు స్వయంగా బోనాలు ఎత్తుకుని, పులివేశాలు, పోతురాజుల వేషాలు ధరించి డప్పు సప్పుల్ల కొలహాలంతో సందడి చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించిన వైనం అంబరాన్నంటింది. విధ్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం మంత్ర ముగ్ధులను చేశాయి. పారమిత విధ్యాసంస్థల డైరెక్టర్ ప్రసూన ప్రసాదరావు రావు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, విధ్యార్థిని విధ్యార్థులు , విధ్యార్థుల మాతృమూర్థులు స్వయంగా బోనాలు ఎత్తుకుని, అమ్మవారికి బోనాలు సమర్పించడం అమ్మవారి భవిష్యవాణి విధ్యార్థులు స్వయంగా వివరించే విధానం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు విధ్యార్థులకు, ఉపాద్యాయుయలకు తల్లిదండ్రులకు, మిత్రులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పాఠశాల డైరెక్టర్లు టి.ఎస్.వి. రమణ, రాకేశ్, ప్రాచి, యువిఎం. ప్రసాద్, హన్మంతరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని మంత్ర ముగ్ధులను చేసాయి. ఈ కార్యక్రమంలో పారమిత విధ్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు,వినోదరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత సమన్వయకర్తలు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక మహిళా
# సమాఖ్యలకు ఆదర్శం

- స్వయం ఉపాధి కల్పించడంలో విశేష కృషి.
- కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖా పతకానికి ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య ఎంపిక
- ఆగస్టు 15 న దేశ రాజధానిలో అవార్డులకు ఆహ్వానం
- అభినందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా





**స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తూ, రికవరీ చేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నది.మహిళల ఆర్థిక అభివృద్ధికి మద్దత్తుగా నిలుస్తూ... వారి ప్రగతిలో భాగమవుతున్నది. సామాజిక రుగ్మతలు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అవార్డ్ కు ఎంపిక అయిన ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్యపై ప్రత్యేక కథనం..**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోని ఆదర్శ మండల సమాఖ్య 2004లో ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సభ్యులకు (ఎస్ హెచ్ జీ)లకు సేవలందిస్తోంది. ఈ మండల సమాఖ్య పరిధిలో 46 విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ)లు ఉండగా,స్వయం సహాయక సంఘాలు 12,472 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటి దాకా మొత్తం రూ 59 కోట్ల రుణాలు పంపిణీ చేసారు.99 శాతం రికవరీ చేశారు. దాదాపు రూ 41,28,000 నిలువలతో మండల సమాఖ్య విజయవంతంగా కొనసాగుతున్నది.

**ఇందిరా మహిళా శక్తి పథకం :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తు న్న ఇందిరా మహిళా శక్తి కింద మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం రూ కోటి ముప్పై లక్షల విలువైన స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయించారు. గేదెల పెంపకం, క్యాంటీన్లు, కుట్టు మిషన్లు, కోడి పిల్లల పెంపకం తదితర యూనిట్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక, సామాజిక సేవలు అందిస్తూ ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గత ఐదేళ్లకు పైగా ఎస్ హెచ్ జీ సభ్యులకు రుణాలు అందించడం వాటిని క్రమం తప్పకుండా చెల్లించేలా చూడడం సభ్యులకు బీమా కల్పించడం తదితర సేవలు అందిస్తునారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణించేలా నిరంతరం శిక్షణ, సలహాలు అందిస్తున్నారు.

అదేవిదంగా సామాజిక బాధ్యత కింద అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత,నీటి వనరుల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగించవద్దని, సైబర్ మోసాలకు గురి కావద్దని, పల్స్ పోలియో ఇంకుడు గుంతలు, వ్యక్తిగత మరుగు దొడ్ల నిర్మాణం తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు జీవనోపాదులు పెంచే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

**22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు (సీఎల్ఎఫ్) ఎంపిక**

దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమాఖ్యల పనితీరును పరిశీలించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ లో భాగంగా ఉత్తమ సేవ లు అందిస్తున్న మండల సమాఖ్యలను గుర్తించి ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డు 2024 ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి దేశవ్యాప్తంగా 22 మహిళా సంఘాలను ఎంపిక చేసింది. అవార్డులకు దేశంలోని ఆరు రీజియన్ల పరిధిలో 22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు (సీఎల్ ఎఫ్)లు ఎంపిక కాగా సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య రెండో స్థానంలో నిలిచి ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖకు లేఖ అందింది. రానున్న ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద నిర్వహించనున్న అవార్డుల ప్రదాన ఉత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానం పంపించారు. ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు అక్కడికి వెళ్లి అవార్డును స్వీకరించనున్నారు.

**మహిళా సంఘాల సభ్యుల- అభినందించిన కలెక్టర్.**

ఇల్లంతకుంట మండలం ఆదర్శ మహిళా సమాఖ్య ఉత్తమ సేవలందించి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, అలాగే మండల సమాఖ్య బాధ్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా అభినందించారు. దీనికి కృషి చేసిన సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్యకు నిరంతరం ఆదాయం వచ్చేలా గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీతో మండల సమాఖ్య ఆర్థికంగా మరింత బలపడుతుందన్నారు.

**మరింత మందికి ఉత్తమ సేవలు అందించాలన్నారు**

**సందీప్ కుమార్ ఝా కలెక్టర్ రాజన్న సిరిసిల్ల**

ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు ఎస్ హెచ్ జీ సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దేలా కృషి చేయాలి. మహిళలు వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెంది ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నిరంతరం మహిళలకి మద్దతుగా ఉండాలి. మరింత మందికి ఉత్తమ సేవలు అందించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు.

**ఇందిరా మహిళా శక్తితో ఆదాయం**

**బండారి స్వాతి, క్యాంటీన్ నిర్వాహకురాలు, ఇల్లంతకుంట**



మాది ఇల్లంతకుంట నాకు ఇద్దరు పిల్లలు సంఘంలో చేరకముందు నా భర్త చేసే గీతా కార్మికుడు సంపాదనతో పిల్లల చదువు కుటుంబ పోషణ భారంగా ఉండేది. మూడేండ్ల క్రితం నా భర్త చనిపోయారు. నాకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఏదైనా వ్యాపారం ప్రారంభించాలని ఇందిరా మహిళా శక్తి కింద బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.మూడు లక్షలు రుణం తీసుకొని క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్న. ఫుడ్ ఆర్డర్ పైన అవసరమైన వారికి వండి ఆదాయం పొందుతున్న. రుణ వాయిదాలు చెల్లిస్తూ పిల్లలను చదివిస్తూ సంతోషంగా ఉన్న. ఆర్థిక తోడ్పాటు అందించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులకు ధన్యవాదాలు.

**రెండు నెలల్లో 70 వేల ఆదాయం :**

**గొట్టం కవిత, సోమారంపేట**

మాది ఇల్లంతకుంట మండలం సోమారం పేట. నేను సంఘంలో చేరక ముందు వ్యవసాయ కూలీ చేస్తూ బీడీలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నా ము. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందుతూ కూతురు వివాహం చేసాను. నా భర్త నేను కలిసి పౌల్ట్రీ పారం కొరకు లింకేజీ శ్రీ నిధి, వీఓ నుంచి కలిపి రూ 2.50,000 లక్షల రుణం తీసుకుని షెడ్ నిర్మించుకుని బాయిలర్ కోళ్లను పెంచాము. ఇందిరా మహిళా శక్తి కింద రూ.మూడు లక్షల రుణం తీసుకొని 2500 ఒకరోజు కోడి పిల్లలు తెచ్చి ఐదు వారాలు పెంచి మండలంలో విక్రయించడం ద్వారా రెండు నెలల్లో రూ 70 వేల ఆదాయం పొందాము. మళ్ళీ 2500 కోడిపిల్లలను పెంచుతున్నామన్నారు. తక్కువ రోజుల్లో ఎక్కువ ఆదాయం పొందుతూ సంతోషంగా జీవిస్తున్నాము. మాకు అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ సర్, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఖబర్దార్


- ఎంజేపీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్
- భోజనం విషయంలో హెచ్చరించిన జిల్లా బాస్



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 19 (జనం సాక్షి) :** జిల్లాలోని హాస్టళ్ళు, గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తాను ఊరుకోబోనని, తేడాలొస్తే ఖబర్దార్ అని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి హెచ్చరించారు. జిల్లాలోని డిచ్పల్లి మండలం ధర్మారం(బీ ) గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతా వరణంలో భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థు లను గుర్తించి, వారికి ప్రత్యేక బోధన అందిస్తూ, మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా అంకిత భావంతో కృషి చేయాలని పాఠశాల నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు ఆఫీస్ రూంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ లతో సమావేశమై, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణ అధికారి ఎల్ల వేళలా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పాఠశాల నిర్వహణను పక్కాగా పర్యవేక్షించాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం ప్రతిరోజూ ఉడకబెట్టిన కోడిగుడ్లు అందిస్తున్నారా, టెండర్ ప్రక్రియ పూర్తయిందా అని ఆరా తీశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. సిబ్బంది అటెండెన్స్, ఇతర రికార్డులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల రోజువారీ దినచర్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్.సీ.ఓ సత్యనాథ్ రెడ్డి, డిచ్పల్లి తహసీల్దార్ సతీష్ రెడ్డి ఉన్నారు.

# నిరుపేద బాలికకు వివాహ కానుక

## అవామి హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్"దాతృత్వం



**ఖమ్మం (జనం సాక్షి) :** పెద్ద దిక్కును కోల్పోయి పేదరికంలో కూరుకుపోయిన ఒక కుటుంబానికి అవామి హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ అండగా నిలిచి దాతృత్వాన్ని చాటుకుంది. ఆ కుటుంబంలో వివాహానికి సిద్ధమైన బాలికకు రూ.10వేల వ్యయంతో కొనుగోలు చేసిన మంచాన్ని పెళ్లి కానుకగా అందించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తిప్పనపల్లికి చెందిన నిజామ్ అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయింది. భార్య తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తూ వస్తోంది. కాగా కుమార్తె వివాహం నిశ్చయమవడంతో ఆ కుటుంబానికి అండగా నిలవాలని అవామి హింద్ నిర్ణయించిందని ఆ సంస్థ చైర్మన్ మహ్మద్ జవ్వాద్ అహ్మద్ పేర్కొన్నారు. ఆ బాలిక వివాహ కానుకగా తమ సంస్థ తరపున మంచాన్ని బహూకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కుల, మత, వర్గ, వర్ణాలకు అతీతంగా అవామి హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. విద్య, వైద్యంతో పాటు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాలకు తమ సంస్థ తోడుగా నిలుస్తుందని వివరించారు. దేవుడిచ్చిన సంపదలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయడంలోనే దైవత్వం ఇమిడి ఉంటుందని జవ్వాద్ అహ్మద్ అభిప్రాయపడ్డారు.

# సంకల్పం, ఆత్మవిశ్వాసంతో మహిళలు ముందుకు సాగాలి

- ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకొని... ఆర్థిక సాధికారత సాధించాలి
- కరీంనగర్ జిల్లా మహిళా శక్తికి నిదర్శనం కావాలి : కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 19 (జనంసాక్షి) :** ప్రభుత్వం మహిళల కోసం ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సంకల్పం, ఆత్మవిశ్వాసంతో ముందుకెళుతూ ఆర్థిక సాధికారత సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కరీంనగర్ నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబరాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో కళాభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టబడి ఉందని అన్నారు. ఆ దిశగా మహిళలకు ఉపాధి మార్గం చూపడంలో జిల్లా ముందు వరుసలో నిలుస్తోందని తెలిపారు. గతంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 42 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మాత్రమే ఉండగా గత యాసంగిలో 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. 342 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనను గ్రూపు సభ్యులకు అప్పగించి తద్వారా వారు కోటి యాభై లక్షల రూపాయల ఆదాయం పొందేలా చేశామని వివరించారు. మహిళా శక్తి క్యాంటీన్లు విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. త్వరలో పెట్రోల్ బంక్, సోలార్ విద్యుత్ వంటి వ్యాపారాలు మహిళలకు అప్పగిస్తామని అన్నారు. ప్రభుత్వం మహిళా అభివృద్ధికి కట్టుబడి ఉందని, రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎక్కువమంది మహిళలే లబ్ధి పొందాలని వివరించారు. సుమారు 78 వేల కొత్త రేషన్ కార్డులు జిల్లాలో మంజూరు చేస్తున్నామని అన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడంలోనూ, లోన్ రికవరీ లోను జిల్లా ముందంజలో ఉందని అన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులు ఓపెన్ స్కూల్ లో చేరాలని, పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేయాలని కోరారు. మహిళల కోసం జిల్లాలో ప్రవేశపెట్టిన శుక్రవారం సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు సంబంధించిన అన్ని మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభిస్తాయని అన్నారు. గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ, ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, తద్వారా కుటుంబం అభివృద్ధి చెందాలనేది ఈ ప్రభుత్వ సంకల్పంగా చెప్పారు. అందుచేతనే మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, సోలార్ పవర్, ప్లాంట్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వంటి ఎన్నో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిందని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, అన్ని రంగాల్లోనూ మహిళల పాత్ర చాలా కీలకమైనదని తెలిపారు. భవిష్యత్తు అభివృద్ధికి మహిళలు కీలకంగా వ్యవహరించనున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూ దేశం గర్వించేలా ఎదగాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఒక్క కరీంనగర్ అర్బన్ లోనే సుమారు 40 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశామని అన్నారు. అందరూ ఒకే రకమైన యూనిట్లు కాకుండా ప్రజా అవసరాలను బట్టి రకరకాల వ్యాపారాలను ప్రారంభించి తద్వారా అభివృద్ధి సాధించాలని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నుండి శానిటేషన్ వర్కర్లకు కావలసిన యూనిఫామ్ కుట్టిచ్చే బాధ్యతలు కూడా స్వయం సహాయ సంఘాలకు ఇస్తున్నామని అన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలు, లోన్ బీమా, ఆర్టీసీ అద్దె బస్సుల నుండి వచ్చిన ఆదాయం, యూనిఫామ్ కుట్టు చార్జీలు సంబంధించిన చెక్కులను అందజేశారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ లాభాలు గడిచిన 12 మంది సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ వేణుమాధవ్, డిఆర్డి ఓ శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సహకార శాఖలో అధికారికి పదోన్నతి

**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా సహకార శాఖలో సీనియర్ ఇన్స్పెక్టర్‌గా సేవలందిస్తున్న మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్ ను అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి కల్పిస్తూ, సహకార శాఖ రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ రావు, అడిషనల్ రిజిస్ట్రార్ (సర్వీసెస్), ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా టిఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, రాష్ట్ర టిసిఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ గౌడ్, రాజ వర్ధన్, కరీంనగర్ జిల్లా టిఎన్జీవోల అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగం లక్ష్మణరావు, పాలక వర్గం, కమర్షియల్ టాక్స్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఆఫీసర్ (ఇ.ఎస్) పి. శ్రీనివాస్ రావు, ఎక్సైజ్ మినిస్ట్రీస్ అధికారి, ఎక్సైజ్ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎన్. అనిల్ కుమార్, కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుల్ అధ్యక్షులు పులి నగేష్ గౌడ్, మట్టేం శ్రీనివాస్, మొహమ్మద్ మోసిన్ కమల్, టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ ఖాద్రి, జలీల్ అహ్మద్, అఫ్జలొద్దీన్, టి.జి. మీసా, ఆల్ మేవ, సూట ముస్లిం, టి.జి. ముస్లిం ఎంప్లాయిస్, మేస రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, పాలక వర్గం సహకార శాఖ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ పాలకవర్గం సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది అభినందనలు తెలుపుతూ, పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో మొహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్‌ని ఘనంగా సత్కరించారు.

# క్రెడిట్ కార్డు పేరిట సైబర్ మోసాలు

## అంతర్ రాష్ట్ర సైబర్ నిందుతుడి అరెస్ట్ : ఎస్పీ మహేశ్ బి గితే



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 19 (జనంసాక్షి) :** క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరిట సైబర్ మోసానికి పాల్పడిన అంతర్ రాష్ట్ర సైబర్ నిందితుడు మహమ్మద్ కలిం పాషా ను అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. శనివారము జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హైదరాబాద్ లోని చింతల్, వెంకటరామిరెడ్డి నగర్ కు చెందిన మొహమ్మద్ కలీం పాషా తనకు పరిచయం ఉన్న హైదరాబాద్ కు చెందిన రషీద్ ఇద్దరు చెడు వ్యసనాలకు బానిసలు అయ్యారన్నారు. తక్కువ సమయములో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యముతో ఆన్ లైన్ ద్వారా సులువుగా ప్రజలను మోసగించి డబ్బులు సంపాదించ వచ్చునే ఆలోచించారు.రషీద్ కి పరిచయం ఉన్న అంకిత్ వద్దకు గత ఫిబ్రవరిలో ఇద్దరు కలసి కలకత్తాకు వెళ్లి ఆన్లైన్ ద్వారా ప్రజలను ఎలా మోసాగించాలో నేర్చుకున్నారు. ఈ విధంగా వారి మధ్య జరిగే ప్రతి లక్షకు రూ 2500 మోసం నేర్పించిన వ్యక్తికి ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సిరిసిల్లకు చెందిన సురేష్ కుమార్ అనే వ్యక్తి క్రెడిట్ కార్డు యాక్టివేట్ చేస్తానని ఆన్ లైన్ కస్టమర్ కేర్ అంటూ మాట్లాడి మోసం చేశారు. దీనితో బాధితుడు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశాడు. సిరిసిల్ల పోలీసులు జిల్లా సైబర్ టీం ఆర్ఎస్ఐ జునైద్,గంగరెడ్డి,కిట్టు,మహేష్ ఆధ్వర్యంలో టీమ్ ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా శనివారం హైదరాబాద్ లో పట్టుకున్నారన్నారు. మిగితా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. అంతర్ రాష్ట్ర సైబర్ నిందుతున్ని పట్టుకోవడంలో కృషి చేసిన సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సైబర్ టీమ్ గంగరెడ్డి, కిట్టు, మహేష్,శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ లను ఎస్పీ అభినందించారు.

## ప్రేమలో.. యువ క్రికెటర్



క్రికెటర్లు మోడల్స్, సినీ హీరోయిన్లతో ప్రేమలో పడటం కొత్తేమీ కాదు. కొందరు గాసిప్స్‌తో మొదలైన సంబంధాన్ని పెళ్లి వరకూ తీసుకెళ్లారు. విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా ఇలా సినీ సెలబ్రిటీలను పెళ్లాడారు. ఇప్పుడు యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ కూడా ఈ జాబితాలో చేరడానే వార్తలు వైరలవుతున్నాయి. తన విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించే ఇషాన్, మోడల్ మరియు 2018 మిస్ దివా టైటిల్ విజేత అదితీ హుండియాతో డేటింగ్‌లో ఉన్నాడని టాక్. అయితే, ఇషాన్ గానీ, అదితీ గానీ తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని అధికారికంగా చెప్పలేదు. ఐపీఎల్ సమయంలో వీరి మధ్య పరిచయం ఏర్పడినట్లు జీ న్యూస్ కథనం పేర్కొంది. ముంబై ఇండియన్స్ ఫ్యాన్ అయిన అదితీ, 2019 ఐపీఎల్ ఫైనల్‌లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై మ్యాచ్‌ను వీక్షించి, స్టాండ్స్‌లో 'మిస్టరీ ఎంఐ ఫ్యాన్ గర్ల్'గా వైరలైంది. అప్పటి నుంచి వీరి మధ్య సంబంధం మొదలైనట్లు సమాచారం. సోషల్ మీడియాలో ఇషాన్ అదితీ రెడిట్ పోస్ట్‌పై 'బ్యూటిఫుల్' అని కామెంట్ చేయడంతో వీరి డేటింగ్ గురించి ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. అయితే, ఐదేళ్ల వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేశారు. దీంతో వీరి రిలేషన్‌షిప్ ముగిసిందా లేక గాసిప్స్ నుంచి తప్పించుకోవడానికి ఇలా చేశారా అని అభిమానులు చర్చించుకుంటున్నారు. ఇషాన్ విషయానికొస్తే, గత ఏడాది దక్షిణాఫ్రికా టూర్‌లో సిరీస్ మధ్యలో స్వదేశానికి తిరిగొచ్చాడు. రంజీ ఆడనందుకు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. అయినప్పటికీ, దేశవాళీ క్రికెట్‌లో ఆడి ఫామ్‌ను చాటుకున్నాడు. ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ తరపున తొలి మ్యాచ్‌లో సెంచరీతో మెరిసినా, ఆ తర్వాత వరుసగా



# చిరకాల ప్రత్యర్థుల ఫైట్

**ఇంగ్లండ్ వేదికగా ఆదివారం ఫ్యాన్స్‌కు పూనకాలే?** క్రికెట్‌లో ఫార్మాట్ ఏదైనా సరే, భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ఐసీసీ టోర్నీల్లో ఈ దాయాదుల పోరు కోసం ప్రతి రోజు స్టేడియాలు కిటకిటలాడతాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఈ రెండు జట్ల మధ్య క్రికెట్ ఆడటం దాదాపు కరువైంది. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్‌కు ఉత్సాహం తెప్పించేందుకు క్రికెటర్లు సిద్ధమవుతున్నారు. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ రెండో సీజన్‌లో జూలై 20, 2025న ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇండియా ఛాంపియన్స్, పాకిస్థాన్ ఛాంపియన్స్ జట్లు తలపడనున్నాయి. ఒకప్పుడు మైదానంలో కొదమ సింహాల్లా ఢీకొన్న ఈ జట్ల మాజీ ఆటగాళ్లు మరోసారి తమ పోరాటంతో అభిమానులను అలరించేందుకు రెడీ అవుతున్నారు. భారత జట్టులో యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడు బ్యాటింగ్ లైనప్‌ను పటిష్టంగా నిలుపుతుండగా, వినయ్ కుమార్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్, వరుణ్ ఆరుణ్‌లతో కూడిన పేస్ దళం బలంగా కనిపిస్తోంది. హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లా స్పిన్ బౌలింగ్‌తో పాకిస్థాన్ బ్యాటర్లను కట్టడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో లైవ్ టెలికాస్ట్‌లో, ఫ్యాన్‌కోడ్ యాప్ మరియు వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్‌లో చూడవచ్చు.

## టైటిల్‌కు అడుగు దూరంలో.. అర్జున్

### ప్రజ్ఞానందకు ఓదార్పు విజయం



లాస్ వేగాస్‌లో జరిగిన ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగైసి సెమీ ఫైనల్‌లో ఓడిపోయాడు. తొలి రౌండ్ నుంచి సంచలన విజయాలతో దూసుకెళ్లిన తెలంగాణ కుర్రాడు, సెమీస్‌కు చేరిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించినప్పటికీ, అర్మేనియాకు చెందిన లెవాన్ అరోనియన్ చేతిలో 0–2తో ఓటమి పాలయ్యాడు. శనివారం జరిగిన ఈ పోరులో అర్జున్ గట్టిగా పోరాడినప్పటికీ, తొలి గేమ్‌లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక టైటిల్‌కు అడుగు దూరంలో ఆగిపోయాడు. మరోవైపు, వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి ఆశలు రేపిన ప్రజ్ఞానంద క్వార్టర్స్‌లోనే వెనుదిరిగాడు. అయినప్పటికీ, మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో జర్మనీ ఆటగాడు విన్సెంట్ కెయిమర్‌పై ప్రజ్ఞానంద అద్భుత విజయం సాధించాడు. నల్ల పావులతో ఆడిన ఈ భారత స్టార్ తొలి రౌండ్‌ను డ్రాగా ముగించి, రెండో రౌండ్‌లో 1.5–0.5 స్కోరుతో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. ఇక నార్వే దిగ్గజం కార్ల్‌సన్ కూడా ఉజ్బెకిస్థాన్ ఆటగాడు జవోఖిర్ సిందరోవ్‌పై విజయంతో మూడో స్థానం రేసులో నిలిచాడు.

## విల్ జాక్స్ మెరుపు శతకం

ఆసియా కప్ 2025 నిర్వహణపై అనిశ్చితి నెలకొంది. జూలై 24న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరగనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ వార్షిక సర్వసభ్య సమావేశానికి భారత క్రికెట్ నియంత్రణ బోర్డ్ వ్యతిరేకత వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి, భారత్‌తో సంబంధాలు సాధారణంగా లేని నేపథ్యంలో సమావేశ వేదికను మార్చాలని బోర్డు కోరినట్లు తెలుస్తోంది. ఢాకాలో సమావేశం జరిగితే అందులో తీసుకునే తీర్మానాలను బహిష్కరిస్తామని బోర్డు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఆసియా కప్ జరగడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ సమావేశానికి హాజరు కాదని భారత్ ముందుగానే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో షెడ్యూలైన వన్డే, టీ20 సిరీస్‌లను బోర్డు 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేసింది. అంతర్జాతీయ షెడ్యూల్ కఠినంగా ఉండటమే కారణమని చెప్పినప్పటికీ, రాజకీయ అనిశ్చితి, ఆటగాళ్ల భద్రత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్, పాకిస్థాన్ మంత్రి మొహిసిన్ నక్వీ నేతృత్వం వహిస్తున్నారు. సమావేశం విషయంలో భారత్‌పై ఒత్తిడి తీసుకురావడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వేదికను మార్చాలని బోర్డు కోరినప్పటికీ, ఆయన నుంచి స్పందన రాలేదని తెలుస్తోంది.



## మరో రికార్డుపై రూట్ గురి!

ఇంగ్లాండ్ వెటరన్ బ్యాటర్ జో రూట్ మరో అరుదైన ఘనత ముందు నిలిచాడు. ఈనెల 23 నుంచి జరిగే నాలుగో టెస్టులోనే ఈ మైలురాయిని అందుకోవాలని అతని అభిమానులు కోరుకుంటున్నారు. ప్రస్తుతం టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో రూట్ ఐదో స్థానంలో ఉన్నాడు. తను ఇప్పటివరకు 156 టెస్టుల్లో 285 ఇన్నింగ్స్ ఆడి 13,259 పరుగులు చేశాడు. మరో 120 పరుగులు చేస్తే, ఈ జాబితాలో ఏకంగా తను రెండో స్థానానికి ఎగబాకుతాడు. ఈక్రమంలో మాంచెస్టర్ టెస్టులోనే తను ఈ ఘనత సాధించాలని కోరుకుంటున్నాడు. ఇక ఐదు టెస్టుల అండర్సన్–టెండూల్కర్ సిరీస్ లో ఇప్పటి వరకు 258 పరుగులు చేసిన రూట్.. ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఇందులో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉన్నాయి. నాలుగో టెస్టు వేదికైన మాంచెస్టర్‌లో రూట్‌కి తిరుగులేని రికార్డు ఉంది. ఈ వేదికపై అత్యధిక టెస్టు పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇప్పటివరకు 11 టెస్టులాడిన రూట్.. 19 ఇన్నింగ్స్ ల్లో 978 పరుగులు చేశాడు. సగటు 65.20 కావడం విశేషం. ఇందులో ఒక సెంచరీ, ఏడు ఫిఫ్టీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 254 కావడం విశేషం.

# 60 వేల కోట్లు సమకూరేనా..?

టీ20 క్రికెట్‌ను కొత్త శిఖరాలకు చేర్చిన ఐపీఎల్ ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన లీగ్‌గా నిలిచింది. భారత్‌లోనే కాక, విదేశాల్లో సిస్టర్ ఫ్రాంచైజీల ద్వారా ఈ ఫార్మాట్‌ను ఐపీఎల్ జట్ల యజమానులు శాసిస్తున్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇంగ్లండ్ కౌంటీ క్లబ్ క్రికెట్‌కు ఊపిరిపోసేందుకు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ముందుకొచ్చాయి. ఇంగ్లండ్‌లోని 'ది హండ్రెడ్ లీగ్'లో జట్లలో వాటాలను కొనుగోలు చేసి తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాయి. ఈ ఒప్పందాలతో హండ్రెడ్ లీగ్ నిర్వాహకులు రూ.60 వేల కోట్ల ఆదాయాన్ని ఆశిస్తున్నారు. ఇంగ్లండ్‌లోని చిన్న కౌంటీ క్లబ్‌లు ఆర్థికంగా ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్‌పై ఆధారపడుతుంటాయి. ఈ నేపథ్యంలో, రిలయన్స్ ఇండస్ట్రీస్ (ముంబై ఇండియన్స్) ఓవల్ ఇన్విన్సిబుల్స్‌లో 49% వాటాను 60 మిలియన్లకు, సన్ గ్రూప్ (సన్‌రైజర్స్ హైదరాబాద్) నార్దర్న్ సూపర్‌ఛార్జర్స్‌లో 100% వాటాను 100 మిలియన్లకు, RPSG గ్రూప్ (లక్నో సూపర్ జెయింట్స్) మాంచెస్టర్ ఒరిజినల్స్‌లో 70% వాటాను 81 మిలియన్లకు, GMR గ్రూప్ (ఢిల్లీ క్యాపిటల్స్) సదరన్ బ్రేవ్‌లో 49% వాటాను 48 మిలియన్లకు కొనుగోలు చేశాయి. ఈ ఒప్పందాలు ఇంగ్లండ్ క్రికెట్‌కు 520 మిలియన్ల నిధులను తెచ్చిపెట్టాయి, ఇందులో సగం కౌంటీ క్లబ్‌లకు పంచబడుతుంది. ఈ పెట్టుబడులు కౌంటీ క్లబ్‌లకు ఆర్థిక స్థిరత్వం, స్టేడియాల అభివృద్ధి, మెరుగైన ఆటగాళ్లను ఆకర్షించడం, క్రికెట్ నాణ్యతను పెంచడంలో దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు. అయితే, ఈ ఒప్పందాలు ఐపీఎల్ ఫ్రాంచైజీల బ్రాండ్ విస్తరణకు దోహదపడుతున్నప్పటికీ, కౌంటీ క్రికెట్‌లో ఆర్థిక అసమానతలను తగ్గించడంలో ఎంతవరకు సఫలమవుతాయన్నది చర్చనీయం. పెద్ద క్లబ్‌లు (సర్రే, లాంకషైర్, వార్విక్‌షైర్) ఆదాయంలో 44% సంపాదిస్తుండగా, చిన్న క్లబ్‌లు (నార్తాంప్టన్‌షైర్, లీసెస్టర్‌షైర్, డెర్బీషైర్) ECB నిధులపై ఆధారపడుతున్నాయి. ఈ పెట్టుబడులు చిన్న క్లబ్‌లకు ఊరట కలిగించినప్పటికీ, క్రికెట్ నాణ్యత, సౌకర్యాల అభివృద్ధిలో దీర్ఘకాలిక మార్పులు కాలమే నిర్ణయిస్తుంది. కొందరు ఈ పెట్టుబడులు ఇంగ్లండ్ క్రికెట్‌ను 'ఐపీఎల్ మాదిరిగా' మారుస్తాయని ఆశిస్తుండగా, ఐపీఎల్ ఆధిపత్యం వల్ల ఇతర లీగ్‌ల ఆకర్షణ తగ్గుతుందని మాజీ క్రికెటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ హెచ్చరించారు. అయితే, ECB ఈ పెట్టుబడులు క్రికెట్‌ను అన్ని స్థాయిల్లో అభివృద్ధి చేస్తాయని భావిస్తోంది. మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైకెల్ వాన్ ఈ నిర్ణయాన్ని గొప్పదిగా అభివర్ణించి, కౌంటీ క్లబ్‌లకు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం వస్తుందని పేర్కొన్నాడు. ఈ ఒప్పందాలు ఇంగ్లండ్ క్రికెట్‌కు ఆర్థిక బలాన్ని, ఐపీఎల్ ఫ్రాంచైజీలకు గ్లోబల్ బ్రాండ్ విస్తరణను అందిస్తున్నాయి. అయితే, చిన్న కౌంటీ క్లబ్‌ల ఆర్థిక సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తాయా లేక పెద్ద క్లబ్‌లకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తాయా అనేది భవిష్యత్తులో తేలనుంది.

## యువ స్పిన్నర్ ఫర్హాన్ అహ్మద్ అద్భుతమైన హ్యాట్రిక్

టీ20 బ్లాస్ట్ 2025లో పాకిస్థాన్ మూలాలున్న 17 ఏళ్ల యువ స్పిన్నర్ ఫర్హాన్ అహ్మద్ అదరగొట్టాడు. లంకాషైర్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను అద్భుతమైన హ్యాట్రిక్ తీసి తన జట్టు నాటింగ్‌హామ్‌షైర్‌కు విజయాన్ని అందించాడు. అతని బౌలింగ్‌ను బ్యాట్స్‌మెన్ అర్థం చేసుకోలేక పోయారు. టీ20 క్రికెట్‌లో నాటింగ్‌హామ్‌షైర్ తరఫున హ్యాట్రిక్ తీసిన మొదటి ఆటగాడిగా ఫర్హాన్ నిలిచాడు. లంకాషైర్‌పై ఈ మ్యాచ్‌లో అతను మొత్తం ఐదు వికెట్లు తీసి, తన జట్టుకు 4 వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు. ఇంగ్లాండ్ స్టార్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్ కు ఫర్హాన్ తమ్ముడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన లంకాషైర్ 20 ఓవర్లలో 126 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఫర్హాన్ అహ్మద్ స్పిన్ బంతులు లంకాషైర్ బ్యాట్స్‌మెన్‌లను బాగా ఇబ్బంది పెట్టాయి. లంకాషైర్ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో ఫర్హాన్ వరుసగా మూడు వికెట్లు తీసి హ్యాట్రిక్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో అతను 4 ఓవర్లలో 25 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. 127 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన నాటింగ్‌హామ్‌షైర్ 16 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి గెలిచింది. ఆరంభంలో నాటింగ్‌హామ్‌షైర్ 14 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడినప్పటికీ, టామ్ మూర్స్ 75 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు.

# దేశవాళీ క్రికెట్‌పైనే గంపెడు ఆశలు



ఒకప్పుడు ప్రధాన పేసర్‌గా భారత జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన మహ్మద్ షమీ ఇప్పుడు చోటు కోసం ఎదురుచూస్తున్నాడు. మునపటి పేస్ పవర్ తగ్గడంతో అతడిని తీసుకునేందుకు సెలెక్టర్లు ఆసక్తి చూపించడం లేదు. ఐపీఎల్ 18వ సీజన్‌లో ఇంగ్లండ్ పర్యటనకు దూరమైన ఈ పేసర్ ఫామ్ చాటుకునేందుకు సిద్ధమవుతున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనతో పునరాగమనం చేయాలని అనుకుంటున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న దేశవాళీ సీజన్‌లో ఈ స్పీడ్‌స్టర్ బెంగాల్ తరఫున బరిలోకి దిగనున్నాడు. శనివారం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ 50 మంది ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. ఇందులో షమీతో పాటు ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న పేసర్ ఆకాశ్ దీ, బ్యాటర్ అభిమన్యు ఈశ్వరన్‌లు కూడా ఉన్నారు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున అదరగొడుతున్న కుర్రాడు అభిషేక్ పొరెల్ సైతం ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాడు.

**9 మ్యాచుల్లో ఆరు వికెట్లు**

కమ్‌బ్యాక్ చేయడం ఏ క్రికెటర్‌కైనా కష్టమే. ఇప్పుడు షమీ అలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. వన్డే వరల్డ్ కప్ 2023 అనంతరం గాయం కారణంగా జట్టుకు దూరమైన షమీ.. ఏడాది తర్వాత ఎంట్రీ ఇచ్చాడు. దేశవాళీలో రెండు మ్యాచుల్లో సత్తా చాటిన అతడు ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కానీ, ఈ పేస్ గన్ ఈ మెగా టోర్నీలో పెద్దగా ఆకట్టుకోలేదు. ఆరెంజ్ ఆర్మీని తీవ్రంగా నిరాశపరుస్తూ 9 మ్యాచుల్లో కేవలం ఆరు వికెట్లు తీశాడంతే. మునపటిలా రాణించలేకపోవడంతో ఇంగ్లండ్ టూర్‌కు అతడిని సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. సో.. ఇక ఉన్నదారి దేశవాళీలో వికెట్ల వేటతో అందరి దృష్టిని ఆకర్షించడమే. డొమెస్టిక్ సీజన్ 2025–26 ఆగస్టులో మొదలవ్వనుంది. బెంగాల్ ప్రాబబుల్స్ : అభిమన్యు ఈశ్వరన్, షమీ, అనుస్తుప్ మజుందార్ సుదీప్ ముఖర్జీ, సుదీప్ కుమార్, అభిషేక్ పొరెల్(వికెట్ కీపర్), షకిర్ హబిబ్ గాంధీ (వికెట్ కీపర్), కజీ జునైద్ సైఫీ, షహబాజ్ అహ్మద్, ప్రదీప్త ప్రమాణిక్, ప్రిత్తిక్ ఛటర్జీ, కరన్ లాల్, ఆకాశ్ దీప్ ముకేశ్ కుమార్ సింధు జైస్వాల్, ఇషాన్ పొరెల్, మహ్మద్ కైఫ్ శుభమ్ ఛటర్జీ, సుమంత గుప్త ఉన్నారు.

# విద్యార్థి ఆత్మహత్య బాధాకరం

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు**



**ఆర్మూర్,జూలై 19 ( జనం సాక్షి):** ఆర్మూర్ పట్టణ శివారులో ఎస్సీ గురుకుల సంక్షేమ పాఠశాలలో విద్యార్థి సంతోష్ ఆత్మహత్య బాధాకరమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.కళాశాలలో విద్యార్థి ఆత్మహత్యకు ప్రభుత్వ నిర్లక్ష్యంగా,ప్రభుత్వ హత్యగా భావిస్తున్నామన్నారు.తొమ్మిదేళ్ల కెసిఆర్ పాలనలో గురుకులాలు దేవాలయాలుగా ఉండి, ఉన్నత విద్యను అందించాయన్నారు.18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వం,అధికారులు గురుకులాలపై నిర్లక్ష్యంగా వహించడమే ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తుందన్నారు.ఈ ఘటనపై పూర్తి దర్యాప్తు చేయాలని,విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం జరగాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# భగాయత్‌లో అభివృద్ధి పనులకు రూ.28 కోట్ల నిధులు

- సమస్యలను సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్లిన పరమేశ్వర్‌రెడ్డి
- హెచ్‌ఎండీఏ అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు సమీక్ష



**ఉప్పల్ జూలై 19 ( జనంసాక్షి):** ఉప్పల్ భగాయత్‌లోని హెచ్‌ఎండీఏ లే అవుట్‌కు మంచి రోజులు రానున్నాయి. త్వరలోనే లే అవుట్‌లో సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో నెలకొన్న సమస్యలపై ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి , జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు రూ.28 కోట్ల నిధులు మంజూరు అయ్యేలా చేశారు. త్వరలోనే ఈ నిధులతో కావాల్సిన పనులను చేపట్టనున్నారు. ఇప్పటికే రూ.3 కోట్ల 10 లక్షల నిధులతో.ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్ లో ఖాళీ స్థలాల పరిరక్షణ కు ఇప్పటికే రూ.3.కోట్ల 10 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇదే కాకుండా మరో రూ.10 కోట్లతో మల్టీ లెవెల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. ఈ రెండు రకాల పనులకు రూ.13.10 కోట్ల నిధులను పరమేశ్వర్ రెడ్డి, రజిత పరమేశ్వర్ రెడ్డి రాబట్టిన విషయం తెలిసిందే.సీఎం ఆదేశాలతో ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లే అవుట్ లో అభివృద్ధి, సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్‌ఎండీఏ అధికారులతో సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. లే అవుట్‌లో కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. లే అవుట్‌లో రూ.28 కోట్లతో రహదారులు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులను చేపట్టే విధంగా కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ సమన్వయంతో ఈ పనులను చేపట్టాలని మంత్రి సూచించారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి బంగారు పతకం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :** క్రీడల వలన విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు తరగతి గదిలో ఎదురవుతున్నటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడల వలన విద్యార్థులకు ఎన్నో రకాలుగా లాభాలు చేకూరుతాయని ముఖ్యంగా వారికి చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు. క్రీడల విశిష్టతను దృష్టిలో పెట్టుకొని పాఠశాల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజు క్రీడల పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తూ పోటీలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ప్రాథమిక దశలో పాఠశాల స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను వివిధ స్థాయిలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని వారు చెప్పారు.

ఇటీవల కాలంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో నిర్వహించినటువంటి కరాటే ఓపెన్ చాంపియన్షిప్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి అశ్వాన్ కృష్ణ యాదవ్ మూడో తరగతి రాష్ట్ర స్థాయిలో ఘనవిజయాన్ని నమోదు చేశాడని హర్షం వ్యక్తం చేశారు. బంగారు పతకంతో పాటు మొదటి స్థానాన్ని కేటాయించడం జరిగిందని వారు తెలిపారు. అపూర్వ విజయం సాధించడం పట్ల విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం







**వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

చందుర్తి (జనం సాక్షి): ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం మండల కేంద్రంలో నూతన రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు రేషన్ కార్డు ఒక గుర్తింపు కార్డుగా మారిందన్నారు. మండలంలో 254 నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నారని,1995 మంది పేర్లను నూతనంగా నమోదు చేయటం జరిగిందని వీటి ద్వారా దాదాపు 2249 మంది పేదలకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు..రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల 61 వేల నూతన రేషన్ కార్డులు మంజూరు,27 లక్షల 83 వేల అదనపు ఇంటి సభ్యులను రేషన్ కార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు.

గత ప్రభుత్వం అమలు చేసిన ఒక్క పథకాన్ని కూడా రద్దు చేయకుండా నూతన పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించారని అన్నారు.ఆరోగ్య శ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్,ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నారని, 25 లక్షల రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాలుకు 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టారని అన్నారు. దేశంలోనే పేద ప్రజలకు ఉపయోగపడే ప్రతి ఒక్క పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ప్రారంభం చేసిందని అన్నారు.గత పది సంవత్సరాలలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చి పేద ప్రజలను నిలువునా కెసిఆర్ మోసం చేశాడని దుయ్యబట్టారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ సమావేశంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని అమలు చేసేందుకు పంచాయతీ రాజ్ చట్టం–2018కి సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ బిల్లు అసెంబ్లీలో అమలు చేసే సందర్భంలో తాను భాగస్వామ్యం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**త్వరలోనే చందుర్తి - మోత్కూరావు పేట రోడ్డు పనులు ప్రారంభం**

మేడిపల్లి,చందుర్తి మండలాల ప్రజల కోరిక చందుర్తి –మోత్కూరావు పేట రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వం పది సంవత్సరాలలో కనీసం రోడ్డు నిర్మాణానికి అనుమతులు కూడా తీసుకురాలేకపోయారన్నారు. కానీ తాను గెలిచిన 11 నెలల్లోపే అటవీ అనుమతులు తీసుకురావడం జరిగిందని త్వరలోనే పనులు ప్రారంభం చేయడం జరుగుతుంది తెలిపారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీ ఓ రాధ, జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, నాయకులు గొట్టే ప్రభాకర్, పులి సత్యం, మ్యాకల గణేష్,గంట మల్లేశం, అన్ని గ్రామాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


### రాజన్న ఆలయ అభివృద్ధి

## నేడు అభివృధి పనులకు భూమి పూజలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 19 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా నేడు భీమేశ్వర ఆలయంలో మూడు కోట్ల 45 లక్షల అభివృధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భూమి పూజ చెయ్యనున్నారు.రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తులకు భీమేశ్వర ఆలయంలో దర్శన సౌకర్యం కల్పించను న్నారు. త్వరలో రాజన్న ఆలయంలో అభివృద్ధి పనుల చేపట్టనున్న విషయం తెలిసిందే. అప్పటి వరకు భక్తులకు భీమేశ్వర ఆలయంలో దర్శనాలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. దీనికి సంబంధించి భీమేశ్వర ఆలయంలో క్యూలైన్లు, షెడ్ల నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించ నున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై న్యాయ సలహా కోరిన గవర్నర్



**మంథని, (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్‌పై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ న్యాయ సలహా కోరినట్టు సమాచారం. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ ను ప్రస్తుతం ఉన్న 29 శాతం నుంచి 42 శాతం కి పెంచే లక్ష్యంతో బిసి రిజర్వేషన్ బిల్లును రూపొందించగా.. మార్చి 17న అసెంబ్లీలో ఆమోదం పొందింది. అనంతరం ఈ బిల్లును చట్టం చేసేందుకు పార్లమెంటుకు పంపగా అక్కడ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే సెప్టెంబర్ 30 లోపు స్థానిక ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిన క్రమంలో ఈ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చేందుకు సిద్ధం అయింది. బీసీ రిజర్వేషన్ బిల్లును ఇప్పటికే గవర్నర్ కు పంపినప్పటికీ, ఆయన ఇంకా ఆమోదం తెలపలేదు. దీనిపై గవర్నర్ న్యాయ సలహా కోరారు. ఈ క్రమంలో ఈ ఆర్డినెన్స్ ఆమోదానికి మరింత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ బిల్లు రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్‌ను సుప్రీం కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితిని దాటి 67 శాతం కి తీసుకెళ్తుంది. దీనిలో బీసీలకు 42 శాతం ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్‌లు ఉన్నాయి. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని దాటడం వల్ల కలిగే న్యాయ సమస్యలను గవర్నర్ పరిశీలిస్తున్నారు. అయితే గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గవర్నర్లు బిల్లులను ఒక నెలలోపు ఆమోదించాలి లేదా తిరిగి శాసనసభకు పంపాలని ఆదేశించిన నేపథ్యంలో, గవర్నర్ త్వరలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ బిల్లును రాష్ట్రపతికి పంపితే, తెలంగాణ నుండి రాష్ట్రపతి భవన్‌లో పెండింగ్‌లో ఉన్న మూడవ బిల్లుగా ఇది మారుతుంది. ఈ బిల్లు ఆమోదం పొందితే, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలవుతుంది.

## 4 కోట్ల విలువ చేసే భూమిని ప్రభుత్వానికి
# రాసిచ్చిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తన ఉదార స్వభావాన్ని మరోసారి చాటుకున్నారు. తన చిన్నాయన మల్లారెడ్డి ఇచ్చిన భూమి మరియు అందులో నిర్మించిన భవనాన్ని వ్యవసాయ శాఖకు రాసిచ్చారు. యాచారం మండల కేంద్రంలోని 2 వేల గజాల భూమిని వ్యవసాయ శాఖ కు కేటాయిస్తున్నట్లు బీఆర్కే భవన్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసి భూమికి సంబందించిన పత్రాలను అందించారు. ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్లో 4 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. నెలరోజుల క్రితమే రైతు కమిషన్ బృందం, వ్యవసాయ అధికారులు కలిసి యాచారం మండలంలో పర్యటించారు. ఆ సమయంలో కోదండరెడ్డి ప్రభుత్వానికి ఇవ్వాలనుకున్న భూమిని అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి తోపాటు మార్కెటింగ్ అధికారులకు చూపించారు. ప్రస్తుతం ఆ స్థలంలో రైతు మిత్ర కమ్యూనిటీ భవనం ఉంది. అందులో రైతులు వ్యవసాయ సామాగ్రి, ధాన్యం కొనుగోలు కేంద్రం, సీజన్ పంటలు నిలువ కోసం వాడుకుంటున్నారు. ఐతే ఇక ఆ స్థలాన్ని, ఆ స్థలంలో ఉన్న భవనాన్ని పూర్తిగా వ్యవసాయ శాఖకు రాసిస్తే.. రైతులకు మరింత మేలు జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోదండరెడ్డి తెలిపారు. ఇవాళ సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి ల కు ఈ విషయం చెప్పి స్థలానికి సంబంధించి పేపర్స్ ను అందజేశారు. అదేవిదంగా యాచారం మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ ను ఏర్పాటుచేయాలని రైతు కమిషన్ కోరింది. దానికి సంబంధించి ప్రైవేట్ స్థలం యాచారం బస్టాండ్ కు అనుకొనే ఉన్నట్లు కమిషన్ బృందం.. మంత్రి కి వివరించారు. ఆ స్థలాన్ని సేకరించి మార్కెట్ను ఏర్పాటు చేయాలన్నారు. ఇక పలు అంశాలపై వ్యవసాయ మంత్రి తో కమిషన్ చర్చించింది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఏవో హరి వెంకట ప్రసాద్ ఉన్నారు.

# సాగర్ క్రస్ట్ గేట్ల నుంచి నీరు లీక్

- గతంలో మరమ్మతులు చేసినా కానరాని ఫలితం



నాగార్జునసాగర్, జూలై19 (జనంసాక్షి) : తాజాగా ప్రాజెక్టులోని నాలుగు క్రస్ట్ గేట్ల నుంచి నీరు లీకవుతోంది. దీంతో ఆందోళన నెలకొంది. బహుళార్థసాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి వస్తున్న భారీ వరదతో సాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. అయితే, సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీరు లీకేజీ కావడంతో ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. జలశయానికి భారీగా వరద నీరు వచ్చినప్పుడల్లా స్పిల్‌వే దెబ్బతింటూనే ఉంది. వాస్తవానికి సాగర్ గేట్ల సామర్థం 20 లక్షల క్యూసెక్కులు కాగా, భారీ వరదలతో దెబ్బతిన్నచోట్ల మొదట్లో చిన్న చిన్న మరమ్మతులు చేశారు. 2009లో భారీగా వరద పోటెత్తినప్పుడు స్పిల్‌వే దెబ్బతింది. దీంతో 2010-12 లో రూ.40 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. అప్పుడు జాతీయ నిర్మాణ సంస్థ (ఎన్‌ఏసి) సూచించిన మేరకు కాంక్రీట్ మిక్స్‌డ్ డిజైన్ ప్రకారం సిలికా ఫ్యూమ్, స్టీల్‌వైర్ ఫైబర్‌తో గుంతలను పూడ్చారు. ఆ ప్రాంతాల్లో ఎక్కడో ఒకచోట మినహాయిస్తే స్పిల్‌వే ఇంతవరకూ దెబ్బతినలేదు. మళ్లీ కొత్త ప్రాంతాల్లో గుంతలు పడినచోట అదే పద్ధతిలో మరమ్మతులు చేస్తే డ్యామ్‌కు భద్రత చేకూరుతుంది. 2012 లో స్పిల్‌వే భారీగా దెబ్బతింది. డ్యాం స్పిల్‌వేకు ఎం 60 కాంక్రీట్ వాడినప్పటికీ ఫలితం లేకపోయింది. ఏటా మరమ్మతులు చేస్తున్న పరిస్థితులు మెరుగుపడటం లేదు. ఆ తర్వాత 2013, 2020, 2021 సంవత్సరాల్లో వచ్చిన వరదలకు స్పిల్‌వేపై సుమారు 30 మీటర్ల లోపు భారీగుంతలు ఏర్పడ్డాయి. స్పిల్ వే మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఇంజనీర్లు పలుమార్లు అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు పంపించారు.గుంతల పరిమాణం పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం 2022లో రూ.20 కోట్లు- మంజూరు చేసింది. నాగార్జునసాగర్ జలాశయానికి రోజుకు 5 నుంచి 7 లక్షల క్యూసెక్కుల మేర నీరు రావడంతో అధికారులు అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి సాగర్‌కు ఏటా మరమ్మతులు చేస్తున్నా పరిస్థితులు మెరుగుపడటం లేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్ వే మరమ్మతు పనులకు సంబంధించి రూపకల్పనలో భాగంగా రూ.20 కోట్ల వ్యయంతో 2023 మార్చిలో మొదటి దశ పనులు ప్రారంభించి చివరి దశ పనులు 2023 అక్టోబర్‌లో పూర్తి చేశారు. అయితే ఈ పనులను చేపట్టిన స్వప్న కంస్ట్రక్షన్ గ్రూప్ కంపెనీ గతంలో ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి నీటి విడుదల ద్వారా వరద ఉద్ధృతికి ఏర్పడిన సుమారు 10 అడుగుల లోతు గుంతలను ఆధునిక పద్ధతుల ద్వారా పూడ్చామని, రాబోయే వరద ఉద్ధృతికి ఈ భారీ గుంతలకు వేసిన కాంక్రీట్ చెదిరిపోకుండా ఉండడానికి విదేశాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 'ఎం 60 గ్రేడ్ సిలికాన్ ఫైబర్ రీ ఇన్ఫోర్స్ డ్ కాంక్రీట్'ను ఉపయోగించామని తెలిపారు. గుత్తేదార్లు చేపట్టిన మరమ్మతుల్లో నాణ్యత లేకపోవడంతో వరదల్లో మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గుత్తేదార్లు నిర్మాణంలో నాణ్యత లోపాలు సాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రతి ఏటా ప్రవాహ ఉద్ధృతికి అవి పెద్దవై పోతున్నాయి. వీటిని ఉపేక్షిస్తే సాగర్ భద్రతకు ముప్పు అని ఇంజినీర్లు చెబుతున్నారు. తాజాగా ప్రాజెక్టులోని నాలుగు క్రస్ట్ గేట్ల నుంచి నీరు లీకవుతోంది. సాగర్ ప్రాజెక్టుకు మొత్తం 26 క్రస్ట్ గేట్లు- ఉన్నాయి. వాటిలో 8, 23, 24, 25వ నంబర్ క్రస్ట్ గేట్ల నుంచి వరద బయటకు వస్తోంది. నాలుగు గేట్లకు రబ్బర్ సీల్ నీరు కిందికి వెళ్తోంది. ఇలా ప్రతిరోజూ 70 క్యూసెక్కుల నీరు లీకవుతున్నట్లు తెలుస్తోంది. అయితే మేలోనే ఆ గేట్లకు అధికారులు మరమ్మతులు చేశారు. అయినప్పటికీ నీరు లీకవుతుండటం పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఉరేసుకుని స్కూల్ టీచర్ ఆత్మహత్య

### స్నేహితుల వేధింపులే కారణమంటూ సెల్ఫీ



మెదక్, జూలై19 (జనంసాక్షి) : మేడ్చల్‌లోని లాడ్జిలో మెదక్ జిల్లాకు చెందిన గవర్నమెంట్ స్కూల్ టీచర్ ఉరేసుకుని చనిపోయన ఘటన కలకలం రేపింది. మెదక్ పట్టణానికి చెందిన గవర్నమెంట్ టీచర్ కాముని రమేష్ శనివారం మేడ్చల్ లోని ఓ లాడ్జిలో ఉరేసుకుని ప్రాణం తీసుకున్నాడు. చనిపోయే ముందు తీసుకున్న సెల్ఫీ వీడియోలో తన చావుకు ఫ్రెండ్స్ వేధింపులు కారణమని రమేష్ చెప్పాడు. ప్రస్తుతం హవేలీ ఘనపూర్ మండలం సర్దన జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్ గతంలో తెలిసిన వారి దగ్గర పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. అప్పులు, వడ్డీలు భారమై చెల్లించలేక రమేష్ ఏడాది కిందట చేతులెత్తేశాడు. అప్పులిచ్చిన వారి ఒత్తిడితో మెదక్‌లో ఉన్న సొంత బిల్డింగ్, ప్లాట్లు- అమ్మి అప్పులు చెల్లించాడు. తీసుకున్న అప్పులు చెల్లించినప్పటికీ కొందరు ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని, కోర్టులో చెక్ బౌన్స్ కేసులు వేసి ఇబ్బంది పెడుతున్నారని, భార్య, పిల్లలను రోడ్డుకు ఈడ్చారని రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. తన మరణానికి కారణం అయిన వారిని కఠినంగా శిక్షించాలని సెల్ఫీ వీడియోలో ముఖ్యమంత్రి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్‌కు రమేష్ విజ్ఞప్తి చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శవాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టమ్‌కు పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పవర్ లేకపోయేసరికి కెటిఆర్‌కు పిచ్చిపట్టింది

- కెటిఆర్‌ను సిరిసిల్లలో తరిమికొట్టడం ఖాయం
- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి విమర్శలు




హైదరాబాద్, జూలై19 (జనంసాక్షి) : పవర్ లేకపోతే కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు బతకలేక పోతున్నారని కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు దెప్పిపొడిచారు. కేటీఆర్ తన కంటే జూనియర్, బచ్చాగాడని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను సిరిసిల్లాలో చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. కేటీఆర్ తన జీవితంలో ఏనాడూ ముఖ్యమంత్రి కాలేరని విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో మైనంపల్లి హన్మంత రావు మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ తీరుపై మండిపడ్డారు. కేటీఆర్ బాసన్లు తోముకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. మా జోలికి వస్తే మీ బావపై ఎటాక్ చేస్తామని హెచ్చరించారు.ఏం చేయడానికి భారత రాష్ట్ర సమితి పెట్టారని నిలదీశారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కేటీఆర్ మైండ్ పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే కేటీఆర్, హరీష్‌రావు ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. బావ, బామ్మర్దుల బట్టలు విప్పుతానని మైనంపల్లి హన్మంతరావు వార్నింగ్ ఇచ్చారు. కేటీఆర్ రెడ్‌బుక్ పెట్టుకొని ఏం చేస్తారని ప్రశ్నించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేటీఆర్ బద్నాం చేశారని విమర్శించారు. సెటిలర్స్‌ను కాపుడుకుంటానని కేసీఆర్ అనలేదా అని ప్రశ్నించారు. గ్రేటర్‌లో బీఆర్ఎస్‌కి 24 సీట్లు ఇచ్చిన సెటిలర్స్‌పై కేటీఆర్‌కి అంత కోపం ఎందుకని నిలదీశారు. లోకల్, నాన్ లోకల్ అనే ఫీలింగ్ ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కేటీఆర్ షాడో ముఖ్యమంత్రిగా పనిచేశారని ఆరోపించారు. కేటీఆర్ ది నరం లేని నాలుక అని ఆక్షేపించారు. జర్నలిస్ట్ స్వేచ్ఛ చనిపోవడానికి కారణం కేటీఆర్. ఆయన ప్రవర్తనలో మార్పు లేదు.. ఇప్పటికీ అలాగే మాట్లాడుతున్నాడు. కేటీఆర్ అరాచకాలపై పుస్తకం రాస్తాను. గడపగడపకి నేను రాసే పుస్తకాన్ని ఇచ్చే బాధ్యత నాదే. భార్య, భర్తలను కేటీఆర్ విడదీశాడని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కి లేదు. ఏపీలో వైసీపీ నేతలు భయపడి విదేశాలకు, వేరే రాష్ట్రాలకు పారిపోయారు. మూసీ చుట్టూ ఉన్న అక్రమ ఇళ్లు కూలగొడుతాం.. అడ్డు రావద్దని కేటీ-ఆర్ చెప్పాడు. పైసలు తీసుకొని పదవులు ఇస్తామని బీఆర్ఎస్ నాయకులు మోసం చేశారు. కేటీ-ఆర్ జైలు ఊచలు లెక్కపెట్టే రోజులు వస్తాయి. హరీష్‌రావు, కేటీ-ఆర్‌లను అరెస్ట్ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావట్లేదు. కేటీఆర్‌కి ఆయన భాషలో చెబితేనే అర్థం అవుతుంది. కాంగ్రెస్ హై కమాండ్ పిలుపునిస్తే లక్షలాది మంది శ్రేణులు రోడ్లపైకి వస్తారని మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు.

# వివాహేతర సంబంధంతో భర్తను కడతేర్చిన భార్య

### ఢిల్లీలో వెలుగుచూసిన మరో ఘటన

న్యూఢిల్లీ, జూలై19 (జనంసాక్షి) : ఇష్టంలేని పెళ్లిళ్లు, అక్రమ సంబంధాలు, అత్తింటిలో వేధింపులు వంటి కారణాలతో భార్యలు భర్తలను అడ్డు తొలిగించుకుంటున్న ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా దిల్లీలో ఇలాంటి హత్యే ఒకటి జరిగింది. మృతుడి కజిన్‌తో కలిసి నిందితురాలు ఈ దారుణానికి ఒడిగట్టింది. దిల్లీకి చెందిన సుస్మిత జులై 13న తన భర్త కరణ్‌దేవ్(36)కు కరెంట్ షాక్ తగిలిందని ఆసుపత్రికి తీసుకొచ్చింది. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె చెప్పినట్టుగా దీన్ని ఓ ప్రమాదమని నమ్మిన కరణ్ కుటుంబసభ్యులు పోస్ట్‌మార్టం అవసరం లేదని చెప్పారు. కానీ, ఈ కేసులో సుస్మిత, మృతుడి బంధువు రాహుల్ తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. అటు కరణ్ సోదరుడికి కూడా అనుమానం వచ్చి సుస్మిత ఇన్‌స్టా చాటింగ్‌ను పరిశీలించాడు. అందులో ఆమె రాహుల్‌తో మర్డర్ ప్లాన్ గురించి చర్చించినట్లు గుర్తించిన అతడు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. దీంతో సుస్మిత, రాహుల్ మధ్య సంబంధం బయటపడటంతో పాటు కరణ్‌ది సహజమరణం కాదని, హత్య అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. కరణ్ అడ్డు తొలగించుకునేందుకు తొలుత నిందితులు భోజనంలో నిద్ర మాత్రలు ఇచ్చారు. తర్వాత అతడు స్పృహ కోల్పోయే వరకు ఎదురుచూశారు. మోతాదుకు మించి నిద్ర మాత్రలు వేసుకుంటే.. ఎంతసేపటిలో మరణం సంభవిస్తుందో కూడా వారు నెట్‌లో వెతికారు. ఆ మాత్రలు తీసుకున్నా కరణ్ ఊపిరి ఆగకపోవడంతో.. ప్రమాదంగా చిత్రీకరించేందుకు కరెంట్ షాక్ ఇచ్చారు. చాటింగ్ ద్వారా వెల్లడైన ఈ వివరాల ఆధారంగా పోలీసులు నిందితులను కస్టడీలోకి తీసుకున్నారు.

## ఆగస్టు కల్లా ఏపీ సచివాలయంలో
# ప్లాస్టిక్ నిషేధం

- ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలి
- నేరచరితులను చెత్తలాగా ఊడ్చేయాలి
- గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీతో విద్యుత్ ఉత్పత్తి
- క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా అమరావతి
- తిరుపతి స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో సిఎం చంద్రబాబు



తిరుపతి, జూలై19 (జనంసాక్షి) : రాష్ట్రాభివృద్ధికి ఒక్కో నెల ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని సీఎం పిలుపునిచ్చారు. ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే ముందుగా స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలని అన్నారు. జాతీయ స్థాయిలో ఏపీకి 5 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తిరుపతిలో నిర్వహించిన తిరుపతిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రజా వేదిక కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తాను తిరుపతిలో చదువుకుంటూనే ఎమ్మెల్యేగా ఎదిగానని, అంచెలంచెలుగా ఎదిగి నాలుగోసారి సీఎం అయ్యానని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని నిర్మించి.. ఏఐని అభివృద్ధి చేస్తామని అన్నారు. క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుంది. ప్రఖ్యాత విద్యా సంస్థలు తిరుపతిలో ఏర్పాటు- చేశాం. విద్యుత్ ఉత్పత్తి కోసం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ తీసుకురాబోతున్నాం. కాలుష్యం లేకుండా గ్రీన్ హైడ్రోజన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు. వాతావరణ సమాచారం ముందుగా తెలిసేలా యాప్ తీసుకొస్తున్నాం. ఆగస్టు 15 నాటికి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సర్వీసులు అందిస్తామని వివరించారు. నేర చరిత్ర కలిగిన నేతలు రాజకీయాల్లోకి వచ్చారు. ఇంట్లో చెత్తను ఊడ్చినట్లు.. నేరచరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలి. గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయ లేదు. ప్రజల భూములను లాక్కొనేందుకు యత్నించారు. మేం వచ్చాక ఫ్యాక్షనిజం, ముఠా కలహాలు, మతకలహాలు నివారించాం. నేరస్థుల గుండెల్లో నిద్ర పోతాం. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజే నాపై అసత్య ప్రచారం చేశారు. వైకాపా పాలనలో ఎవరికైనా స్వేచ్ఛ ఉండేనా అని చంద్రబాబు ప్రశ్నించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొని స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు- చేసిన స్టాల్స్ పరిశీలించారు. ప్లాస్టిక్ ఎక్కువగా వాడితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరమని చంద్రబాబు చెప్పారు. 120 మైక్రాన్ ఉన్న కవర్లను పూర్తిగా నిలిపేద్దామన్నారు. క్లాత్ బ్యాగ్ వెండింగ్ యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పిన సీఎం.. ప్రపంచంలో ఏ వస్తువు నిరుపయోగం కాదని.. నిరుపయోగంగా ఉన్న వస్తువు నుంచి సంపద సృష్టించవచ్చని తెలిపారు. ప్రగతి పథంలో ముందుకెళ్తున్న మన రాష్ట్రానికి ఇప్పుడు నేర, హత్యా రాజకీయాలు చేసేవాళ్లు అవసరమా? అని సీఎం ప్రశ్నించారు. ఏపీలో పేరుకుపోయిన చెత్తను అక్టోబర్‌లోగా శుభ్రం చేస్తామన్న చంద్రబాబు.. ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ బాగుండా లంటే అందరూ స్వచ్ఛత పాటించాలని, ఆగస్టు నెలలోగా సచివాలయంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని చంద్రబాబు తెలిపారు. డిసెంబర్‌లోగా ప్రభుత్వ ఆఫీసుల్లోనూ ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందని చెప్పారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మించి.. ఆఐని అభివృద్ధి చేస్తామని, క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు ఐటీ-కి ప్రాధాన్యం.. ఇప్పుడు క్యాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యం ఉందని చంద్రబాబు అన్నారు.

# ఆర్థిక నేరగాళ్లా కాంగ్రెస్‌ను విమర్శించేది?

- పదేళ్లు దోపిడీ చేసిన వారికి మాట్లాడే హక్కు లేదు
- కెటిఆర్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



హనుమకొండ, జూలై18 (జనంసాక్షి) : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. అవినీతిలో కూరుకు పోయి, ఆర్థిక అవతవకలకు పాల్పడిన వారు అదేపనిగా ప్రభుత్వంపైనా, సిఎం రేవంత్‌పైనా విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కెటిఆర్ తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధిచెబుతామని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. వరంగల్‌కు ఇచ్చిన హామీలను మరిచిన దొంగ కేటీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసే అభివృద్ధి కేటీఆర్‌కి కనిపించడం లేదా... కళ్లు కనిపించకపోతే డాక్టర్ వద్దకు తీసుకుపోతానని నాయిని రాజేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం హనుమకొండలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తదితరులు రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్లలో తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. పదిమంది లంపెన్ గ్యాంగులతో కేటీఆర్.. కాంగ్రెస్ నేతలపై దాడులకు దిగుతున్నారని నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు . తాము తలచుకుంటే రోడ్లపై కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు తిరగలేరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి రాకముందు దూకుడుగా ఉండేవాళ్లమని... ఇప్పుడు తమ చేతులని హై కమాండ్ కట్టేస్తోందని చెప్పుకొచ్చారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తుపై మీ చెల్లె కవిత చెప్పింది నిజం కాదా అని ఎమ్మెల్యే నాయిని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీమంత్రి కేటీఆర్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్ అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కేటీఆర్ ఆర్థిక నేరస్తుడని.. ఆయన కుటుంబం అంతా నేరపూరితమైందని ఆరోపించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా రొయ్యల పులుసుకు మీ నాన్న కేసీఆర్ అలవాటు- పడితే.. నువ్వు లెగ్గులు,పెగ్గులకు అలవాటు పడ్డావని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రజల్లోకి రాకుండా ఫాంహోస్‌లో ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే నాగరాజు ప్రశ్నించారు. ఇకముందు విమర్శించే ముందు మాటలు జాగ్రత్తగా రావాలని అన్నారు.

# మోడీ ఛరిష్మాతోనే బిజెపికి మహర్దశ

### 2047 వరకు మోడీయే ప్రధానిగా ఉండాలి

### బిజెపి ఎంపి నిశికాంత్ దూబే ప్రకటన



న్యూఢిల్లీ, జూలై18 (జనంసాక్షి) : ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మాతోనే బిజెపికి ప్రజలు ఓట్లు- వేస్తున్నారని బిజెపి ఎంపి నిశికాంత్ దూబే పేర్కొన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత బిజెపి ముఖ చిత్రం మారిపోయిందని ప్రశంసించారు. వరుసగా మూడు సార్లు లోక్ సభ ఎన్నికలలో, అనేక రాష్ట్రాల్లో మోడీ నేతృత్వంలో బిజెపి పాలన కొనసాగిస్తోందని కొనియాడారు. బిజెపిలో మోడీ లేకుంటే లోక్ సభ ఎన్నికలలో 150 సీట్లు గెలుచుకోవడం కష్టం అని దూబే తన అభిప్రాయం వ్యక్తం చేశారు. బిజెపి లేని రాష్ట్రాలలో కూడా ఈ రోజు పాలన కొనసాగడానికి కారణం మోడీనేనని మెచ్చుకున్నారు. 75 ఏళ్ల తరువాత బిజెపి నేతలు పదవీ విరమణ చేస్తారనే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై నిశికాంత్ స్పందించారు. మోడీ శరీరం సహకరించినంతవరకు, అంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతే.. మోడీ లక్ష్యమని గుర్తు చేశారు. ఆ లక్ష్యం చేరేవరకు మోడీ అవసరం భారత్ కు ఉందన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత పేదల్లో ఎక్కువ మందికి బిజెపిపై నమ్మకం ఏర్పడిందని, తమ పార్టీ నచ్చినవాళ్లు కూడా ఉన్నారని, అందరికీ నచ్చాలని ఏమీ లేదన్నారు. మోడీ లేకపోతే బిజెపి బలంగా ఉండేది కాదని తాను కార్యకర్తగా నమ్ముతున్నానని దూబే కుండబద్దలు కొట్టారు.

## ఆప్ ఎమ్మెల్యే రాజీనామా

ఛండీగఢ్, జూలై 19 (జనంసాక్షి) : ఆమ్ ఆద్మీ పార్టీ ఖరార్ నియోజకవర్గం ఎమ్మెల్యే అన్మోల్ గగన్ మాన్ తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల్లోంచి కూడా తప్పుకుంటున్నట్టు ప్రకటిం చారు. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సాంధ్వాన్‌ను తన రాజీనామా లేఖను సమర్పించినట్టు- చెప్పారు. బరువెక్కిన హృదయంతో రాజకీయాలను విడిచిపెట్టాలని నిర్ణయిం చుకున్నట్టు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370